

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 22-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 247 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 2.32 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తర ఫల్గుణి; వర్జ్యం: మ. 2.18 -4.06; దుర్ముహూర్తం: సా. 4.14-4.58; అమృతఘడియలు: రా. 1.04-2.52; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఈడీ దూకుడు!

వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ విచారణ



కాకినాడ పోర్టు, సెజ్‌ను కొట్టేసిన వ్యవహారంలో మిగతా నిందితులకూ ఈడీ నోటీసులు

వారిని కూడా ప్రశ్నించనున్న అధికారులు

మనీలాండరింగ్ కోణంపై ఈడీ దర్యాప్తు

వాటాలు కొనటానికి వాడిన డబ్బులు ఎక్కడివి?

ఈ వ్యవహారంలో లబ్ధి ఎవరికి చేకూరింది?

విక్రాంత్‌రెడ్డిపై ప్రశ్నల వర్షం

కాకినాడ, విజయవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టులో వాటాలు కొట్టేసిన కేసులోని మనీ లాండరింగ్ కోణంపై ఈడీ దృష్టి సారించింది. వైసీపీ రాజ్య సభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని పిలిపించి తాజాగా విచారించింది. ఈ కేసులో సీఐడీ నింది తులుగా చేర్చిన వారందరికీ ఈడీ నోటీసులు జారీచేసింది. వారందరినీ పిలిపించి ఒక్కొక్కరుగా విచారించనుంది. విక్రాంత్‌రెడ్డి విచారణ సందర్భంగా.. ప్రధానంగా 'లావాదేవీ'లపై ఆరా తీసింది. డబ్బులు ఎలా వచ్చాయి.. ఎంత తరలించారు.. ఎవరికి లబ్ధి జరిగింది...అనే కోణంలో లోతుగా ఈడీ అధికారులు విక్రాంత్‌ను విచారించారు. గుచ్చి గుచ్చి లోతుగా ఆధారాలతో ప్రశ్నించారు. అయితే అధికారులు అడిగిన ప్రశ్నలకు విక్రాంత్ సరిగా సమాధానాలు చెప్పకుండా డొంక తిరుగుడుగా సమాధానాలు చెప్పినట్లు సమాచారం. జగన్ హయాంలో చోటు చేసుకున్న ఈ వ్యవహారంలో భారీగా మనీ లాండరింగ్ జరిగిందని ఈడీ ఇటీవల ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. విక్రాంత్ రెడ్డితోపాటు ఎంపీ విజయసాయిరెడ్డి.. సంతానం ఆడిట్ కంపెనీకి ఈడీ నోటీసులు జారీ చేసింది. అందులో భాగంగా ఇప్పుడు విక్రాంత్‌ను విచారణకు పిలిచింది. కాకినాడ సీపోర్టుకు

మిగతా 12వ పేజీలో...

అరబిందో శరత్‌చంద్రారెడ్డికి సీఐడీ తాఖీదు



24 తర్వాత వస్తానన్న డైరెక్టర్ శరత్

ఆడిట్ సంస్థ పీకేఎఫ్ ప్రతినిధుల విచారణ

మరో ఇద్దరు డైరెక్టర్లకూ నోటీసులు

వాటాలు వదులుకునేలా కేవీరావుపై నాడు ఒత్తిడి

అందులో కీలక పాత్ర పీకేఎఫ్‌దే

కేవీరావు 924 కోట్లు చెల్లించాలని ఆ సంస్థ నివేదిక

దాంతో వైసీపీ పెద్దల వేధింపులు

'సెటిల్మెంట్' తర్వాత రూ.9 కోట్లుగా మార్చిన వైనం



ఐపీఎస్ సంజయ్ ప్రాసిక్యూషన్

ఏసీబీకి అనుమతిచ్చిన ప్రభుత్వం

సీఐడీ చీఫ్, ఫైర్ సర్వీసెస్ డీజీగా ఉన్న సమయంలో అక్రమాలు

ఇప్పటికే ఆయనపై సస్పెన్షన్ వేటు

అరెస్ట్ చేసేందుకూ అవకాశం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ఆయన అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా, ఫైర్ సర్వీసెస్ డీజీగా విధులు నిర్వహించిన సమయంలో

మిగతా 12వ పేజీలో...

చైర్ కాదు ఫైర్..!



సినిమా హీరో అల్లు అర్జున్‌ను అనూహ్యంగా అరెస్టు చేయించడం, ఇప్పుడు మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు పెట్టించడం ద్వారా తాను ఏమిటో చెప్పకనే చెప్పారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. 'సీఎం అంటే కేవలం కుర్చీ కాదు.. ఫైర్' అని రేవంత్ రెడ్డి రుజువు చేస్తున్నారు.

రాజకీయాలలో ఉన్న వారు పార్టీలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను వదులుకోనేవారు కారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం మొత్తం రేవంత్ రెడ్డిని ఈసడించుకొనే వారు. రేవంత్ కూడా ఎక్కడా తగ్గకుండా తన నోటికి పని చెప్పేవారు. దీంతో ఇరు పక్షాల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫార్ములా-ఈ కేసు వ్యవహారం రేవంత్ చేతికి చిక్కింది.

తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన నాటి నుంచే కేసీఆర్‌కు దరిద్రం పట్టుకున్నట్టుగా ఉంది. అధికారం కోల్పోయారు. కన్నబిడ్డలు జైలు పాలవుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాను కక్ష కట్టి జైల్లో పెట్టించిన రేవంత్ రెడ్డి చేతిలో వరుస పరాభవాలను ఎదుర్కోవలసి రావడాన్ని మించిన విషాదం కేసీఆర్ జీవితంలో మరేమి ఉంటుంది?

జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు.

కారణం ఏమైనా గానీ గత ప్రభుత్వాల హయాంలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దాని పర్యవసానాలను ఇప్పుడు అనుభవిస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డి సుదీర్ఘ కాలం పాటు అధికారంలో కొనసాగుతారని అంత చదువుకున్న అధికారులు కూడా ఎలా విశ్వసించారో అంతుపట్టదు. సామాన్య ప్రజలకు ఉన్న ఇంగితం కూడా అఖిల భారత సర్వీసు అధికారులకు లేకపోవడం విషాదమే.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..


2

వర్మకు నోటీస్

'వ్యూహం' వెబ్‌సిరీస్‌కు చెల్లింపుల వ్యవహారంలో ఫైబర్‌నెట్ జారీ

వచ్చిన వ్యూస్ 2,228.. కానీ 2 లక్షలంటూ తప్పుడు ఇన్‌వాయిస్‌లు

2.09 కోట్లు ఇవ్వాలని వర్మ అండ్ కో వినతి

రూ.1.14 కోట్లు ఇచ్చిన గత పాలకులు

దాన్ని 18 శాతం అపరాధ రుసుముతో 15 రోజుల్లో వడ్డీతో చెల్లించాలి

వర్మకు, చిత్ర బృందానికి ఎండీ తాఖీదు


12

ఏబీవీపై కేసుల ఉపసంహరణ

రిటైర్డ్ అధికారికి గతంలో కోర్టులు, యూపీఎస్సీ ఇచ్చిన ఆదేశాలు వర్తించవు

జీవో జారీ చేసిన సీఎస్ నీరబ్ కుమార్


13

'మహిళలకు ఉచిత బస్సు'పై కమిటీ

అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో ఏర్పాటు

తెలంగాణ, కర్ణాటకల్లో పర్యటించనున్న కమిటీ


3

బలహీనపడిన వాయుగుండం

సముద్రంలోనే బలహీనం.. వాతావరణ శాఖ వెల్లడి

నేడూ ప్రభావం.. వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

రెండ్రోజుల వర్షాలతో ఉత్తరాంధ్ర రైతాంగానికి నష్టం

24 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమకు మళ్లీ వర్షసూచన


14

టోల్ రుసుము శాశ్వతం కాదు

నిరంతరం వసూళ్లంటే నిరంకుశత్వమే

ప్రాజెక్టులు ప్రజల ప్రయోజనం కోసం.. ప్రయివేటు వ్యక్తుల ఆర్జనల కోసం కాదు

లాభాలొచ్చినా ఇంకా రుసుములేంటి?

అధికార్లు నిజాయతీగా ఉండాలి: సుప్రీం

నోయిడా ఫ్లై వేపై టోల్ రద్దుకు సమర్థన

తండాల అభివృద్ధే లక్ష్యం

ప్రతి గిరిజన గ్రామానికీ రహదారి: పవన్ కల్యాణ్

డోలీ మోతల రహిత రాష్ట్రంగా ఏపీ.. గిరిజనుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర

రెండు నెలలకొకసారి ఏజెన్సీలో పర్యటిస్తా.. వారి అభ్యున్నతికి కృషి చేస్తా

యువత గంజాయికి దూరంగా ఉండాలి.. పర్యాటకంపై దృష్టి పెట్టాలి

జనవరిలో రోడ్ల నిర్మాణానికి మరో రూ.250 కోట్లు: డిప్యూటీ సీఎం

ఏజెన్సీలో రూ.105 కోట్లతో చేపట్టే 19 రోడ్లకు శంకుస్థాపన

అనంతగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. శనివారం ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో మారుమూలనున్న పినకోట పంచాయతీ బల్లగరువు గ్రామాన్ని

మిగతా 13వ పేజీలో...



శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువులో గిరిజన వాయిద్యాన్ని మోగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

చకచకా అమరావతి 2.0

నేటి నుంచి సంక్రాంతి వరకు టెండర్లే టెండర్లు

ఇక మహా యజ్ఞంలా రాజధాని పనులు

నిర్మాణాలకు ముందుకొచ్చిన 125 కేంద్ర సంస్థలు, ప్రైవేట్ వర్సిటీలు

ముందు వరుసలో ఆర్‌బీఐ.. బిట్స్ పిలానీ

నిర్మాణాలు ప్రారంభించనున్న ఎక్స్ఎల్ఆర్ఐ



విజయవాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల మహాయజ్ఞానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుడుతోంది. రుణ సంస్థల నిధులతో చేపట్టే పనులను జనవరి మొదటి వారంలో ప్రారంభించనుండగా.. ఆ నిధులతో సంబంధం లేని ప్రాజెక్టుల పనులను ముందుగా మొదలుపెడుతోంది. అందులో భాగంగా అమరావతి హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఆదివారం టెండర్లు పిలుస్తోంది. మొత్తం 20,89,260 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1,200 ఫ్లాట్లతో జీ ప్లస్ 18 అంతస్తులతో 12 టవర్లను రూ. 984.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. అమరావతి రాజధానిలో సీఆర్‌డీఏ చేపడుతున్న మొట్టమొదటి టౌన్‌షిప్ ప్రాజెక్టు ఇది. నూరు శాతం సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 720.5 కోట్లతో ఈ ప్రాజెక్టును

మిగతా 2వ పేజీలో...

మానవత్వం లేదా!?



హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖులు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదేం!?

హీరో, నిర్మాత.. ఎవరూ పిల్లాడి దగ్గరకు పోలేదు

పోలీసులు రావద్దని చెప్పినా థియేటర్‌కు హీరో

ఒకరు చనిపోయారని చెప్పినా థియేటర్ నుంచి బయటకు వెళ్లేందుకు హీరో ససేమిరా

అరెస్టు చేస్తామని హెచ్చరించి డీసీపీ కారు ఎక్కించారు

మానవత్వం లేని ఇలాంటి వాళ్లను అరెస్టు చేస్తే తప్పా?

రేవంత్ ఫైర్.. ఇక బెనిఫిట్ షోలు, టికెట్ పెంపులు బంద్

9

నాపై తప్పుడు ఆరోపణలు



అవాస్తవాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు

నేను ఎలాంటి రోడ్ షో, ఊరేగింపూ చేయలేదు

థాంక్యూ చెప్పేందుకే కారులోంచి చేతులూపా

థియేటర్ నుంచి వెళ్లాలని పోలీసులు చెప్పలేదు

థియేటర్ సిబ్బంది చెప్పగానే బయటికొచ్చేశాను

జరిగిన ఘోరం గురించి మర్నాడు తెలిసి షాకయ్యా

ఆస్పత్రికి వెళ్దామనుకున్నా లీగల్ టీమ్ వారించింది

నాకూ శ్రీతేజ్ వయసు కొడుకున్నాడు

బాధిత కుటుంబానికి అండగా ఉంటా: అల్లు అర్జున్

చిన్నారి ప్రాణం తీసిన జగన్ పుట్టినరోజు వేడుక!

నడి రోడ్డుపై వైసీపీ నాయకుల దానధర్మాలు.. భారీగా గుమిగూడిన జనం.. నిలిచిన ట్రాఫిక్

బీరువా పడి తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు దారివ్వని వైనం

చిన్నారిని భుజంపై వేసుకుని ఆస్పత్రికి తండ్రి.. అంబులెన్స్ రాకా ఆలస్యం.. చిన్నారి మృతి

కాకినాడ జిల్లా కొత్తపల్లిలో ఘోరం.. మైలవరంలో జోగి హంగామా.. ట్రాఫిక్‌లో చిక్కిన అంబులెన్స్

12

ఆ చీకటి జీవో సంగతి చూడండి!

ప్రభుత్వ భూములను తెగనమ్మేందుకు ల్యాండ్ పాలసీనే మార్చేసిన నాటి జగన్ సర్కారు

'మిషన్ బిల్డ్ ఏపీ' పేరిట వైసీపీ పెద్దల బిల్డప్.. నిధులు, వనరుల సమీకరణ ముసుగులో ప్రక్రియ

మంత్రివర్గం, అసెంబ్లీ దృష్టికే తీసుకురాని వైనం.. ఏకపక్షంగా 2021లో చీకటి జీవో 243 జారీ

అది 2019 నుంచే వర్తిస్తుందని ఆదేశాలు.. ఆ జీవో రాష్ట్రంలో ఇప్పటికీ అమల్లోనే..

తొలగించకుంటే ప్రభుత్వ భూములకు ముప్పే!

12

కారుపై పడ్డ కంటెయినర్



కంటెయినర్ కింద నుజ్జునుజ్జయిన కారు

బెంగళూరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు పిల్లలు సహా ఆరుగురి దుర్మరణం

మృతులంతా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ కుటుంబ సభ్యులు

ముందున్న కారును తప్పించబోయి డివైడర్ దాటిన కంటెయినర్

14



రామకుప్పం మండలం విజలాపురం కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో భువనేశ్వరి

చంద్రబాబు@ 96406 22226

కుప్పం సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు

జన నాయకుడు పోస్టర్‌ను ఆవిష్కరించిన భువనేశ్వరి

కుప్పం, డిసెంబరు 21: ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ స్వయంగా పూనుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నాయకుల చుట్టూ తిరగకుండా సింగిల్‌విండో పరిష్కార వేదికగా కార్యాలయాలను తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తొలిగా చిత్తూరు జిల్లా కుప్పం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించారు. అందుకోసం 9640622226 నంబరును అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతానికి కుప్పం నియోజకవర్గం ప్రజలకు మాత్రమే అందుబాటులోకి వచ్చిన ఈ సౌకర్యం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి వస్తుందని టీడీపీ వర్గాలు ప్రకటించాయి. 'జన నాయకుడు' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం పోస్టర్‌ను సీఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఇందు కోసం ఏర్పరచిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కౌంటర్లకు వెళ్లి దరఖాస్తులో ఫిర్యాదు, ఇతర వివరాలు రాసిఇస్తే అక్కడి సిబ్బంది పోర్టల్‌లో నమోదు చేస్తారు. ప్రజలు నేరుగా జన నాయకుడు పోర్టల్, యాప్‌లో సమస్యలను నమోదు చేసుకోవచ్చు. అదీకాకపోతే టోల్‌ఫ్రీ నం.96406 22226కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు. నిర్దేశిత గడువులోగా సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకుంటారు. ఈ అవకాశాన్ని కుప్పం ప్రజలు వినియోగించుకోవాలి. ఈ పోర్టల్‌ను త్వరలోనే రాష్ట్రమంతటా విస్తరిస్తారు' అని భువనేశ్వరి అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఆర్ సురేశ్‌బాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

లోకం తీరు





పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ బిల్డింగ్ నుంచి ఎంఎస్‌టీకి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్‌ను తరలించేందుకు జెండా ఊపుతున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కనే శాస్త్రవేత్తల బృందం,(ఇన్‌సెట్‌లో) ప్రయోగ వేదికకు రాకెట్ తరలింపు

ప్రయోగ వేదికకు పీఎస్ఎల్వీ-సీ60

30న స్పెడెక్స్‌తో నింగిలోకి పయనం

సూళ్లూరుపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 30న ప్రయోగించనున్న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రయోగానికి సంబంధించిన రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ బిల్డింగ్‌లో అనుసంధాన పనులు పూర్తి చేసుకొన్న రాకెట్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ శనివారం ఉదయం 8 గంటలకు పచ్చజెండా ఊపి ప్రయోగ వేదిక వద్దనున్న మొబైల్ సర్వీస్ టవర్ (ఎంఎస్‌టీ)కు తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాకెట్‌ను నెమ్మదిగా 11 గంటలకు ఎంఎస్‌టీ వద్దకు చేర్చారు. ఇక్కడ రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చి ప్రయోగానికి సిద్ధం చేస్తారు. ఈ రాకెట్ ద్వారా స్పెడెక్స్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. సాధారణంగా పిఫ్ భవనంలో రాకెట్ రెండు దశల వరకు అనుసంధానం చేసి ఎంఎస్‌టీకి తరలిస్తారు. అక్కడ మూడు, నాలుగు దశలను అనుసంధానం చేసి ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను పూర్తిచేస్తారు. అయితే ఈ ప్రయోగానికి తొలిసారిగా పిఫ్ భవనంలోనే పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ నాలుగు దశలను అనుసంధానం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, శాస్త్రవేత్తల బృందం పాల్గొన్నారు.

ఈసాతో ఇస్రో ఒప్పందం

పరస్పర సహకారానికి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఈసాకు చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని ఇస్రో 5న విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ విజయంతో ఈసా, ఇస్రో ఒప్పందం మరింత బలపడింది. గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించి ట్రాకింగ్ వంటి సాంకేతిక సహకారం అందించాలని యూరోపియన్ అంతరిక్ష కేంద్రాలను ఇస్రో కోరింది. ఈ మేరకు ఈసా డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోసెప్ అస్‌బాచర్‌తో ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

సీఎం బందోబస్తు పరిమితం!

జగన్‌తో పోలిస్తే ఎనిమిదో వంతు సిబ్బందితోనే విధులు

జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్నా రక్షణ వలయం చిన్నదే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న భద్రతా సిబ్బందిని బాగా తగ్గించారు. జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్నప్పటికీ ఆయన రక్షణ వలయం పరిమితంగానే ఉంటోంది. ప్రస్తుతం ఆయన భద్రత కోసం ఉన్న సిబ్బంది కేవలం 121 మంది మాత్రమే. గత సీఎం జగన్‌తో పోలిస్తే ఎనిమిదో వంతు సిబ్బందే ఇప్పుడు విధుల్లో ఉంటున్నారు. దీనివల్ల భద్రతాపరమైన ఖర్చు కూడా భారీగా తగ్గిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. గతంలో జగన్ కాన్వాయ్‌లో 17 వాహనాలు ఉండగా ఇప్పుడు 11 మాత్రమే ఉంటున్నాయి. ఎన్ఎస్‌జీ రక్షణలో ఉన్న చంద్రబాబుకు ఇంకా ఎక్కువ భద్రత సమకూర్చే అవకాశం ఉన్నా ఆయన అంత అవసరం లేదని వారించడంతో కనీస సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు నివాసంలో ఆయన కుమారుడు, మంత్రి లోకేశ్ ప్రతి రోజూ నిర్వహించే జరిగే ప్రజా దర్బార్‌కు వందల సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. వారికి ఏ ఇబ్బంది రాకుండా భద్రతా సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని సంఘాలు అక్కడ చిన్న చిన్న ధర్నాలు నిర్వహిస్తున్నా, పోలీసు అధికారులు వారికి నచ్చజెప్పి పంపుతున్నారు.

డ్రోన్లతో భద్రత

చంద్రబాబు తన భద్రతకు సాంకేతిక పరిజ్ఞానం జోడించాలని సూచించడంతో పోలీసు అధికారులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. దీంతో తక్కువ సిబ్బందితోనే భద్రత కల్పించడం సాధ్యపడుతోంది. ఈ డ్రోన్ ప్రతి రెండు గంటలకు ఒకసారి పైకి ఎగిరి చుట్టూ ఉన్న పరిస్థితులను వీడియో తీస్తోంది. ఏ చిన్న తేడా కనిపించినా వెంటనే పర్యవేక్షక విభాగానికి సమాచారం అందుతోంది. ఈ డ్రోన్ నిర్దేశిత సమయానికి తానే ఎగిరి నిర్దేశిత ప్రాంతంలో తిరగడంతో పాటు తిరిగి వచ్చాక తానే చార్జింగ్ కూడా పెట్టుకొంటోంది. ఇది భద్రతా సిబ్బందికి బాగా ఉపయుక్తంగా ఉంటోంది.

జిల్లాల పర్యటనల్లోనూ...

సీఎం జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు కూడా అనవసర హడావుడి వద్దని అధికారులకు గట్టిగా చెబుతున్నారు. ఆయన ఇటీవల పోలవరం పర్యటనకు వెళ్లినప్పుడు భారీస్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపై అంత బందోబస్తు వద్దని ఉన్నతాధికారులకు సీఎం స్పష్టం చేశారు. తాను పర్యటించే సమయంలో ట్రాఫిక్‌ను గంటల తరబడి ఆపవద్దని, బాగా దగ్గరకు వచ్చినప్పుడు కొద్దిసేపు ఆపితే సరిపోతుందని సూచించారు. శుభకార్యాలకు వెళ్లినప్పుడు తన కారణంగా మిగిలిన అతిథులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని, ఎవరికీ అసౌకర్యం కలిగించవద్దని ఆదేశించారు. ఇక సీఎం పర్యటన జరిగే ప్రాంతాల్లో చెట్లు కొట్టడం, పరదాలు కట్టడం, కిలోమీటర్ల తరబడి బారికేడ్లు నిర్మించడం వంటివి కూడా అధికారులు నిలిపివేశారు. 'చంద్రబాబుకు సెటిల్‌మెంట్లు, వాటాలు లాక్కొనే వ్యవహారాలు లేవు. ఆయన ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. అందుకే కనీస భద్రత సరిపోతోంది' అని ఒక మంత్రి వ్యాఖ్యానించారు.



జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పర్యటన సమయంలో రోడ్ల దిగ్బంధం (ఫైల్)

జగన్ రక్షణకు ఏడాదికి రూ.90 కోట్లు!

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన రక్షణ కోసం నియమించుకున్న భద్రతా సిబ్బంది అక్షరాలా 980 మంది. తాను నివసించే తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ చెక్‌పోస్టులు, బారికేడ్లు, ఆర్మ్‌డ్ గార్డ్స్‌తో అదో నిషేధిత ప్రాంతాన్ని తలపించేది. ప్రత్యేక ఆపరేషన్లకు వినియోగించే ఆక్టోపస్ బృందాలను తన ఇంటి చుట్టూ 24 గంటలూ మొహరించారు. ఇంటికి నలుమూలలా నలుగురు స్నైపర్లనూ నియమించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి ఈ స్థాయి భద్రత లేదు. ఇలాంటి ఏర్పాట్లు గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎప్పుడూ లేవని, కేవలం జగన్ భద్రత కోసం నెలకు రూ.7.5 కోట్లు చొప్పున ఏడాదికి రూ.90కోట్ల వరకూ వెచ్చించారని సంబంధిత వర్గాల కథనం.

పోలవరం ముంపుపై ఎస్టీ కమిషన్ నోటీసు

- బీజేడీ ఫిర్యాదుపై స్పందించిన కమిషన్

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు డిశ్చార్జ్ సామర్థ్యాన్ని 36 నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచుతూ డిజైన్లను సమూలంగా మార్చేశారని, దీనివల్ల ఒడిశాలోని గిరిజన ప్రాంతాలు భారీగా ముంపునకు గురవుతాయని ఆ రాష్ట్ర బిజూ జనతాదళ్ పార్టీ(బీజేడీ) నేతలు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. డిశ్చార్జి సామర్థ్యాన్ని పెంచడంతో డ్యామ్ వద్ద నీటిమట్టం 232 అడుగులు చేరుతుందని, ఒడిశాపై బ్యాక్ వాటర్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. పెరిగిన ముంపు ప్రాంతాలకు పూర్తి పరిహారం చెల్లించాలని, బీజేడీ ప్రజాప్రతినిధుల పిటిషన్‌కు 3రోజుల్లోగా సమాధానం చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు పంపింది. సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు 11న పంపిన నోటీసులో.. మూడు రోజుల్లో వాస్తవాలతో కూడిన సమాధానం చెప్పాలని, లేకుంటే ఆర్టికల్ 338ఎ ప్రకారం సివిల్ కోర్టుకు ఈ వివాదాన్ని పంపే అధికారం కమిషన్‌కు ఉందని హెచ్చరించింది.

ఇదీ బీజేడీ ఫిర్యాదు: పోలవరం నుంచి 36 లక్షల క్యూసెక్కుల డిశ్చార్జి సామర్థ్యంతో చేసిన డిజైన్‌ను ఒడిశా, మధ్యప్రదేశ్ అంగీకరించాయని, ఈ ఒప్పందానికి విరుద్ధంగా డిశ్చార్జి సామర్థ్యాన్ని 50లక్షల క్యూసెక్కులకు పెంచుతూ డిజైన్లను మార్చేసిందని బీజేడీ ఫిర్యాదు చేసింది. ముంపు ప్రభావం వల్ల ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీకి చెందిన వేలాది గిరిజన కుటుంబాలు నిర్వాసితులవుతాయని, బ్యాక్ వాటర్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని కోరింది. మల్కాన్‌గిరి జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, దీనివల్ల గిరిజనులు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటారని, వారికి నష్టపరిహారంగా భూమికి బదులు భూమి, పునరావాసం, నష్టపరిహారం కింద నగదు చెల్లించాలని కోరింది. భవిష్యత్తులో ఒడిశాకు నష్టం వాటిల్లదన్న హామీ ఇవ్వాలని, మల్కాన్‌గిరి ప్రజలకు సంపూర్ణ న్యాయం చేయాలని కోరింది.

మరిదే సూత్రధారి!

- 'పార్శిల్‌లో మృతదేహం డెలివరీ' కేసులో వీడుతున్న మిస్టరీ
- సిద్ధార్థవర్మ కోసం పోలీసుల వేట

ఉండి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో 'పార్శిల్‌లో మృతదేహం డెలివరీ' మిస్టరీ వీడుతోంది. ప్రధాన సూత్రధారి తులసి మరిది సిద్ధార్థ వర్మే అని భావిస్తున్నారు. పోలీసులు మాత్రం ఈ కేసు విషయంలో గుంభనంగా వ్యవహరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలిసేందుకు మరో రెండు రోజులు పడుతుందని జిల్లా ఎస్పీ నయీం అస్మి ప్రకటించారు. వివరాలివీ.. యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, హైమావతి దంపతులకు నాగతులసి, రేవతి కుమార్తెలు. రంగరాజుకు మూడెకరాల పొలం ఉంది. పదేళ్ల క్రితమే నాగతులసిని భర్త వదిలి వెళ్లిపోయాడు. ఆమె కుమార్తెతో కలిసి యండగండిలోని తండ్రి రంగరాజు వద్దే ఉండేది. రెండేళ్ల క్రితం తల్లి, సోదరి రేవతితో విభేదాలు రావటంతో తులసి పాలకోడేరు మండలం గరగపర్రులో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. మరోవైపు అప్పటికే వివాహమైన సిద్ధార్థవర్మ.. తులసి సోదరి రేవతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో బంటుమిల్లి సమీప గ్రామంలో ఉండేవాడు. రెండేళ్ల క్రితమే రేవతిని యండగండిలోని తండ్రి ఇంటిలో ఉంచాడు. అప్పటి నుంచి రంగరాజు, భార్య హైమావతితో రేవతి ఉంటోంది. ఈ క్రమంలో మూడు ఎకరాల విషయంలో గొడవలు రావడంతో బంధువులంతా తులసికి మద్దతుగా నిలిచారు. దీంతో సిద్ధార్థవర్మ.. వదిన తులసిని టార్గెట్ చేశాడని స్థానికులు చెబుతున్నారు. కాగా, తులసి యండగండిలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటోంది. రాజమండ్రి క్షత్రియ సేవా సమితి పేరుతో సిద్ధార్థవర్మ రెండుసార్లు టైల్స్, రంగు డబ్బాలు పంపారు. మూడోసారి గురువారం సాయంత్రం ఆటోలో మృతదేహంతో ఉన్న చెక్క పెట్టి పార్శిల్‌ను పంపింది సిదార్థవర్మగానే పోలీసులు గుర్తించారు. అందులో రూ.కోటి 30లక్షలు చెల్లించకపోతే ఇబ్బందులొస్తాయని అని రాసి ఉన్న లెటర్ కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే!.

ఇంతకీ మృతుడు ఎవరు?

ఉండి మండలం సాగిపాడు వద్ద ఓ మహిళ ఆటోలో పార్శిల్ ఎక్కించి, రంగరాజు ఇంటికి చేరే విధంగా ముసుగు వేసుకుని వెళ్లిందని స్థానికులు చెబుతున్నారు. పార్శిల్ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న తులసి.. తండ్రి రంగరాజు ఇంటికి వెళ్లింది. పార్శిల్ తెరిచిన వెంటనే మృతదేహం ఉండటంతో తులసి కంగారుపడి కేకలు వేయడంతో బంధువులు ఆమెను పక్కకు తీసుకువచ్చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, కీలక నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్న సిద్ధార్థవర్మ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారని ప్రచారం జరిగింది. కానీ పోలీసులకు దొరకకుండా ఫోన్ సిమ్‌లను మారుస్తున్నాడు. ఆటోలో పార్శిల్ ఎక్కించిన మహిళ ఎవరనే దానిపైనా ఆరా తీస్తున్నారు. తులసి తల్లి కూడా పరారీలో ఉంది. పార్శిల్‌లో వచ్చిన మృతదేహానికి సంబంధించి ఎటువంటి సమాచారం అందటం లేదు. చుట్టుపక్కల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసులు నమోదు కాలేదు. దీంతో ఈ మృతదేహాన్ని ఎక్కడి నుంచి తెచ్చారనేది మిస్టరీగా మారింది. సిద్ధార్థ వర్మ దొరికితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

చకచకా అమరావతి 2.0



(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అమరావతి విధ్వంసంలో ఈ ప్రాజెక్టు కూడా ఆగిపోయింది. ఇప్పుడు ప్రాజెక్టు వ్యయం రూ. 984.10 కోట్లకు పెరిగింది. అయితే భూమి ధర ఎకరాకు రూ. 4.1 కోట్ల చొప్పున 14.46 ఎకరాలకు రూ. 59.32 కోట్లు, ఇతర ఖర్చులు రూ. 37.76 కోట్లు కూడా కలిపితే మొత్తంగా రూ. 1,081.18 కోట్లకు చేరుతోంది. చదరపు అడుగుకు రూ. 4,049 చొప్పున ఫ్లాట్లను విక్రయిస్తే మొత్తం రూ. 845.89 కోట్ల ఆదాయం వస్తుంది. వైసీపీ ప్రభుత్వం విధ్వంసం కారణంగా ఈ ప్రాజెక్టు జాప్యం వల్ల రూ. 270.71 కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఈ నష్టంలో రెరా కేసుల్లో విధించిన వడ్డీ రూ. 35.42 కోట్లు కూడా ఉంది. హ్యాపీనెస్ట్ తర్వాత వరుసగా రాజధానిలో భవన నిర్మాణ పనులు, ఎల్‌పీఎస్ ఇన్ఫ్రా పనులు, ట్రంక్ ఇన్ఫ్రా పనులు, జీఏడీ టవర్ల నిర్మాణ పనులు వంటి వాటికి టెండర్లను పిలవనుంది.

హ్యాపీనెస్ట్ మిగులు ఫ్లాట్లకు దరఖాస్తులు ఆహ్వానం

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన 1,200 మంది లబ్ధిదారుల్లో 100 మందికి పైగా డబ్బులు వెనక్కి తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం విధ్వంసం కారణంగా చాలా మంది రెరాను ఆశ్రయించారు. వారికి వడ్డీతో సహా చెల్లించాలని రెరా ఆదేశించింది. దీంతో వడ్డీతో కలిపి కొందరు డబ్బులను తీసుకున్నారు. దీంతో మిగులు ఫ్లాట్లకు మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించటానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుడుతోంది. ముందు వచ్చిన వారికి ముందు అన్న ప్రాతిపదికన సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

మళ్లీ నాటి కళ..

సంక్రాంతి వరకు వరుసగా సీఆర్‌డీఏ టెండర్లను పిలవబోతోంది. ముందుగా సీఆర్‌డీఏ సొంత నిధులు, హడ్కో నిధులు, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో చేపట్టే పనులకు, జనవరి మొదటి వారం నుంచి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో చేపట్టే పనులకు టెండర్లు పిలవనుంది. ఇక అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూముల్లో కూడా ఆయా సంస్థలు పనులు చేపట్టనున్నాయి. సీఆర్‌డీఏ ఇప్పటి వరకు 130 కేంద్ర సంస్థలకు భూమి కేటాయించగా.. వాటి లో ప్రస్తుతం 125 సంస్థలు నిర్మాణ పనులు చేపట్టడానికి ముందుకు వచ్చా యి. ఆర్‌బీఐ కూడా తన శాఖను త్వరలోనే అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్టు సీఆర్‌డీ ఏకు సమాచారం ఇచ్చింది. ఇక బిట్స్ పిలానీ కూడా తమకు సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన కేటాయించిన 35 ఎకరాల్లో పనులు ప్రారంభించటానికి సిద్ధమౌతోంది. అలాగే ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ సంస్థ కూడా అతి త్వరలోనే తమకు కేటాయించిన 50 ఎకరాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నట్టుగా సీఆర్‌డీఏకు చెప్పింది. దీంతో అన్ని పనులు ఒకేసారి జరగటం ద్వారా అమరావతిలో మళ్లీ 2018 నాటి కళ కనిపించనుంది.

కుమారుడి వేధింపులు భరించలేక..

సుపారీ ఇచ్చి హత్య చేయించిన తండ్రి

- మితిమీరిన దుష్ప్రవర్తనతో నిర్ణయం
- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఘటన

పుంగనూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుమారుడి వేధింపులు భరించలేక కన్నతండ్రే బిడ్డను సుపారీ ఇచ్చి హత్య చేయించిన ఉదంతం శనివారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువ మామిడి గుంపలపల్లెకు చెందిన గంగులరెడ్డి, నారాయణమ్మ దంపతుల కుమారుడు సోమశేఖర రెడ్డి(36). పదేళ్ల క్రితం సోమశేఖర్‌రెడ్డి వేధింపులు భరించలేక అతని భార్య, ఐదేళ్ల కుమారుడు బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కేసులో సోమశేఖర్‌రెడ్డితో పాటు తండ్రి గంగులరెడ్డి కూడా జైలు శిక్ష అనుభవించారు. జైలు నుంచి బయటకు వచ్చాక సోమశేఖర్‌రెడ్డి ఊర్లో అందరితో గొడవలకు దిగేవాడు. ఇతడి ప్రవర్తన భరించలేక సోదరుడు జ్ఞానేంద్రరెడ్డి తన భార్యాపిల్లలతో దూరంగా వెళ్లిపోయాడు. తల్లిదండ్రులతో ఉంటోన్న సోమశేఖర్‌రెడ్డి.. వారిని కూడా కొట్టి డబ్బులు లాక్కోవడం చేసేవాడు. మళ్లీ పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించి, ఎవరూ అమ్మాయిని ఇవ్వకపోవడంతో ఆ కోపాన్ని అమ్మానాన్నల మీద చూపేవాడు. ఇలా సోమశేఖర్‌రెడ్డి ప్రవర్తన మితిమీరిపోవడంతో తండ్రి గంగులరెడ్డి అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ గానుగలగడ్డకు చెందిన అమర్(24),రమేశ్(20) అనే ఇద్దరితో మాట్లాడి రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.30 వేలు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం సోమశేఖర్‌రెడ్డిని పథకం ప్రకారం కృష్ణాపురం సమీపంలోని బోయకొండ అటవీ ప్రాంతానికి తీసుకువచ్చిన అమర్, రమేశ్.. అతని చేత మద్యం తాగించి హత్య చేశారు. రెండు రోజుల క్రితం నిందితుడు ఈ విషయాన్ని మద్యం మత్తులో బయటకు చెప్పడంతో పోలీసులకు తెలిసింది. ఈలోగా పశువుల కాపరులు అడవిలో దుర్వాసన వస్తుండడంతో గమనించగా, గుర్తుపట్టలేని విధంగా మృతదేహం కన్పించింది. చంద్రమాకులపల్లె వీఆర్వో శ్రీనివాసులుకు ఈ సమాచారం తెలపగా, ఆయన ఫిర్యాదు మేరకు పుంగనూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహం పాడైపోవడంతో తరలించడానికి వీలుకాలేదు. దీంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిందితులు గంగులరెడ్డి, అమర్, రమేశ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వర్మకు బిగ్ షాక్!

'వ్యూహం' వెబ్‌సిరీస్‌కు చెల్లింపులపై ఫైబర్‌నెట్ లీగల్ నోటీసులు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు కూటమి ప్రభుత్వం గట్టి షాకిచ్చింది. ఎన్నికలకు ముందు జగన్‌కు, వైసీపీకి ప్రయోజనం చేకూర్చేలా ఆయన తీసిన 'వ్యూహం' వెబ్‌సిరీస్‌కు నిబంధనలు, ఒప్పందానికి విరుద్ధంగా రూ.1,14,96,610 చెల్లించడాన్ని ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్(ఏపీఎస్ఎఫ్ఎల్) తీవ్రంగా పరిగణించింది. దీనివల్ల సంస్థకు ఆర్థికంగా నష్టం జరిగిందంటూ ఎండీ దినేశ్‌కుమార్ దర్శకుడు వర్మకు, చిత్ర నిర్వాహకులకు శనివారం లీగల్ నోటీసులు జారీచేశారు. సదరు మొత్తాన్ని 12 శాతం వడ్డీతో, 18శాతం అపరాధ రుసుముతో.. నోటీసు అందుకున్న 15రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. గతంలో ఫైబర్‌నెట్ ఏజీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వుయ్యూరు గుణశంశాక్ రెడ్డి, మాజీ ఎండీ మద్దిరాల మధుసూదన్‌రెడ్డి, మెస్సర్స్ ఆర్జీవీ ఆర్వీ గ్రూప్ భాగస్వామి రవిశంకర్ వర్మ గొట్టుముక్కల, ఆర్జీవీ ఆర్వీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాంగోపాల్‌వర్మ పెనుమత్స, మెస్సర్స్ ఆర్జీవీ ఆర్వీ గ్రూప్‌కు లీగల్ నోటీసులు పంపారు. 'వ్యూహం' తొలిభాగానికి 1,845 వ్యూస్, రెండో భాగానికి 383 వ్యూస్ వచ్చాయని.. అయితే 2,09,000 వ్యూస్ వచ్చాయంటూ రూ.2,09 కోట్లకు వర్మ అండ్ కో తప్పుడు ఇన్వాయిస్ సమర్పించారని తెలిపారు. దీనిద్వారా సంస్థకు ఆర్థికంగా భారీ నష్టాన్ని చేకూర్చారని తెలిపారు.



ఒప్పంద పత్రంలో ఎవరి పేర్లూ లేవు

సహజంగా అవగాహనా ఒప్పందాలు చేసుకున్నప్పుడు.. ఎవరితో ఎవరు ఒప్పందం చేసుకుంటున్నారో.. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలేమిటో స్పష్టంగా ఉంటాయి. ఇవేవీ గత ఫైబర్‌నెట్ యాజమాన్యం పాటించలేదని దినేశ్‌కుమార్ నోటీసులో పేర్కొన్నారు. వ్యూహం చిత్ర బృందంతో మార్చి 5న ఏపీఎస్ఎఫ్ఎల్ చేసుకున్న ఒప్పందంలో.. అస్సైనీల పేర్లు ఎక్కడా ప్రస్తావించలేదు. అస్సైనీల ప్రతినిధుల పేర్లూ రాయలేదు. ఆర్జీవీ మేకర్స్‌కు చెందిన రబ్బర్ స్టాంప్ లేదా సీల్‌పై నిర్మాతల పేర్లూ లేవు. అస్సైనర్ ప్రతినిధుల పేర్లు కూడా ఒప్పందంలో కనిపించలేదు. ఏజీఎంగా శశాంక్‌రెడ్డి సంతకం ఉన్నప్పటికీ.. ఆ సంతకం కింద ఆయన పేరు రాయలేదు. ఇలాంటి ఒప్పందం చెల్లదు. పైగా సదరు ఒప్పందం చేసుకునేందుకు.. ముందస్తుగా ఫైబర్‌నెట్ వేసిన కమిటీ సిఫారసు కూడా లేదు. సాంకేతిక కమిటీ ఆమోదమూ లేదు. అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా వ్యవహరించారు. సాంకేతిక కమిటీ సిఫారసులు లేకుండానే ఒప్పందం చేసుకున్నారు. 25 సినిమాలను ప్రసారం చేసేందుకు వర్మతో ఫైబర్‌నెట్ అవగాహన కుదుర్చుకుంది. ప్రతి సినిమాకు వచ్చే 'వ్యూస్'తో సమకూరే ఆదాయాన్ని చెరిసగం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ 'వ్యూహం' వెబ్‌సిరీస్ రెండు భాగాలకు కలిపి 2,228 వ్యూస్ రాగా.. 2 లక్షల వ్యూస్ వచ్చినట్లు చూపించారు. ఇందుకు చెల్లించే మొత్తంలో 75 శాతం ఆర్జీవీకి ఇచ్చారని నోటీసులో పేర్కొన్నారు. ఇన్వాయిస్‌లను పరిశీలిస్తే.. మార్చి 11న 70,000 వ్యూస్‌కు గాను రూ.70,00,000, మార్చి 14న 49,000 వ్యూస్‌కు రూ.49,00,000, మార్చి 18న 90,000 వ్యూస్‌కు రూ.90,00,000.. మొత్తం పన్నులతో కలిపి రూ.2,09,00,000 చెల్లించారు. వ్యూహం తొలి భాగానికి 1,845 వ్యూస్‌తో రూ.1,86,225, రెండో భాగానికి 383 వ్యూస్‌తో రూ.50,046 (మొత్తం రూ.2,36,271) మాత్రమే ఆదాయం వచ్చింది. అయితే గత యాజమాన్యం వర్మకు ఏకంగా రూ.1,14,96,610 చెల్లించడాన్ని ప్రస్తుత యాజమాన్యం తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై విచారణ జరపాలని ఫైబర్‌నెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశించారు. దీని ఆధారంగా సంబంధిత సిబ్బందిపై క్రిమినల్ చర్యలు చేపడతామని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

బిల్డింగ్ రూల్స్‌పై అభ్యంతరాల స్వీకరణ

- వారంలోగా డీటీసీపీకి సమర్పించాలి
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్ రూల్స్-2017 కింద ప్రతిపాదించిన ముసాయిదా సవరణలపై అభ్యంతరాలు, సూచనలు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యంతరాలు, సూచనలను 7రోజుల్లోగా మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు లేదా పురపరిపాలన, పట్టణాభివృద్ధిశాఖకు పంపాలని సూచించింది. ముసాయిదా సవరణలు ఇలా...

- రక్షణ సంస్థలకు, రైల్వే ఆస్తులకు అనుకుని ఉన్న స్థలాల విషయంలో ఆయా విభాగాల అధికారుల నుంచి ఎన్‌వోసీ అవసరం లేదు. అయితే అధికారులు సూచించిన నియమాలను దరఖాస్తుదారులు అనుసరించాలి.
- బేస్‌మెంట్లు 500 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం గల ప్లాట్లకు మాత్రమే అనుమతిస్తారు.
- అగ్నిమాపక సేవా నిబంధనలకు లోబడి అనుమతించిన అంతస్తుల్లో మార్పులు లేకుండా భవనం ఎత్తును గరిష్ఠంగా 2మీ. వరకు మార్చుకోవచ్చు. అప్రోచ్ రోడ్డులో వంపులు, మలుపులు ఉంటే అగ్నిమాపక వాహనాలు తిరగడానికి వీలుగా టర్నింగ్ సర్కిల్ కనీసం 9.0 మీటర్ల వ్యాసార్థం ఉండాలి. గ్రౌండ్ లెవల్/ రోడ్డు లెవల్ నుంచి భవనం ఎత్తు 18 మీటర్లు దాటినప్పుడు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ పొందాలి.
- పోడియం పార్కింగ్‌కు సంబంధించి పోడియం ఫ్లోర్ గరిష్ఠ ఎత్తు 15 మీటర్లు ఉండాలి. స్థలం విస్తీర్ణం 10 ఎకరాల కంటే ఎక్కువుంటే సింగిల్ పోడియం అనుమతించరు. పోడియం అంతస్తుల కోసం ఆల్‌రౌండ్ సెట్‌బ్యాక్‌లు ఉండాలి. అప్రోచ్ రోడ్డు వెడల్పు ఆధారంగా భవనం ఎత్తు ఉండాలి.



రఘుదేవపురం వీధుల్లో తిరుగుతున్న చిట్టిబాబాజీ ఆశ్రమ ఏనుగు లీల(ఫైల్)

చిట్టిబాబాజీ ఆశ్రమ ఏనుగు ఆకస్మిక మృతి

సీతానగరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఊరు కన్నీళ్లు పెట్టింది.. అయ్యో పాపం అంటూ నివాళులర్పించింది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలోని సద్గురు శ్రీ చిట్టిబాబాజీ ఆశ్రమానికి 2009 ఆగస్టు 10వ తేదీన అప్పటి అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జార్ఖిండ్ మూడున్నర ఏళ్ల వయసు ఉన్న ఏనుగును బహూకరించారు. ఆశ్రమంలో అడుగుపెట్టిన ఏనుగుకు లీల అని నామకరణం చేశారు. గత 19 ఏళ్లుగా గ్రామస్థులకు ఆ ఏనుగుతో అనుబంధం పెరిగింది. ఈ నేపథ్యంలో లీల శనివారం అర్ధరాత్రి 12:25 గంటలకు తుదిశ్వాస విడిచింది. జిల్లా అటవీశాఖాధికారి ఏనుగు కళేబరానికి పంచనామా నిర్వహించి ఖననం చేయడానికి అనుమతిచ్చారు. పెదకొండేపూడిలోని గోశాలలో ఖననం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బలహీనపడిన వాయుగుండం

- సముద్రంలోనే బలహీనం.. వాతావరణ శాఖ వెల్లడి
- నేడూ ప్రభావం.. వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక
- రెండ్రోజులు వర్షాలతో ఉత్తరాంధ్ర రైతాంగానికి నష్టం
- 24 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమకు మళ్లీ వర్షసూచన
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచన


వాయుగుండం దిశను సూచిస్తూ ఐఎండీ విడుదల చేసిన చిత్రం

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్రను వణికించిన వాయుగుండం బలహీనపడింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఆ వాయుగుండం శనివారం ఉదయం నుంచి గంటకు ఎనిమిది కిలోమీటర్ల వేగంతో తూర్పు ఈశాన్యంగా పయనిస్తూ శనివారం సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఆదివారం సాయంత్రానికి పూర్తిగా సముద్రంలోనే బలహీనపడుతుందని వాతావరణశాఖ తెలిపింది. అయితే దీని ప్రభావం ఆదివారం ఉదయం వరకూ ఉత్తరాంధ్ర, ఒడిశా తీర ప్రాంతాలపై ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర భారతంలో పడమర నుంచి తూర్పు దిశగా భూ ఉపరితలానికి 12.5 కి.మీ. ఎత్తులో గంటకు 150 నుంచి 175 కి.మీ. వేగంగా వీస్తున్న జెట్ స్ట్రీమ్ గాలులు, ఇంకా ఉత్తరాదిలో కొనసాగుతున్న వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావంతో వాయుగుండం దిశ మార్చుకుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. వాయుగుండం ఆదివారం ఉదయం నుంచి పూర్తిగా బలహీనపడుతుందని వివరించారు. ఆదివారం వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. ఆదివారం కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఉత్తరాంధ్ర రైతాంగానికి నష్టం

వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో శుక్రవారం, శనివారం పలుచోట్ల భారీవర్షాలు కురిశాయి. పినపెంకిలో 88.5, ఇచ్ఛాపురంలో 87.5, ఇద్దనవలసలో 84.75, బొండపల్లిలో 80.5, రాజపురంలో 80.5, బాతుపురంలో 79.25, జరజాపుపేట, గంభీరం, కాపులుప్పాడల్లో 77.5, గుర్లతెర్లాంలో 74.5, విశాఖపట్నం రూరల్‌లోని సర్వీస్ రిజర్వాయర్ వద్ద 73 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వరి పనలు, కుప్పలు నీట మునిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న చేలు నేలకొరిగాయి. కల్లాల్లో ధాన్యం తడిసిపోయాయి. దీంతో వేలాది మంది రైతులు నష్టపోయారు.

ఉత్తరాంధ్ర అధికారులతో సీఎం సమీక్ష

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయా జిల్లాల్లో అన్ని స్థాయిల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి, పని చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలపై సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వర్షాల తర్వాత పంట నష్టం వివరాలు సేకరించి, రైతులకు సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులను సీఎంవో అధికారులు సీఎంకు వివరించారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

తూర్పుగాలులతో మళ్లీ వర్షాలు

బంగాళాఖాతంలో మంగళవారం నుంచి తూర్పుగాలులు బలంగా మారనున్నాయి. రెండు రోజులపాటు సముద్రం నుంచి తేమగాలులు తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల వైపుగా వీయనున్నాయి. ఈ ప్రభావంతో 24, 25 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.


ఇరుముడులతో ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భవానీలు

భవానీ దీక్షల విరమణలు ప్రారంభం

- ఇంద్రకీలాద్రికి భారీగా తరలివస్తున్న దీక్షాదారులు

విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీ దీక్షల విరమణల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 25వ తేదీ వరకు దీక్షల విరమణలు కొనసాగనున్నాయి. దీక్షల విరమణల ప్రారంభ సూచికగా శనివారం ఉదయం 6.30 గంటలకు హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపనతో, దీక్షా విరమణలకు అంకురార్పణ చేశారు. దీక్షా విరమణలకు అనేక ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో దీక్షాదారులు తరలి వస్తున్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానం, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. రుసుము ద్వారా దర్శనం, ఆర్జిత సేవలను ఈ నెల 25వ తేదీ వరకు రద్దు చేశారు.

టీడీపీ పలాస- కాశీబుగ్గ అధ్యక్షుడి హత్యకు కుట్ర

- నలుగురు వైసీపీ నాయకులు, బిహార్ ముఠా అరెస్టు

పలాస, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజును హతమార్చేందుకు కుట్రపన్నిన నలుగురు వైసీపీ నాయకులను, ముగ్గురు బిహార్ వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఏడోవార్డు చిన్నబడాం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అంపోలు శ్రీనివాసరావు, కూర్మాపు ధర్మారావు, కోత శ్రీనివాసరావు, మందస మండలం జిల్లుండ గ్రామానికి రౌతు చంద్రశేఖర్.. చిన్నబడాంలోనే నివాసం ఉంటున్న బడ్డ నాగరాజును హత్య చేసేందుకు పథకం వేశారు. నాగరాజును హతమార్చేందుకు బిహార్ రాష్ట్రం నవడా జిల్లాకు చెందిన మహ్మద్ ఇక్బాల్ రాజాఖాన్, ఎండి.అమీర్, నిరంజన్‌కుమార్ పాశ్వాన్‌కు రూ.10 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు చెల్లించారు. ఈ క్రమంలో ఈ నెల 20న శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌తో పాటు రాజాఖాన్, అమీర్ రెక్కీ నిర్వహించి.. నాగరాజును చంపేందుకు తుపాకులు సిద్ధం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కాశీబుగ్గ పోలీసులకు ఈ సమాచారం అందించడంతో ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా.. టీడీపీ పట్టణ అధ్యక్షుడి హత్యకు కుట్ర వ్యవహారం బయటపడింది. ఆ నలుగురితోపాటు.. ధర్మారావు, కోత శ్రీనివాసరావు, నిరంజన్‌కుమార్ పాశ్వాన్‌ను అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో మరో పది మంది ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

ఆప్కాబ్, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పెంపు

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్(ఆప్కాబ్), జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ శనివారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్కాబ్ అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న సహకారశాఖ కమిషనర్ పదవీ కాలాన్ని 2025 జనవరి 18 నుంచి జూలై 17వరకు పెంచింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల డీసీసీబీలకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ల పదవీ కాలాన్ని ఈ నెల 27 నుంచి ఆరు నెలలు పొడిగించింది. 13 డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ల పదవీకాలాన్ని వచ్చే జూన్ 26 వరకు పొడిగించింది. తాజాగా, పీఏసీఎస్‌ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఎన్నికలు జరిగే వరకు వారు కొనసాగనున్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ కె.మధుమూర్తి

- ఎన్ఐటీ వరంగల్ నుంచి రాక

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ కొత్త మధుమూర్తి నియమితులయ్యారు. మూడేళ్ల కాలవ్యవధితో ఆయన్ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్ ఎంపికపై సుదీర్ఘకాలం కసరత్తు చేసిన ప్రభుత్వం చివరకు ఆయన్ను నియమించింది. ప్రస్తుతం ఆయన ఎన్ఐటీ వరంగల్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే జాతీయ స్థాయిలోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. ఏఐసీటీఈ సలహాదారుగా, ఎన్ఐటీల నిధుల సమన్వయకర్తగా, జాతీయ వృత్తి విద్యామండలి సభ్యునిగా పనిచేశారు. దేశంలోని అనేక ఎన్ఐటీలకు బోర్డు గవర్నర్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ పలు సంస్థల్లో భాగస్వామిగా వ్యవహరించారు. కాగా, రాష్ట్రంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయాలంటే జాతీయ స్థాయి సంస్థల్లో పనిచేసే వారు అవసరం అని భావించింది. ఇందులో భాగంగా పలువురి పేర్లను వడపోసి చివరికి మధుమూర్తిని నియమించింది. కాగా, ప్రస్తుతం ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావును చైర్మన్ పోస్టు నుంచి రిలీవ్ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మరో ఉత్తర్వు జారీచేసింది.

14 జిల్లాలకు ఏపీసీల నియామకం

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్లను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. 14 జిల్లాలకు కొత్త ఏపీసీలను నియమించారు. వీరిలో డిప్యూటీ కలెక్టర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక డైట్ కాలేజీ సీనియర్ లెక్చరర్ ఉన్నారు.ట

హుండీలో ఫోన్ పడిందా.. కృష్ణార్పణమే!

- దేవుని ఖాతాకే అంటున్న అధికారులు
- ఖరీదైన ఫోనంటూ భక్తుని ఆవేదన

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'పొరబాటైనా, ఏమరపాటైనా రూల్ రూలే...దేవుడి హుండీలో సెల్‌ఫోన్ దేవుడిదే..మీది కాదు' అంటుండడంతో ఓ భక్తునికి గొప్ప చిక్కొచ్చి పడింది. చెన్నై అంబత్తూరుకు చెందిన దినేష్ తన కుటుంబంతో గత ఆగస్టు మాసంలో చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్‌లో ఉన్న కందస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆయన జేబులో ఉన్న ఖరీదైన ఐఫోన్ దేవాలయం హుండీలో పడిపోయింది. దీనిపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. కాగా, గురువారం హుండీని లెక్కించిన అధికారులు.. ఆ ఫోన్‌ను ఇచ్చేది లేదని, అది ఇక దేవుడికే సొంతమంటూ తేల్చిచెప్పారు. ఆ ఫోన్‌లోని సిమ్‌కార్డ్, మెమొరీకార్డ్‌లను మాత్రం ఇచ్చారు. దీనిపై శనివారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మాట్లాడుతూ.. హుండీలో పడిన ఏ వస్తువైనా దానిని ఆలయ భాండాగారంలో జమచేస్తారని, అది దేవుని ఖాతాకే చెందుతుందని తెలిపారు. హుండీలో పడినది దేవునికే చెందడం ఆలయ ఆచారమని, తిరిగి ఇవ్వాలని భక్తులు కోరడాన్ని నిబంధనలు అనుమతించవని వివరించారు. అయినా నిబంధనల్ని క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలతో జగన్ రాజీనామా చేయించాలి

- సయ్యద్ రఫీ

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న జగన్‌రెడ్డి.. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో రాజీనామా చేయించి, చేతనైతే తిరిగి గెలిపించుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని రుజువు చేయాలంటే ఇదొక్కటే మార్గమని వ్యాఖ్యానించారు. అంతే కానీ పదేపదే కూటమి ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతని ఎదుర్కొంటోందని జగన్ మాట్లాడటం సరికాదని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

ఒంటరి ఏనుగు దాడిలో ఒకరి మృతి

భైరెడ్డిపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా భైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి పొలిమేరల్లో ఒంటరి ఏనుగు దాడిచేయడంతో అదే గ్రామానికి చెందిన శంకరప్ప(60) అనే వృద్ధుడు మృతి చెందాడు. శనివారం పొలానికి ఆవులను మేతకు తీసుకువెళ్లిన శంకరప్పపై ఏనుగు దాడిచేసింది.

టెన్త్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లోనూ తరగతులకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. పదో తరగతి పరీక్షల వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెలవు రోజుల్లో విద్యార్థులు బడులకు వస్తున్నారని, కానీ వారికి రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు.

రజకుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

- గల్లా, దువ్వారపు

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రజకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో రజకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ రామారావు, ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రజకులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వం రజకులకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. రజకుల ఉన్నతి కోసం భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు చెప్పారు. రజక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు డైరెక్టర్ల నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో చిన్నారి సహా నలుగురి మృతి
- 11మందికి తీవ్రగాయాలు, నలుగురి పరిస్థితి విషమం
- శ్రీసత్యసాయి జిల్లాలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న టెంపో


మనోజ్, అథర్వతో ప్రేమకుమారి, రత్నమ్మ

మడకశిర, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఓ కుటుంబం ఘోర ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని టెంపో ట్రావెలర్ ఢీకొనడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన ప్రేమకుమారి(30), ఆమె కుమారుడు అథర్వ(2), కుటుంబ సభ్యురాలు రత్నమ్మ(65), డ్రైవర్ మనోజ్(32)గా గుర్తించారు. మడకశిర మండలం బుళ్లసముద్రం సమీపంలో శనివారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు.

తిరుగుప్రయాణంలో విషాదం

కుంబర నాగేపల్లి గ్రామానికి చెందిన శివరాజ్, ప్రేమకుమారి దంపతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. కొడుకు అథర్వ పుట్టు వెంట్రుకలను తీయించేందుకు తిరుమల శ్రీవారి సన్నిధికి రెండు వాహనాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో గురువారం వెళ్లారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యారు. మరో అరగంటలో గమ్యానికి చేరుకునేవారు. డ్రైవర్ మనోజ్ నిద్రమత్తు కారణంగా బుళ్లసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న సిమెంటు లారీని వేగంగా ఢీకొట్టాడు. దీంతో అథర్వ, ప్రేమకుమారి అక్కడికక్కడే మృతి చెందారు. శివరాజ్ పెద్దమ్మ రత్నమ్మ, డ్రైవర్ మనోజ్ మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించేలోగా మృతిచెందారు. వాహనంలో ఉన్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మడకశిర ఆస్పత్రి నుంచి తుమకూరులోని (కర్ణాటక) ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఆటోను ఢీకొన్న ఎమ్మెల్యే తనయుడి వాహనం

ఐదుగురికి తీవ్ర గాయాలు

పాతపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కొరసవాడ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయిగణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆటోడ్రైవర్ కూర్మాన సునీల్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను పాతపట్నంలోని 50 పడకల ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులది పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామం. ఒకే కుటుంబానికి చెందిన వీరంతా పాతపట్నంలో సమీప బంధువు మృతి చెందగా.. ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగింది. స్కార్పియో డ్రైవర్ పల్లి రాజేష్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వి.రామారావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

చైర్ కాదు ఫైర్

తెలంగాణ రాజకీయాలలో వేడి పుట్టింది. ఏడాది క్రితం వరకు తెలంగాణలో తిరుగులేని అధికార కేంద్రంగా వెలుగొందిన మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఏ-1గా పేర్కొంటూ అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. అందరి లాగే తండ్రి కేసీఆర్ మాటలు నమ్మి రేపో మాపో ముఖ్యమంత్రి కూడా అవుతానని కొంతకాలం పాటు ఊహల పల్లకిలో విహరించిన కేటీఆర్‌కు, రేపో మాపో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. ఫార్ములా–ఈ రేసు కేసులో ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా పావులు కదిపింది. ఫార్ములా–ఈ రేసు వ్యవహారం కేటీఆర్ మెడకు చుట్టుకోబోతున్నదని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నందున తెలంగాణ సమాజం కూడా దీన్నో సంచలనంగా పరిగణించడం లేదు. అయితే భారత రాష్ట్ర సమితి నాయకులు, శ్రేణులు మాత్రం తమ అధినేతలను జైలుకు పంపితే తమ నెత్తిన పాలు పోసినట్టేనని అంతరంగిక సంభాషణల్లో సంబరపడిపోతున్నారు. అందుకే జైలుకు వెళ్లి వచ్చిన వాళ్లు ముఖ్యమంత్రి అవుతారని

> **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టు బిగించారు. తనను ఇబ్బందులు పెట్టిన వారిపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు ఆయనకు లభించింది. అంతిమంగా ఈ పోకడలు ఆయనకు లాభం కలిగిస్తాయా? నష్టం చేస్తాయా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏడాదిగా అమలుకు నోచుకోని పాత పథకాలను వచ్చే జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నందున ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి తగ్గుముఖం పట్టవచ్చు. అదే సమయంలో కేటీఆర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపితే ఆ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందే ఆలోచనలో ఉన్న బీఆర్ఎస్ ప్రయత్నాలు ఫలిస్తాయా, లేవా? అన్నది కూడా వేచి చూడాలి. ప్రస్తుతం కేసీఆర్‌ను కష్టాలు కమ్ముకుంటున్నాయి. ఈ పరిస్థితుల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకుంటూ పార్టీని ఎలా బతికించుకుంటారు? అన్నది కేసీఆర్ అనుసరించబోయే వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది.**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు చెప్పుకొంటున్నారు. అలా అయితే ముందుగా కవిత ముఖ్యమంత్రి అవుతారని కాంగ్రెస్ నాయకులు కౌంటర్‌గా ఎగతాళి చేస్తున్నారు. నిజానికి జైలుకు వెళ్లి వచ్చినంత మాత్రాన ఎవరూ అమాంతం ముఖ్యమంత్రి అయిపోరు. అలా అయితే అవినీతి కేసులలో అరెస్టయ్యి జైలుకు వెళ్లడానికి చాలా మంది క్యూ కడతారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లి రావడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం ఉంది. తన ఒక్కగానొక్క బిడ్డ పెళ్లిని కూడా దగ్గరుండి సంతోషంగా జరిపించుకొనే అవకాశం లేకుండా కేసీఆర్ అండ్ కో చేసినందున రేవంత్‌రెడ్డిలో కసి పెరిగింది. ఈ కారణంగానే ఆయన తెలుగుదేశం పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరి చాలా వేగంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. ఆనాటి నుంచి ఎన్నికల వరకు కేసీఆర్‌పై అలుపెరుగని పోరాటం చేసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరానికి చేర్చారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించడం కూడా రేవంత్‌రెడ్డికి కలిసివచ్చింది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియంతృత్వ పోకడలతో ప్రజలకు దూరం అవడం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రధాన కారణం అయింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అధికార మార్పిడి జరిగిన నాటి నుంచే పోరాటాన్ని ఉధృతం చేసింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి తగిన సమయం ఇవ్వకుండా ఆందోళనలు చేయడాన్ని ప్రజలు కూడా హర్షించడం లేదు. అయితే ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా కల్వకుంట్ల కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య ఏర్పడిన వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరాయి. ఈ ఏడాది కాలంలో ఒకటి రెండు సందర్భాలలో దుందుడుకుగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తనను నిత్యం దుర్భాషలాడుతున్న కేటీఆర్ విషయంలో మాత్రం పకడ్బందీగా పావులు కదిపారు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించి ఆయన నుంచి ముందస్తు అనుమతి పొందారు. సాంకేతిక కారణాలపై కేటీఆర్‌కు వెంటనే బెయిల్ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఒక దురదృష్టకర సంఘటనలో ఓ మహిళ మృతి చెందిన కేసులో ఆ సినిమా హీరో అల్లు అర్జున్‌ను అనూహ్యంగా అరెస్టు చేయించడం, ఇప్పుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్‌పై కేసు పెట్టించడం ద్వారా తాను ఏమిటో చెప్పకనే చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఈ రెండు చర్యల వల్ల రాజకీయంగా లాభమా? నష్టమా? అన్నది ఇప్పటికిప్పుడు తేలే అంశం కాదు గానీ 'సీఎం అంటే కేవలం కుర్చీ కాదు.. ఫైర్' అని రేవంత్‌రెడ్డి రుజువు చేస్తున్నారు. అంతే కాదు, పార్టీపైన, ప్రభుత్వంపైన తనకు పట్టు ఉందని కూడా రుజువు చేసుకున్నారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం చిత్ర పరిశ్రమలోనే కాదు ఎలీట్ సొసైటీలో ప్రకంపనలు సృష్టించింది. మహిళ మృతికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారణం కాకపోయినప్పటికీ, అంటే కుట్రపూరిత ఉద్దేశంతో వ్యవహరించనప్పటికీ కేసులో చిక్కుకున్నారు. దీంతో అల్లు అర్జున్ అరెస్టుకు మహిళ మృతి మాత్రమే కారణమా? లేక మరేదన్నా కారణం ఉందా? అని ప్రజలు ఆరా తీయడం మొదలుపెట్టారు. పుష్ప-2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోయారు. ఏడాదిగా ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పేరును హైదరాబాద్‌లో నివసిస్తున్న అల్లు అర్జున్ మర్చిపోవడాన్ని నెటిజన్లు సైతం హర్షించలేదు. అంతే, సినిమా హీరో అయితే ఏమిటి గొప్ప? ప్రజల్లో నేనే నిజమైన స్టార్‌ని! అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్లు సినిమావాళ్ల జోలికి వెళ్లేవారు కాదు. ముఖ్యంగా హీరోలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందని చెప్పి అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను ఉన్నపళంగా కూల్చివేయించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి ఒక రాత్రి జైల్లో గడపాల్సిన పరిస్థితి కల్పించారు. దీంతో చిత్ర పరిశ్రమ వెన్నులో వణుకు పుట్టింది. చంద్రబాబు, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులు అయినప్పుడు సినీ ప్రముఖులు స్వయంగా వెళ్లి వారిని అభినందించేవారు. జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి విషయంలో ఇది వెంటనే జరగలేదు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పేరును సినిమా వాళ్లు గుర్తుంచుకోకపోవడాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయి ఉండవచ్చు. ఎన్నికల ముందు వరకు సినీ ప్రముఖులు పలువురు అప్పటి మంత్రి కేటీఆర్‌తో రాసుకు పూసుకు తిరిగేవారు. అల్లు అర్జున్ ఎపిసోడ్‌తో సినిమా వాళ్లకు గట్టి సందేశం పంపిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కేటీఆర్ పని పట్టాలని నిశ్చయించుకున్నట్టుగా ఉంది.

రోజులు మారాయ్!

రాజకీయాలలో ఉన్నవారు పార్టీలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను వదులుకొనేవారు కారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం మొత్తం రేవంత్‌రెడ్డిని ఈసడించుకొనేవారు. రేవంత్‌రెడ్డి కూడా ఎక్కడా తగ్గకుండా తన నోటికి పని చెప్పేవారు. దీంతో ఇరు పక్షాల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫార్ములా–ఈ కేసు వ్యవహారం రేవంత్‌రెడ్డి చేతికి చిక్కింది. ఈ వ్యవహారంలో ముడుపులు చేతులు మారాయా? లేదా? అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ నిబంధనల ఉల్లంఘన మాత్రం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా 55 కోట్ల రూపాయలు చెల్లించడం తప్పిదమే అవుతుంది. మంత్రి హోదాలో కేటీఆర్ నోటి మాటగా ఇచ్చిన ఆదేశాలతో నాటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ అనే అధికారి డబ్బు చెల్లించేశారు. కారణం ఏమైనా గానీ గత ప్రభుత్వాల హయాంలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దాని పర్యవసానాలను ఇప్పుడు అనుభవిస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి సుదీర్ఘ కాలం పాటు అధికారంలో కొనసాగుతారని అంత చదువుకున్న అధికారులు కూడా ఎలా విశ్వసించారో అంతుపట్టదు. సామాన్య ప్రజలకు ఉన్న ఇంగితం కూడా అఖిల భారత సర్వీసు అధికారులకు లేకపోవడం విషాదమే. ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో తాను తప్పు చేయలేదని, రాష్ట్రాభివృద్ధితో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడంలో భాగంగానే సదరు కంపెనీకి నిధులు విడుదల చేశామని కేటీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలని ఆయన కోరారు. కేసు అవినీతి నిరోధక శాఖ చేతుల్లోకి వెళ్లాక అసెంబ్లీలో చర్చ జరగదు. ఈ వ్యవహారంలో నిబంధనల అతిక్రమణ జరిగిందా? ముడుపులు చేతులు మారాయా? అన్నది నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ఏసీబీపైనే ఉంటుంది. కేటీఆర్, అర్వింద్ కుమార్‌లను విచారణకు పిలిచిన తర్వాత మాత్రమే ఏసీబీ వైఖరి ఏమిటో స్పష్టం అవుతుంది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కనీసం విచారణకు కూడా పిలవకుండా అరెస్టు చేయించారు. ఆ కేసులో చంద్రబాబు యాభై రోజులకు పైగా జైల్లో గడపాల్సి వచ్చింది. ఇక ఫార్ములా–ఈ రేసు కేసులో ఏమి జరగబోతున్నది? కేటీఆర్ ఎంత కాలం జైల్లో ఉండాల్సి వస్తుంది? అన్నది ఇప్పుడే చెప్పలేం. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ప్రస్తుతానికి ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడి అది భారత రాష్ట్ర సమితి బలపడటానికి ఉపయోగపడుతుందా? లేదా? కేటీఆర్ అరెస్టు వల్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లాభం జరుగుతుందా? నష్టం జరుగుతుందా? అన్నవి ఇప్పుడు చర్చనీయాంశాలుగా మారాయి.

రేవంత్ మార్క్..!

తెలంగాణ సమాజం ఇప్పటిదాకా చూసిన రేవంత్‌రెడ్డి వేరు.. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వేరుగా ఉంటారని నేను గతంలోనే చెప్పాను. రేవంత్‌రెడ్డి బయటకు కనిపించినంత ఆషామాషీగా ఉండరు. ఆయన చాలా లోతైన మనిషి. కాంగ్రెస్ పార్టీ అంటేనే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని మురిపెంగా చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు బాహాటంగా అసంతృప్తి స్వరాలను వినిపిస్తుంటారు. విచిత్రంగా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పార్టీ నాయకులు ఒక్క తాటిపై ఉంటున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకొనే నిర్ణయాలను బాహాటంగా ఎవరూ తప్పుపట్టడం లేదు. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాటు అధికారానికి దూరంగా ఉండాల్సి రావడం కూడా కాంగ్రెస్ నాయకుల్లో ఈ మార్పునకు కారణం కావచ్చు. రేవంత్‌రెడ్డి కూడా అందరినీ కలుపుకొని వెళ్లడానికే ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారు భిన్న స్వరాలను వినిపించడం లేదు. రాజకీయ ప్రత్యర్థుల కట్టడికి ఏమి చేయబోతున్నదీ బయటకు పొక్కకుండా రేవంత్‌రెడ్డి గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఔటర్ రింగు రోడ్డు వ్యవహారంపై సిట్ దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్టు శుక్రవారంనాడు ఆయన ఉన్నపళంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు ఇంత గోప్యంగా తీసుకోవడం అసాధారణం. కేసీఆర్ కుటుంబ సభ్యులను కేసులలో ఇరికించుకుంటూ పోతే భారత రాష్ట్ర సమితి క్రమేపీ బలహీనపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం కావచ్చు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో ప్రాథమిక ఆధారాలను గుర్తించని పక్షంలో కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ అనుమతించి ఉండేవారు కారు. అంతే కాదు, ఈ వ్యవహారాన్ని కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితోనే కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ జిష్ణుదేవ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఉంటారన్న అభిప్రాయం కూడా ఉంది. బొగ్గు నిక్షేపాలకు దూరంగా నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని ఈ అంశంపై విచారణ జరిపిన కమిషన్ నిర్ధారించింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మెడపైనా కత్తి వేలాడుతోంది. తమ అధినాయకులపై వరుస కేసులు పెట్టి వేధిస్తూ పోతే తమకే మేలు జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు భావిస్తున్నారు. అందుకే కేటీఆర్‌ను తొందరగా అరెస్టు చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే కేసీఆర్‌ను జైలుకు పంపితేనే ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుందని క్షేత్ర స్థాయి సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. లిక్కర్ కేసులో కవితను అరెస్టు చేసి అన్ని నెలలు జైల్లో పెట్టినా తెలంగాణ సమాజం పట్టించుకోలేదు. ఇప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టినా పెద్దగా సానుభూతి లభించకపోవచ్చు. ఎందుకంటే అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, కవిత విపరీతమైన అధికార దర్పాన్ని ప్రదర్శించేవారు. ఈ ధోరణిని తెలంగాణ సమాజంతో పాటు పార్టీ శ్రేణులు కూడా జీర్ణించుకోలేకపోయారు. కేసీఆర్ కూడా అహంభావం ప్రదర్శించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం సాధించిన వాడిగా ప్రజల్లో ఆయన పట్ల ఇప్పటికీ సానుకూలత ఉంది. ఈ కారణంగా కేసీఆర్‌ను టచ్ చేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుంది.

> **ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో ముడుపులు చేతులు మారాయా? లేదా? అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ నిబంధనల ఉల్లంఘన మాత్రం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా 55 కోట్ల రూపాయలు చెల్లించడం తప్పిదమే అవుతుంది.**



కేసీఆర్‌కు బ్యాడ్ టైం!

ఏదిఏమైనా కేసీఆర్ కుటుంబానికి బ్యాడ్ టైం నడుస్తున్నట్టుగా ఉంది. కవిత జైల్లో ఉన్నప్పుడు బీజేపీతో పొత్తుకు సిద్ధపడినా ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు కనికరించలేదు. కేసీఆర్ నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారంటే బీజేపీ పెద్దలకు తెలియకుండా ఇది జరగదని కేసీఆర్‌కు కూడా తెలుసు. పరిస్థితులు అనుకూలించనప్పుడు ఎంతటి రాజకీయ గండరగండడు అయినా గుడ్లు అప్పగించి చూడటం మినహా ఏమీ చేయలేరు. అందుకే కేసీఆర్ చాలా రోజులుగా ఫాంహౌస్‌లోనే ఉంటూ మౌనాన్ని ఆశ్రయించారు. ఇప్పుడు కేటీఆర్ విషయంలో కూడా ఆయన స్పందించలేదు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన నాటి నుంచే కేసీఆర్‌కు దరిద్రం పట్టుకున్నట్టుగా ఉంది. అధికారం కోల్పోయారు. కన్నబిడ్డలు జైలు పాలవుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాను కక్ష కట్టి జైల్లో పెట్టించిన రేవంత్‌రెడ్డి చేతిలో వరుస పరాభవాలను ఎదుర్కోవలసి రావడాన్ని మించిన విషాదం కేసీఆర్ జీవితంలో మరేమి ఉంటుంది? ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కక్ష రాజకీయాలకు బలై జైలు జీవితం గడిపి వచ్చిన రేవంత్‌రెడ్డికి భవిష్యత్తులో కొత్తగా జరిగే నష్టం ఏమీ ఉండదు. అధికారం శాశ్వతం అనుకొని ఎవరు విర్రవీగినా వారికి ఇటువంటి కష్టాలు కాచుకొని ఉంటాయి. ప్రజల సానుభూతి కూడా లభించదు. అధికారంలో ఉన్నప్పుడు వినయంగా మెలిగిన వారికే ప్రజల సానుభూతి లభిస్తుంది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఇప్పుడు తెలంగాణలో కేటీఆర్ అండ్ కో, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అండ్ కో ఆక్రోశిస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థను ఏ స్థాయిలో దుర్వినియోగం చేసిందీ మరచిపోతే ఎలా? సామాన్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి పొందాల్సి ఉండేది. ప్రభుత్వం అంటే ప్రైవేటు లిమిటెడ్ కాదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించక తప్పదని ఎందుకు గుర్తించరో తెలియదు.

> **రూల్ ఆఫ్ లా మాత్రమే పాటించాల్సిన అధికారులు అధికారంలో ఉన్న వారి మాటలకు గుడ్డిగా తలలాడిస్తే మూల్యం చెల్లించక తప్పదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలా తలలాడించిన వాళ్లు జైలుకు వెళ్లాల్సి రావడంతో పాటు ఇప్పటికీ కేసుల నుంచి బయటపడలేదు. ఈ ఉదంతాలు తెలిసి కూడా ఇటు తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత సర్వీసు అధికారులు రూల్ ఆఫ్ లా పాటించకుండా కష్టాలు కొని తెచ్చుకున్నారు. అధికారులు తప్పు చేయడానికి సిద్ధపడకపోతే రాజకీయ నాయకులకు కూడా ఇబ్బందులు రావు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా తాను నిధులు విడుదల చేయలేనని హెచ్‌ఎండీఏ ప్రత్యేక కమిషనర్ హోదాలో అర్వింద్ కుమార్ స్పష్టంచేసి ఉంటే ప్రస్తుతం విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడేది కాదు కదా. ఆయన నిబంధనలు పాటించి ఉంటే 55 కోట్ల రూపాయలు విడుదలయ్యేవి కావు. కేటీఆర్ మెడకు ఈ కేసు చుట్టుకునేదీ కాదు. అధికారులు విచక్షణతో వ్యవహరిస్తూ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబోమని స్పష్టంచేసినప్పుడు రాజకీయ నాయకులు కూడా తప్పు చేయలేరు.**

గతం మరిస్తే ఎలా?

అధికారంలో ఉన్నప్పుడు రాజధర్మాన్ని పాటించని వాళ్లకు అధికారం కోల్పోయాక అన్యాయం జరుగుతోందని ఆక్రోశించే అర్హత కూడా ఉండదు. అందుకే ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు నిన్న ఏం జరిగిందో గుర్తుచేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినన్ని అరాచకాలు మరెక్కడా జరిగి ఉండకపోవచ్చు. ఉదాహరణకు వైసీపీకి చెందిన మాజీ మంత్రి పేర్ని నాని తన భార్య పేరిట నిర్మించిన గిడ్డంగిలో ఉంచిన పౌర సరఫరాల శాఖకు చెందిన బియ్యాన్ని అమ్ముకున్నారు. ఇప్పుడు అది నిరూపితం కావడంతో అమ్ముకున్న బియ్యం విలువను తిరిగి చెల్లిస్తానని చెబుతున్నారు. ప్రభుత్వంలో ఇది సాధ్యమా? అయిందేదో అయిపోయింది.. తూచ్ అనుకోవడానికి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలలో కుదరదు. రూల్ ఆఫ్ లా మాత్రమే పాటించాల్సిన అధికారులు అధికారంలో ఉన్న వారి మాటలకు గుడ్డిగా తలలాడిస్తే మూల్యం చెల్లించక తప్పదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలా తలలాడించిన వాళ్లు జైలుకు వెళ్లాల్సి రావడంతో పాటు ఇప్పటికీ కేసుల నుంచి బయటపడలేదు. ఈ ఉదంతాలు తెలిసి కూడా ఇటు తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత సర్వీసు అధికారులు రూల్ ఆఫ్ లా పాటించకుండా కష్టాలు కొని తెచ్చుకున్నారు. అధికారులు తప్పు చేయడానికి సిద్ధపడకపోతే రాజకీయ నాయకులకు కూడా ఇబ్బందులు రావు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా తాను నిధులు విడుదల చేయలేనని హెచ్‌ఎండీఏ ప్రత్యేక కమిషనర్ హోదాలో అర్వింద్ కుమార్ స్పష్టంచేసి ఉంటే ప్రస్తుతం విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడేది కాదు కదా. ఆయన నిబంధనలు పాటించి ఉంటే 55 కోట్ల రూపాయలు విడుదలయ్యేవి కావు. కేటీఆర్ మెడకు ఈ కేసు చుట్టుకునేదీ కాదు. అధికారులు విచక్షణతో వ్యవహరిస్తూ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబోమని స్పష్టం చేసినప్పుడు రాజకీయ నాయకులు కూడా తప్పు చేయలేరు. ఏదిఏమైనా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టు బిగించారు. తనను ఇబ్బందులు పెట్టిన వారిపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు ఆయనకు లభించింది. అంతిమంగా ఈ పోకడలు ఆయనకు లాభం కలిగిస్తాయా? నష్టం చేస్తాయా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏడాదిగా అమలుకు నోచుకోని పాత పథకాలను వచ్చే జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నందున ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి తగ్గుముఖం పట్టవచ్చు. అదే సమయంలో కేటీఆర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపితే ఆ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందే ఆలోచనలో ఉన్న బీఆర్ఎస్ ప్రయత్నాలు ఫలిస్తాయా? లేవా? అన్నది కూడా వేచి చూడాలి.

> **గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్లు సినిమావాళ్ల జోలికి వెళ్లేవారు కాదు. ముఖ్యంగా హీరోలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందని చెప్పి అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను ఉన్నపళంగా కూల్చివేయించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారు. చంద్రబాబు, రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రులు అయినప్పుడు సినీ ప్రముఖులు స్వయంగా వెళ్లి వారిని అభినందించే వారు. జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి విషయంలో ఇది వెంటనే జరగలేదు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పేరును సినిమా వాళ్లు గుర్తుంచుకోకపోవడాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయి ఉండవచ్చు.**

'ధర్మో రక్షతి రక్షితః' అంటారు. ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఈ కఠోర సత్యాన్ని అనుక్షణం గుర్తుంచుకునే వారిని కష్టాలు చుట్టుముట్టవు. తెలంగాణలో తన అధికారానికి తిరుగులేదని విర్రవీగిన కేసీఆర్ ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రస్తుతం ఆయనను కష్టాలు కమ్ముకుంటున్నాయి. ఈ పరిస్థితుల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకుంటూ పార్టీని ఎలా బతికించుకుంటారు? అన్నది కేసీఆర్ అనుసరించబోయే వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రేవంత్‌రెడ్డిని తక్కువగా అంచనా వేసి కష్టాలను కొని తెచ్చుకున్నారు. కేటీఆర్‌ను జైలుకు పంపడంతో లెక్క సరిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతృప్తి చెందుతారా? తాను జైలుకు వెళ్లాల్సి రావడానికి ప్రధాన కారకుడైన కేసీఆర్‌ను కూడా అరెస్టు చేయించే వరకు వెనకడుగు వేయరా? అన్నదీ వేచి చూడాలి. ఔటర్ రింగ్ రోడ్, భూముల వ్యవహారంలో ఎవరెవరు చిక్కుకుంటారో తెలియదు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అందరూ కేసులలో చిక్కుకుంటే ఆ పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. అన్ని రోజులూ మనవి కావు అని కేసీఆర్ అండ్ కో ఇప్పటికైనా గుర్తుపెట్టుకుంటుందా?

తాష్కెంట్ నుంచి తెలంగాణ దాకా...!

భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని పార్లమెంటరీ మార్గంలో సాగించటంలోనూ, విప్లవోద్యమంగా మలచటంలోనూ నాయకత్వం విఫలమైంది. ఇది నాయకత్వ వైఫల్యమేగాని మార్క్సిజం వైఫల్యం కాదు.



భారత కమ్యూనిస్టు పార్టీ ఈ డిసెంబర్ 26న నూరవ ఏట ప్రవేశిస్తోంది. ప్రపంచంలో ఏ కమ్యూనిస్టు పార్టీలో లేని ఒక విచిత్ర వివాదం భారతీయ కమ్యూనిస్టుల్లో ఉంది. అది తమ మాతృసంస్థ (భారత కమ్యూనిస్టు పార్టీ) ఎప్పుడు ఆవిర్భవించింది? అన్న మీమాంస. 1920 జూలైలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశంలో వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలను స్థాపించాలని నిర్ణయించగా, దాన్ని అమలు చేయటంలో భాగంగా ఎం.ఎన్.రాయ్ ఇండియా, స్పెయిన్ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల స్థాపనకు కృషి చేశారు. 1920 అక్టోబర్‌లో సోవియట్ యూనియన్‌లోని తాష్కెంటులో భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. తాష్కెంటులో అప్పటికే ఉన్న భారతీయ ప్రవాసుల్లో కొంతమందిని కమ్యూనిస్టులుగా మార్చి, వారిలో కొందరికి శిక్షణ ఇచ్చి భారతదేశానికి పంపటానికి రాయ్ కృషి చేశారు. అయితే వారు బ్రిటిష్ వలస పాలకులకు దొరికిపోవటంతో వారిపై పెషావర్ కుట్రకేసు బనాయించి శిక్ష పడేట్లు చేశారు. వీరిలో మీర్ అబ్దుల్ మజీద్, మన్సూర్, రహ్మాన్‌ఖాన్, అక్బర్‌ఖాన్ తదితరులు తర్వాత కాలంలో ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశారు.

అక్టోబర్ 17, 1920న తాష్కెంటు పార్టీ స్థాపన సమావేశంలో యం.యన్. రాయ్‌తో పాటు ఆయన భార్య ఎవలిన్ ట్రెంట్‌రాయ్, ఎ.ఎన్. ముఖర్జి, రోసా ఫిటింగోవ్, మహమ్మద్ అలీ (అహ్మద్ హసన్), మహమ్మద్ షఫీర్ సిద్ధిఖ్, ప్రతివాద భయంకరాచారి తదితరులు పాల్గొన్నారు. మహమ్మద్ అలీని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కారణాలేమైనా తాష్కెంటు పార్టీ స్థాపన భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేయటంలో పెద్దగా ఉపకరించలేదు. కాని కలకత్తా, బొంబాయి మద్రాసు, లాహోర్ లాంటి చోట్ల ఎవరికి వారుగా వారివారి తరహాలో కమ్యూనిస్టు గ్రూపులుగా పనిచేశారు.

ఈ స్థితిలో "ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ" పేరుతో పనిచేస్తున్న 'సత్యభక్త' పై గ్రూపులన్నింటినీ ఆహ్వానించి 1925 డిసెంబర్ 26 నుంచి 28 వరకు కాన్పూర్‌లో 300 మందికి పైగా ప్రతినిధులతో ఒక సభ జరిపారు. ఇందులో ఎస్.వి. ఘాటే, కృష్ణస్వామి అయ్యర్, జోగ్లేకర్, జానకీ ప్రసాద్, ముజఫర్ అహ్మద్, ఆర్.ఎస్ నింబకర్, అబ్దుల్ మజీద్, సయ్యద్ హసన్ తదితరులు పాల్గొనగా సభకు సింగారవేలు చెట్టియార్ అధ్యక్షత వహించారు. డాంగే తదితరులు జైల్లో ఉన్న కారణంగా హాజరు కాలేకపోయారు. ఈ సభకు ముందే కాన్పూరు కుట్ర కేసు బనాయించారు. కొంతమందికి శిక్షలు పడినా సింగారవేలు తదితరులపై కేసు కొట్టివేశారు. ఈ కేసులో ముద్దాయిగా పేర్కొన్న గులాం హుస్సేన్ జైలు నుంచి తప్పించుకున్నాడు. కాన్పూరు సభకు ఆహ్వానసంఘం అధ్యక్షునిగా హాజరత్ మొహానీ వ్యవహరించారు.


పార్టీ పేరు ఇండియన్ కమ్యూనిస్టుగా ఉండాలని, జాతీయ కమ్యూనిస్టు పార్టీగా ఉంటే బహిరంగంగా పనిచేసే అవకాశం ఉంటుందని సత్యభక్త చేసిన వాదనని సభ తిరస్కరించింది. పార్టీకి 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా'గా పేరు స్థిరపరచింది. ఈ కారణంగా సత్యభక్త వెళ్లిపోయి ఇండియన్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించుకొని ఆ తర్వాత కనుమరుగయ్యారు. కాన్పూరు సభలో పార్టీ కార్యదర్శులుగా ఎస్వీ ఘాటే, జానకీ ప్రసాద్, బాగేర్ హిట్లాల్‌ను ఎన్నుకున్నారు. కాని తర్వాత జానకీ ప్రసాద్‌ని పోలీసు ఏజెంటుగా అనుమానించి బయటకు పంపారు. ప్రారంభంలోనే బాలారిష్టాలు ఎదురైనా నాలుగైదు ఏళ్లలోనే పార్టీ స్థిరపడింది. కాన్పూరు కుట్ర కేసు పార్టీ ప్రచారానికి బాగా దోహదపడింది. సాంకేతికంగా పార్టీ ఆవిర్భావం 1920లో జరిగినా, 1925లో జరిగిన స్థాపననే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా గుర్తించింది. 1920 తాష్కెంటు సమావేశాన్ని పార్టీ స్థాపకదినంగా సీపీఎం, మరికొన్ని నక్సల్ గ్రూపులు భావిస్తుండగా, 1925 కాన్పూరు సమావేశాన్ని సీపీఐ, మరికొన్ని గ్రూపులు స్థాపకదినంగా భావిస్తున్నాయి.

1946 జూలై 4న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహిద్దీన్‌ల పిలుపుతో ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 2297 రోజులు సాగి, నాలుగువేల మంది వీరుల బలిదానం తర్వాత 1951 అక్టోబర్ 21న సుందరయ్య, రాజేశ్వరరావు, బసవపున్నయ్య, మద్దుకూరి చంద్రంల ప్రకటనతో విరమింపబడింది. నెహ్రూ ప్రభుత్వ పోలీసు చర్య తర్వాతనే ఎక్కువ మంది చంపబడ్డారు. పోలీసు చర్య తర్వాత పోరాటం కొనసాగించటం విషయంపై పార్టీలో తీవ్రస్థాయిలో విభేదాలు పొడచూపినా పోరాట ఫలాలను పరిరక్షించుకోవాలనే పేరుతో పోరాటం కొనసాగించాలని మెజారిటీగా వున్న అతివాదులు భావించారు. ఈనాటికీ వారు అదే వైఖరితో ఉన్నారు. అపరిమితమైన సంఖ్యలో అధునాతనమైన ఆయుధ సంపత్తితో ఉన్న ఆ సైన్యాన్ని కర్రలు, ఈటెలు, వడిసెలు, అరకొరగా ఉన్న పాతకాలపు తుపాకులతో ఎదుర్కోవటం ఔచిత్యం కాదని రావి నారాయణరెడ్డి లాంటి పెద్ద నాయకులు భావించినా, నిలబడి శ్రేణుల్ని ఒప్పించకుండా పోరాట ప్రాంతం నుంచి తప్పుకొని పోయినవారూ జరిగిన తప్పులకు పరోక్ష కారకులయ్యారు. మెరికల్లాంటి కార్యకర్తలు, నాయకుల ఈ కాలంలోనే తెలంగాణని తమ రక్తంతో పునీతం చేశారు.

నిజానికి డజన్ల సంఖ్యలో జరిగిన చీలికల్లో కూడా సిద్ధాంత భేదాలతో కూడిన నిబద్ధత కన్నా వ్యక్తిగత రాగద్వేషాలు, అవినీతి ఆర్థిక అరాచకాలు, లైంగిక బలహీనతలూ, పదవీలాలస ఇలా సమస్త దరిద్రాలు ఉద్యమంలో దాపురించాయి. పార్టీ ఏర్పడిన నాటి నుంచి రకరకాల సిద్ధాంత విభేదాలున్నా, ఎన్ని అవమానాలు జరిగినా 4 దశాబ్దాల పాటు పార్టీని చీల్చే సాహసం లబ్ధప్రతిష్ఠులైన అగ్రనాయకులు సైతం చేయలేకపోయారు. చివరకు గత్యంతరం లేని స్థితిలో 1964 జూలైలో తెనాలిలో సమావేశమై సీపీఎంగా ఏర్పడ్డారు. మళ్లీ అందులో నక్సల్బరీ ఘటన మరో చీలికకు దారితీసింది. ఆ తర్వాత నక్సల్స్ డజన్ల సంఖ్యలో చీలిపోయారు. అవన్నీ ఆయా నాయకుల విభేదాలే గాని, వాటిలో నిజాయితీ పాళ్లు తక్కువ. దేశం సంగతేమో గాని, తెలుగు రాష్ట్రాల విషయం చెప్పాలంటే అందులో మావోయిస్టు పార్టీ, లిబరేషన్ పార్టీ తప్ప.. మిగిలిన డజను గ్రూపులు ఒకనాటి నాగిరెడ్డి-పుల్లారెడ్డి నాయకత్వంలోని విప్లవకారుల సమన్వయ కమిటీ నుంచి వచ్చిన చీలికలే. విప్లవోద్యమానికి చీలికే పరిష్కారం అని పుల్లారెడ్డి చూపిన బాటనే తర్వాత తర్వాత అందరూ అనుసరించారు. అనుసరిస్తున్నారు. మూడు ఐక్యతలు, ఆరు చీలికలుగా వర్ధిల్లుతున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్రలో ఎన్నో కుటుంబాలు ధ్వంసమయ్యాయి, ఛిన్నాభిన్నమయ్యాయి. అమరవీరుల త్యాగాలు నిష్ఫలమయ్యాయి. దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తలుగా ఉండి సేవలందించిన సానుభూతిపరులు తమ కృషి నిష్ప్రయోజనం అయిందేనన్న వేదనకు గురవుతున్న సందర్భం. నాయకత్వం పట్ల కార్యకర్తలకు అపనమ్మకం ఉన్న స్థితి, ఎన్నో దశాబ్దాల కాలం పనిచేసిన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి ఉన్నా మంచో, చెడో కాలక్షేపం చేద్దామనే నిరాశ ఈనాడు ఎర్రపార్టీల్లో కన్పిస్తున్న కఠోర వాస్తవం. సామరస్యం సాధ్యంకాని అనేక సమూహాల మధ్య సాధ్యమే అన్నట్లు చెబుతున్న కమ్యూనిస్టు ఉద్యమంలో ఎక్కువగా దుర్వినియోగం కాబడే పదాలు ఐక్యత, విలీనం. తెలిసి తెలిసి పదేపదే ఈ పదాన్ని వల్లిస్తూ అటు తమ శ్రేణుల్ని, ఇటు అసంఖ్యాక ప్రజానీకాన్ని వంచించే కపటత్వాన్ని నాయకత్వం గత శతాబ్ద కాలంగా సాగిస్తూనే ఉంది.

ఏమైనా భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని పార్లమెంటరీ మార్గంలో సాగించటంలోనూ, విప్లవోద్యమంగా మలచటంలోనూ నాయకత్వం విఫలమైంది. ఇది నాయకత్వ వైఫల్యమే గాని మార్క్సిజం వైఫల్యం కాదు.

• చెరుకూరి సత్యనారాయణ



ఉచితం మాటున అనుచితం

భవానీ దీక్ష విరమణ ఉత్సవాల్లో ఓ కాంట్రాక్టర్ చేతివాటం

- భక్తుల ఉచిత సేవలకు రుసుము వసూలు
- క్లోకిరూమ్‌లు, చెప్పుల స్టాండ్‌ల్లో దోపిడీ
- బ్యాగ్‌కు రూ.20, చెప్పులకు రూ.10 వసూలు
- పట్టించుకోని వీఎంసీ ఎస్టేట్ విభాగం
- కనీసం కనిపించని 'ఉచితం' బోర్డులు

'భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులకు అన్ని సేవలు ఉచితంగా అందజేయాలి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను అతిథులుగా భావించాలి. ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలి.' ఉన్నతాధికారుల సమావేశాల్లో ఇచ్చిన ఆదేశాలివి. ఈ ఆదేశాలను వీఎంసీ ఎస్టేట్ విభాగం పక్కన పెట్టేసింది. భవానీ దీక్షల విరమణ తొలిరోజు నుంచే క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్ల కాంట్రాక్టర్ దోపిడీకి తెరతీశారు. భక్తులకు ఉచితంగా అందజేయాల్సిన సేవలకు సొంతంగా ధరలు నిర్ణయించారు. ఆమె ఆదేశాలతో కౌంటర్లలో పనిచేసే సిబ్బంది భక్తుల నెత్తిపై చేయి పెడుతున్నారు. తమ చేతులు తడిపితేనే భద్రత అంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/చిట్టినగర్) : భవానీ దీక్షల విరమణకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భవానీలు, భక్తుల బ్యాగ్‌లు, చెప్పులు భద్రపరచడానికి ఇంద్రకీలాద్రి చుట్టుపక్కల ఐదు ప్రదేశాల్లో క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్లను ఏర్పాటు చేశారు. ఇవికాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఏర్పాటు చేయడానికి ఆరో పాయింట్‌ను ఎంపిక చేశారు. ఈ క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్ల నిర్వహణకు సంబంధించి వీఎంసీలోని ఎస్టేట్ విభాగం టెండర్లను ఆహ్వానించింది. రథం సెంటర్, వీఎంసీ ఎదురుగా ఏర్పాటుచేసిన క్లోక్‌రూమ్‌ల్లో మూడు షిఫ్టుల్లో 60 మంది పనిచేయాలి. ఒక్కో షిఫ్టులో 20 మంది విధుల్లో ఉండాలి. సీతమ్మవారి పాదాలు, రాజీవ్‌గాంధీ పార్కు ఎదురుగా ఏర్పాటుచేసిన క్లోక్‌రూమ్‌ల్లో నలుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో 12 మంది పనిచేయాలి. పున్నమిఘాట్ వద్ద ఏర్పాటుచేసిన క్లోక్‌రూమ్‌లో షిఫ్టుకు ఆరుగురు చొప్పున.. మూడు షిఫ్టుల్లో 18 మంది విధుల్లో ఉండాలి. ఇవికాకుండా అత్యవసర కౌంటర్‌లో షిఫ్టుకు నలుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో 12 మంది ఉండాలి. మొత్తంగా 174 మందిని ఈ కౌంటర్లలో నియమించాలి. ఇలా కౌంటర్లను నిర్వహించినందుకు కాంట్రాక్టర్‌కు వీఎంసీ.. ఒక్కో ఉద్యోగికి రోజుకు రూ.600 చొప్పున చెల్లిస్తుంది. 25వ తేదీ వరకు మొత్తంగా వీఎంసీ రూ.5.22 లక్షలను కాంట్రాక్టరుకు చెల్లిస్తుంది. ఈ కౌంటర్లలో భక్తులు, భవానీల వస్తువులను, చెప్పులను భద్రపరిచినందుకు వారి నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదు. కానీ, కాంట్రాక్టర్ మాత్రం దీన్ని ఉల్లంఘించి బ్యాగ్‌కు రూ.20, చెప్పులకు రూ.10 వసూలు చేస్తోంది.



కెనాల్ రోడ్డులో ఏర్పాటుచేసిన క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం..

భవానీ దీక్షల విరమణ సందర్భంగా భక్తుల చెప్పులు, బ్యాగులను వీఎంసీ ఏర్పాటుచేసిన క్లోక్‌రూమ్‌లో ఉచితంగా భద్రపరుచుకునే సదుపాయం కల్పించాం. ఇక్కడ ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఇలా వసూలుచేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. అలాగే, భక్తులకు తెలిసేలా 'ఉచిత' బోర్డులు ఏర్పాటుచేస్తాం.

- టి.శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్

'ఎస్టేట్' ఏం చేస్తున్నట్టు?

క్లోక్‌రూమ్‌లు, చెప్పుల స్టాండ్ల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించిన ఎస్టేట్ విభాగం వాటిని పర్యవేక్షించాలి. టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టరును ఎంపిక చేయగానే, ఈ విభాగం చేతులు దులిపేసుకుంది. ఈ కౌంటర్లలో ఎలాంటి రుసుము వసూలు చేయకుండా.. పరిశీలించేందుకు ఎస్టేట్ విభాగానికి చెందిన సిబ్బందిని నియమించాలి. ఆ పని చేయట్లేదు. కనీసం ఉచిత బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. ఇలా బోర్డులు ఏర్పాటుచేసినప్పటికీ కౌంటర్లలో సిబ్బంది భక్తులను దబాయించి మరీ డబ్బు వసూలు చేస్తున్నారు. గత ఏడాది భవానీ దీక్షల విరమణ సమయంలో ఈ మహిళా కాంట్రాక్టర్ రూ.160కు టెండరును దాఖలు చేయగా, ఈసారి ఏకంగా రూ.600కు దాఖలు చేసింది. వీఎంసీ నుంచి వచ్చే డబ్బుతో పాటు భక్తుల నుంచి డబ్బు వసూలు చేసేందుకు తగిన సిబ్బందినే ఇక్కడ నియమించుకుంది. కాగా, ఉచితంగా సేవలు అందజేయాల్సిన కౌంటర్లలో ఈ దోపిడీ ఏమిటని భక్తులు మండిపడుతున్నారు.



కాలినడకన వస్తున్న భవానీలు



దీక్షతో..

భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు ప్రారంభం

- స్థానికంగా ఉన్న భవానీల రాక.. ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి
- హోమగుండం వెలిగించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన ఈవో

విజయవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే దీక్షల విరమణకు శనివారం ఉదయం 6.30 గంటలకు అంకురార్పణ జరిగింది. తొలుత వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, ఈవో రామారావు ప్రధానాలయంలో అమ్మవారికి హారతులిచ్చారు. అక్కడి నుంచి కాగడాతో వేద మంత్రోచ్చారణ నడుమ మహామండపం వద్ద ఉన్న హోమగుండాల వద్దకు చేరుకున్నారు. అగ్నిహోత్రంలో ఉన్న కట్టెలను వెలిగించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక భక్తులను దర్శనానికి అనుమతించారు. తొలిరోజు విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన భవానీలు వచ్చారు. ఇరుముడులతో ఇంద్రకీలాద్రి చుట్టూ గిరిప్రదక్షిణ చేసిన భవానీలు అనంతరం క్యూలైన్లలోకి చేరుకున్నారు. దర్శనం అయ్యాక మహామండపం కింద గురుభవానీలతో ఇరుముడులను ఇప్పించుకున్నారు. ఆ తర్వాత దీక్షా విరమణ చేశారు. హోమగుండం వద్ద ప్రదక్షిణలు పూర్తయ్యాక తలనీలాలు సమర్పించుకోవడానికి వెళ్లారు.

మొదటిరోజు నామమాత్రంగా..

మొదటిరోజు విజయవాడ పరిసర ప్రాంతాల్లోని భవానీలు రావడంతో పెద్దగా రద్దీ కనిపించలేదు. క్యూలన్నీ ఖాళీగానే ఉన్నాయి. భవానీల కంటే మామూలు భక్తుల సందడి ఎక్కువగా కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 28 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానంలో 18 వేల మంది భోజనాలు చేశారు. 4,183 మంది భవానీలు, భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకున్నారు. 1.20 లక్షల లడ్డూలను విక్రయించారు. సాయంత్రం నుంచి ఇతర ప్రాంతాల భవానీల రాక మొదలైంది. మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలీసులు, రెవెన్యూ, దేవస్థాన అధికారులు రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్, రామవరప్పాడు, ఇబ్రహీపట్నం, వారధి ప్రాంతాల్లో పోలీసులు క్లౌడ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఏ మార్గంలో భవానీలు ఎక్కువగా వస్తున్నారో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షిస్తున్నారు. కాగా, ఆదివారం భవానీల సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



మారని తీరుతో మార్పు ఎలా..?

- 'హెల్మెట్' అమలుకాకపోవడంపై హైకోర్టు సీరియస్
- జరిమానాలు విధిస్తున్నా మారని వాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో నెలకు సరాసరిన 22 మంది దుర్మరణం

8లో

నగరంలో కనిపించని ట్రాఫిక్ ఎడ్యుకేషన్



నగరంలో జరిగిన తనిఖీల్లో హెల్మెట్ లేని వాహనదారుడితో హెల్మెట్ కొనిపించి, చలానా కట్టించి రశీదును చూపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వీరబాబు

నందిగామ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కోట వీరబాబు (టీడీపీ), వైస్ చైర్మన్‌గా ఆళ్ల గోపాలకృష్ణ (టీడీపీ) ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో అధికారులు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించారు.

6లో

కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా దేవనబోయిన

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ నూతన చైర్మన్‌గా కోడూరు డీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. జనసేన పార్టీకి చెందిన వెంకటేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రతిపాదించారు. వైస్‌చైర్మన్‌గా నిడుమోలు డీసీ చైర్మన్, టీడీపీ నాయకుడు వల్లూరిపల్లి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గ్రామచావిడి కూల్చివేత

తిరువూరులో అనుమతి లేకుండా పట్టపగలే కూల్చివేత

1938 నాటి భవనం నేలమట్టం

8లో

రేషన్ ఫ్యాక్టరీ

సూరంపల్లిలో అక్రమ రేషన్ ఫ్యాక్టరీ బాగోతం

- రేషన్ డాన్ భాయ్ కనుసన్నల్లో గుట్టుగా నిర్వహణ
- రెండు జిల్లాలకు చెందిన పేదల బియ్యమంతా ఇక్కడికే సరఫరా
- గోనె సంచుల నుంచి పాలిథిన్ బ్యాగుల్లోకి రీసైక్లింగ్
- ఎంపిక చేసిన మిల్లులు, కాకినాడ, ముంబయి పోర్టుకు తరలింపు
- ఎవరికీ అనుమానం రాకుండా దోస్త్ వాహనాల వినియోగం



సూరంపల్లిలో రేషన్ ఫ్యాక్టరీ లోపల గోనె సంచుల నుంచి పాలిథిన్ సంచుల్లోకి రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్న సిబ్బంది

నగరానికి చెందిన అక్రమ బియ్యం వ్యాపారి 'భాయ్' రేషన్ దోపిడీలో మరో కోణం వెలుగుచూసింది. రెండు జిల్లాల నుంచి సేకరిస్తున్న రేషన్ అక్రమ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయడానికి ఏకంగా ఓ ఫ్యాక్టరీనే నడుపుతున్న విషయం బయటపడింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంతో పాటు రెండు జిల్లాల్లోని ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్ల దగ్గర సేకరించిన బియ్యాన్ని సూరంపల్లి పారిశ్రామికవాడలో అనధికార రేషన్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. ఇక్కడే రీసైక్లింగ్ ప్యాకింగ్ చేస్తున్నారు. మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి నేరుగా వచ్చే పీడీఎస్ బియ్యం బస్తాలను, ఎండీయూ ఆపరేటర్లు, డీలర్ల దగ్గర నుంచి వచ్చే పీడీఎస్ బియ్యం బస్తాలను ఇక్కడ లాట్లుగా దాస్తున్నారు. ప్రభుత్వ పీడీఎస్ బియ్యం సంచులకు ఉన్న ట్యాగ్‌లను కత్తిరించటం, గోనె సంచులను తొలగించటం, బియ్యాన్ని తీసి పాలిథిన్ బ్యాగుల్లో నింపటం, వాటిని ప్యాకింగ్ చేయటం ఇక్కడ జరుగుతోంది. ఇలా ప్యాకింగ్ చేసిన బియ్యం బస్తాలను దోస్త్ వాహనాల్లో గుంటూరు జిల్లాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం రేషన్ డాన్ 'భాయ్' కనుసన్నల్లో జరుగుతోంది. ఇటీవల సూరంపల్లిలో పోలీసుల దాడుల్లో ఈ రేషన్ ఫ్యాక్టరీ బాగోతం బయటపడింది. కానీ, పోలీసులు దీనిని రేషన్ బియ్యం గోడౌన్‌గా భావించారు. బియ్యం నిల్వలనే చూశారు తప్ప, ఈ గోడౌన్‌లో ఏం జరుగుతుందో పట్టించుకోలేదు.

ఏం చేస్తున్నారు..?

వాస్తవానికి ఇది రేషన్ గోడౌన్‌కాదు.. రేషన్ ఫ్యాక్టరీగా ఉంది. ఇక్కడ గోనె సంచుల నుంచి బియ్యాన్ని తీసి పాలిథిన్ సంచుల్లోకి మారుస్తున్నారు. అంటే బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్నారు. వందలాది పాలిథిన్ బస్తాలు ఇక్కడున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లు, ఎండీయూ ఆపరేటర్లు, రేషన్

మిగతా 6లో..



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆగిన దత్తత

- రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న ఆలయాలకే ఆ అవకాశం
- అరకోటి ఆదాయం, కోట్ల ఆస్తులు ఉన్న ఆలయం కోటిలింగ క్షేత్రం
- భవిష్యత్ టెంపుల్ టూరిజంలో ఓ వెలుగు వెలిగే అవకాశం

ఆంధ్రజ్యోతి కథనంతో తాత్కాలికంగా ఆగిన దత్తత

ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట రూరల్: 'శివార్పణం' శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో ముక్త్యాల కోటిలింగ క్షేత్రం ధారాదత్తం తాత్కాలికంగా ఆగడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలతో ఇచ్చిన తాళాలు వెనక్కు తీసుకుని ఆలయ అధికారులు తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. రూ.50 లక్షల వార్షిక ఆదాయం, రూ.1.60 కోట్ల ఎఫ్‌డీ, కోట్ల విలువచేసే భూమి కలిగిన ముక్త్యాల కోటిలింగ క్షేత్రాన్ని దత్తత ఇవ్వడంపై భక్తులు భగ్గుమంటున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆలయాల్లో రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండి దీప, ధూప నైవేద్యాలకు ఇబ్బందిగా ఉన్న ఆలయాలనే దత్తత ఇచ్చే అవకాశం ఉందని, అటువంటిది ఆదాయం, ఆస్తులు దండిగా ఉండటంతో పాటు భవిష్యత్‌లో టెంపుల్ టూరిజంలో ప్రధాన భూమిక పోషించే అవకాశం ఉన్న ఆలయానికి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. సరైన సమయంలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్‌పై అంచనాతోనే స్వాధీన యత్నం

రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న ముక్త్యాల గ్రామానికి భవిష్యత్తులో మహర్దశ పట్టే అవకాశం ఉందని పసిగట్టిన వారే కోటిలింగ హరిహర మహాక్షేత్రాన్ని దత్తత పేరుతో స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారని తెలుస్తోంది. పురాణ కాలం నుంచి చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ముక్త్యాల పవిత్ర కృష్ణానది ఉత్తరవాహిని క్షేత్రంగా, దక్షిణ కాశీగా పూజలందుకుంటోంది. ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు సమీపంలోనే గుంటూరు జిల్లా వైపు భరద్వాజ కొండలు, గ్రామంలో జమిందారుల కోట ఉండటంతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా వెలుగొందుతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం అప్పటిలోనే జల రవాణా, వాటర్ ఇంగ్లండ్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కార్యక్రమానికి గ్రామం కేంద్ర బిందువుగా ఉండటం గమనార్హం. టెంపుల్ టూరిజం పేరుతో విజయవాడ నుంచి కృష్ణానది వరకు వచ్చి రోడ్డు మార్గంలో వెళ్లేలా ఏర్పాటు చేసిన ప్రదేశానికి కేంద్ర బిందువుగా ఉంది. ఎలాచూసినా ముక్త్యాల భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి వెళ్తుందని అంచనా. గత టీడీపీ హయాంలో గుంటూరు జిల్లా నుంచి కృష్ణానది మీదుగా జిల్లాలోకి ప్లాన్ చేసిన బ్రిడ్జి కూడా ఈ కోటిలింగ క్షేత్రానికే అనుసంధానంగా వస్తుంది. బ్రిడ్జి, ఇంగ్లండ్ వాటర్ వర్క్స్, పంటుతో పాటు అన్ని అందుబాటులో ఉండటంతో క్షేత్ర ప్రాశస్త్యాన్ని పసిగట్టిన పీఠాధిపతి తనకున్న అంగ, అర్థబలంతో స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దత్తత పేరుతో ఆలయాన్ని తీసుకుంటున్నారనే సమాచారంతో

మిగతా 6లో..



ఇంద్రకీలాద్రిపై దీక్షలు విరమణ చేస్తున్న భవానీలు, కృష్ణవేణి ఘాట్‌లో జల్లుస్నానాలు చేస్తున్న భక్తులు



తొలిరోజు సజావుగా..

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ

భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ● ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా నిరంతర పర్యవేక్షణ: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



భక్తులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ కార్యక్రమం తొలిరోజు శనివారం సజావుగా సాగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా చేసిన ఏర్పాట్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆయన తెలిపారు. మోడల్ గెస్ట్‌హౌస్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించి, సీసీటీవీలు, డ్రోన్ విజువల్స్‌ను పరిశీలించారు. క్యూలైన్లను పరిశీలించి, భవానీ భక్తులతో ఏర్పాట్లపై మాట్లాడారు. చిన్నారులు తప్పిపోతే జాడను వెంటనే తెలుసుకునేందుకు దుర్గమ్మ ఆలయం అందుబాటులోకి తెచ్చిన చైల్డ్ మానిటరింగ్ సిస్టమ్(సీఎంఎస్) పనితీరును ఆయన పరిశీలించారు. స్వయంగా చిన్నారుల చేతికి క్యూ ఆర్ కోడ్ బ్యాండ్ వేశారు. ఘాట్లు, క్యూలైన్లు, హోమగుండాలు, గిరిప్రదక్షిణ, అన్నప్రసాదం పంపిణీ పాయింట్ల వద్ద రద్దీని, భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. డ్రోన్ దృశ్యాలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితులను చక్కదిద్దుతున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూచిక బోర్డులు, పబ్లిక్ అడ్రెసింగ్ వ్యవస్థ ద్వారా నిరంతర సూచనలు ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

భవానీలకు సకల ఏర్పాట్లు

భవానీపురం: సుదూర ప్రాంతాల నుంచి భవానీ దీక్షల విరమణకు వచ్చిన భక్తులకు దేవాదాయశాఖ, వీఎంసీ అధికారులు సకల ఏర్పాట్లు చేశారు. తొలిరోజు రద్దీ తక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం కృష్ణవేణి, పద్మావతి ఘాట్ల వద్ద భవానీల రద్దీ లేదు. జల్లుస్నానాలను భక్తులు సాఫీగా చేశారు. ఘాట్ల వద్దనే పిల్లర్ నుంచి పిల్లర్‌కు 100 అడుగుల నుంచి 200 అడుగులకు ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, 15 మందికిపైగా పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఘాట్లలో వ్యర్థాలను ప్లాస్టిక్ డబ్బాల్లోకి నింపి, వెంటనే మెయిన్‌రోడ్డుపై సిద్ధంగా ఉంచిన ట్రాక్టర్లలో నింపి, డంప్ యార్డుల్లోకి తరలించారు. ఎక్కడక్కడే ఎరుపురంగు దుస్తులను వదిలేయడంతో వాటిని పారిశుధ్య సిబ్బంది ప్లాస్టిక్ డబ్బాల్లోకి ఎత్తి మరో ట్రాక్టర్లలోకి ఎక్కిస్తున్నారు. ఘాట్ల వద్ద హోంగార్డు, మహిళా సిబ్బంది, ఎస్ఐలు అడుగడుగునా జల్లెడ పడుతుండటంతో భక్తుల రాకపోకలు ప్రశాంతంగా సాగుతున్నాయి. ఘాట్ల వద్ద, ప్రకాశం బ్యారేజీ, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్ల వద్ద రూట్లను తెలిపే సూచికలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయడంతో భవానీలు గమ్యస్థానాలకు చేరుకోవడం సులభం అయ్యింది.

మగ క్షురకులతో మహిళల కేశ ఖండన

అజిత్‌సింగ్‌నగర్: దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలోని కేశ ఖండనశాలలో మహిళలకు మగ క్షురకులు కేశ ఖండన చేస్తున్నారు. స్నానాల ఘాట్ ఎదురుగా దేవస్థాన అధికారులు కేశ ఖండనశాల ఏర్పాటు చేశారు. మహిళలకు ప్రత్యేక కేశ ఖండనశాల ఏర్పాటు చేసినా మగవారే క్షురకులుగా ఉన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేశ ఖండనశాలలో మహిళా క్షురకులు ఉంటే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.



మహిళకు తలనీలాలు తీస్తున్న క్షురకుడు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భవానీలు



కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా

దేవనబోయిన వెంకటేశ్వరరావు

▸ వైస్ చైర్మన్‌గా వల్లూరిపల్లి గణేష్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ నూతన చైర్మన్‌గా కోడూరు డీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు(జనసేన), వైస్ చైర్మన్‌గా నిడుమోలు డీసీ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్(టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో ప్రాజెక్టు కమిటీ ఎన్నిక నిర్వహించారు. దేవనబోయిన అభ్యర్థిత్వాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రతిపాదించారు. చైర్మన్, వైస్ చైర్మన్లను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సత్కరించారు. ఐదేళ్ల పాలనలో సాగునీటికాలువలు, డ్రెయిన్ల పూడికలు తీయలేదని, రానున్న కాలంలో కాలువ చివరి భూములకూ సాగునీరందించేందుకు దేవనబోయిన వెంకటేశ్వరరావు కృషి చేయాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తోందని మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. డీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణకు నియామక పత్రం అందిస్తున్న అధికారులు, పక్కన టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ

చైర్మన్‌గా కోట వీరబాబు

▸ వైస్ చైర్మన్‌గా ఆళ్ల గోపాలకృష్ణ

నందిగామ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కోట వీరబాబు(టీడీపీ), వైస్ చైర్మన్‌గా ఆళ్ల గోపాలకృష్ణ(టీడీపీ) ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో అధికారులు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించారు. 17 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్, వర్ల కుమార్‌రాజా, టీడీ పీ నాయకుడు గన్నే వెంకటనారాయణ(అన్న), బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య అభినందించారు.

ఆయకట్టు చివరి భూములకూ నీరందిస్తా: కోట వీరబాబు

ఆయకట్టు చివరి భూములకూ నీరందించడమే లక్ష్యంగా పని చేస్తానని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్‌కృతజ్ఞతలు తెలిపారు. తనకు అండగా నిలిచిన జిల్లా ఎమ్మెల్యేలకు, ఎంపీకి రుణపడి ఉంటానన్నారు.

సూర్య ఘర్‌తో ప్రతి ఇంటికీ ఆర్థిక స్వావలంబన

▸ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రతి ఇంటా సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకంతో ఆర్థిక స్వావలంబన వెలుగులు నిండాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకుని భావితరాలకు ఆరోగ్యకర పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందిద్దామని ప్రజలకు కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డీఆర్డీయే, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎం సూర్య ఘర్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద రూ.2లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20 వేలు లబ్ధిదారు వాటా పోనూ మిగిలిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు. నాలుగైదేళ్లలోనే పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందని, 20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందొచ్చని తెలిపారు. అవసరాలకు సరిపోయాక, మిగిలిన సౌరవిద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందొచ్చన్నారు. గత మూడు నెలల్లో జిల్లాలో సూర్య ఘర్ కనెక్షన్లకు విద్యుత్ సంస్థలు రూ.22 లక్షలు చెల్లించాయని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 601 సూర్య ఘర్ కనెక్షన్లు ఉన్నాయని, వీటిని రెండు లక్షలకు చేర్చి పథకం అమల్లో జిల్లాను నంబర్ 1గా నిలపాలని, ఇందులో స్వయం సహాయక సంఘాల మహిళా శక్తి కీలక భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. 200 యూనిట్లలోపు ఉచిత్ విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సూర్య ఘర్ పథకం కింద ఉచితంగా సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు చేస్తామన్నారు. సొంత ఇల్లు, విద్యుత్ కనెక్షన్ ఉన్నవారెవరైనా సూర్య ఘర్ వెబ్‌సైట్‌లో సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. సమీప సచివాలయం లేదా విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్డీయే పీడీ కె.శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఎ.మురళీమోహన్, సూర్య ఘర్ నోడల్ అధికారి ఎం.భాస్కర్ పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

కొల్లు వెంకటరమణకు ఘన నివాళి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ చిత్రపటానికి పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం టీడీపీ కార్యాలయ ఆవరణలో వెంకటరమణ సంతాప సభ నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్‌రాజా, బొమ్మిడి నాయకర్, వెనిగండ్ల రాము, వసంత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం తదితరులు సంతాప సభలో పాల్గొన్నారు.



పాల ఫ్యాక్టరీలో కేక్ కట్ చేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పక్కన ఎండీ కొల్లి ఈశ్వరబాబు

పాల ఫ్యాక్టరీలో సెమీక్రిస్మస్ వేడుకలు

▸ పాడిరైతులకు, వినియోగదారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమని కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) చైర్మన్ చలసాని అంజనేయులు అన్నారు. శనివారం పాల ఫ్యాక్టరీలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేశారు. పాడి రైతులకు వినియోగదారులకు, సమితి సిబ్బందికి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ జేసుదాసు, సిస్టర్ కీర్తి ప్రత్యేక ప్రార్థన చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన దత్తత

(5వ పేజీ తరువాయి)

భక్తులు, అధికారులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆలయాల్లో రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉండి దీప, ధూప నైవేద్యాలకు ఇబ్బందిగా ఉన్న ఆలయాలనే దత్తత ఇచ్చే అవకాశం ఉందని, రూ.45 లక్షల ఆదాయం, రూ.1.60 కోట్ల ఎఫ్‌డీ, కోట్ల విలువ చేసే భూమి కలిగిన ఆలయాన్ని దత్తత ఇవ్వటంపై భగ్గుమంటున్నారు. తాజా సమాచారం మేరకు తాత్కాలికంగా శివక్షేత్రానికి దత్తత నిలుపుదల చేసినట్లే తెలుస్తోంది. అంతేకాకుండా కోటిలింగాలలో మాస్టర్ సీవీవీ వేద పాఠశాల, హంపీ మఠం, గణపతి సచ్చిదానంద ఆశ్రమంతో పాటు తూర్పు భాగంలో రియల్ వెంచర్లు ఉండటంతో ముక్త్యాలలో కోటిలింగ క్షేత్రంపై కన్నేసినట్లు భావిస్తున్నారు.

గ్రామస్తుల ఆగ్రహం

జవాబుదారీతనం లేని వ్యవస్థగా దేవదాయ శాఖ మారుతోందని, ముక్త్యాల క్షేత్రాన్ని పూర్తిస్థాయి పరిశీలన చేయకుండానే దత్తతపై తీసుకున్న నిర్ణయంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధికి చర్యలు తీసుకోకపోగా, దత్తత ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం దాతల సహకారం తీసుకుని అభివృద్ధి చేయవచ్చని, జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే దేవదాయ శాఖాధికారులు తీసుకున్న నిర్ణయంలో అవినీతి కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటున్నారు.

తాత్కాలిక నిలుపుదల

కోటిలింగ క్షేత్రం దత్తత కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు దేవదాయ కమిషనర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. పూర్తి సమాచారం తెలుసుకుని, అన్నీ పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

రేషన్ ఫ్యాక్టరీ

(5వ పేజీ తరువాయి)

డీలర్ల నుంచి దిగుమతి చేసుకున్న గోనె సంచులతో కూడిన బియ్యం బస్తాలు కనిపిస్తున్నాయి. ఇంత భారీసంఖ్యలో రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తుంటే సివిల్ సప్లయిస్ అధికారులు, నిఘా సంస్థలు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ఎల్ఎల్ఎస్ పాయింట్లలో నిర్వహించిన ఆక్షన్‌లో భాగంగా కొనుగోలు చేసిన బియ్యపు రశీదుల జిరాక్స్ కాపీలను దగ్గర పెట్టుకుని పాలిథిన్ సంచులను దోస్త్ వాహనాల్లో ఎక్కించి, ఎంపిక చేసుకున్న మిల్లులకు, కాకినాడ పోర్టుకు, ముంబయి పోర్టుకు తరలిస్తున్నారు. ఇంత పెద్దస్థాయిలో రీ సైక్లింగ్ చేస్తుంటే సివిల్ సప్లయిస్ అధికారులు పట్టించుకోవటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ బియ్యం కార్యకలాపాలపై దాడులు చేస్తుంటే, ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం సివిల్ సప్లయిస్, విజిలెన్స్ శాఖలు నిద్రపోతున్నాయి.

'దోస్త్' వాహనాల్లో అక్రమ రవాణా

రేషన్ అక్రమ బియ్యం సామ్రాజ్యాన్ని నడుపుతున్న భాయ్ పేదల బియ్యాన్ని తరలించటం కోసం దోస్త్ వాహనాలను ఎంచుకున్నాడు. సొంతంగా కొనుగోలు చేసిన దోస్త్ వాహనాల్లో ఈ రవాణా జరుగుతోంది. ఒక్కో దోస్త్ వాహనంలో 80 వరకు రేషన్ బస్తాలను తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఈ వాహనాలను ఎక్కువగా కూరగాయలు తరలించటానికి ఉపయోగిస్తారు. అనుమానం రాకుండా ఉండటానికి వీటిని ఎంచుకున్నాడు. రేషన్ బియ్యాన్ని భారీగా సేకరిస్తే తన దగ్గర ఉన్న ఉన్న వాహనాలతో పాటు ప్రైవేట్ వాహనాలు కూడా సమకూర్చుకుంటున్నాడు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99,107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 580

ధ్యానంతో మానసిక ప్రశాంతత : డాక్టర్ ప్రభాకర్



ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ఆత్మీయ శాంతితో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని డాక్టర్ ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం అంటే కేవలం మౌనంగా కూర్చోటమే కాదన్నారు. దాని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నేటి ఒత్తిడి జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ సత్య కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అమలు భేష్

కేంద్ర డిప్యూటీ సెక్రటరీ పార్థసారథి భాస్కర్

కృష్ణలంక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలవుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడం అభినందనీయమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్, పబ్లిక్ గ్రీవెన్స్ కేంద్ర డిప్యూటీ సెక్రటరీ పార్థసారథి భాస్కర్ అన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న సుపరిపాలన వారోత్సవాలలో భాగంగా 'ప్రశాసన్ గావ్ కి ఓర్' ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అమలు జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన విధి విధానాలను పరిశీలించేందుకు పార్థసారథి భాస్కర్ శనివారం నగరంలోని కలెక్టరేట్ వీడియో



మాట్లాడుతున్న కేంద్ర డిప్యూటీ సెక్రటరీ పార్థసారథి భాస్కర్, కలెక్టర్ లక్ష్మీశ

కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు ఆన్‌లైన్, ముఖ్యమంత్రి ప్రజావేదిక, కాల్‌సెంటర్, పీజీఆర్ఎస్ ఈ మెయిల్, తదితర మార్గాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 16,806 అర్జీలను స్వీకరించగా వీటిలో 13 వేలకు పైగా పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లాలోని 323 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులలో సంబంధిత తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓ హాజరై అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 605 గ్రామ వార్డు సచివాలయాల ద్వారా 463 ప్రభుత్వ సేవలను స్థానికంగా ప్రజలకు చేరువ చేస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. తొలుత విజయవాడ రూరల్‌లోని గూడవల్లి సచివాలయం 1ను పార్థసారథి భాస్కర్ సందర్శించి సచివాలయం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి పి.జ్యోతి, లైజన్ ఆఫీసర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లయోలా వాకర్స్ నిరసన



భారతీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం మొండివైఖరి వదిలి గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతించాలని లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు కోరుతూ శుక్రవారం కళాశాల సమీపంలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద కళాశాల యాజమాన్య వైఖరిని వ్యతిరేకిస్తూ ఆంధ్రా లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు శాంతియుత నిరసన చేశారు. అనంతరం కళాశాల నుంచి రమేష్ హాస్పిటల్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. కళాశాల యాజమాన్యం వాకింగ్‌కు అనుమతించకపోతే త్వరలో ర్యాలీగా ప్రజాప్రతినిధుల దగ్గరకు బయలుదేరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అధ్యాపక బృందం

స్టెల్లాలో ముగిసిన మ్యాథ్స్ ఒలింపియాడ్ శిక్షణ

పటమట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ నేషనల్ మ్యాథ్‌మెటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంపు శనివారంతో ముగిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎంపిక చేయబడిన 28 మంది విద్యార్థినీ,విద్యార్థులు ఈ క్యాంప్‌లో శిక్షణ పొంది, జనవరి 19న జరగనున్న నేషనల్ పరీక్ష రాయాల్సి ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రస్ తెలిపారు. రిసోర్స్ పర్సన్స్, ప్రొఫెసర్ రజత్‌టాండన్, స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటి స్టిక్స్ హైదరాబాద్ యూనివర్సిటీకి చెందిన సుమన్‌కుమార్, ప్రొఫెసర్ అలోక్‌కుమార్, న్యూఢిల్లీ మ్యాథ్‌మెటికల్ ఒలింపియాడ్‌కు చెందిన ఎక్స్‌పర్ట్ ట్రైనర్ రాహుల్ చక్రవర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రీజనింగ్, లాజికల్ థింకింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, సుధాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీ అధ్యక్షుడు పాతూరికి సత్కారం



పాతూరి సాంబశివరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గద్దె, సీపీ రాజశేఖరబాబు, సీపీఎం నేతలు తదితరులు

భారతీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏస్) పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఏపీఐఐసీ కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు ఆత్మీయ సత్కారసభ శనివారం కాలనీలోని కల్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, సీపీఎం జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీ రాజశేఖరబాబు అవార్డు వచ్చినందుకు పాతూరికి అభినందనలు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు పాతూరి సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన క్రెడాయ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ 11వ జాతీయ సమావేశంలో ఈ కాలనీకి 30ఏళ్ల పాటు అధ్యక్షుడిగా అనేక సేవలు చేసినందుకు ఈ పురస్కారం అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్, ఎన్‌జీవో నాయకులు విద్యాసాగర్, ఆంధ్రా హాస్పిటల్ అధినేత పీవీ రమణమూర్తి, సీపీఐ, సీపీఎం నేతలు, కార్పొరేటర్లు జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీపీ సిద్ధార్థలో గణిత ప్రదర్శన



మొగల్రాజపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శనివారం గణిత శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో గణిత శాస్త్రానికి సంబంధించి 2డి, 3డి ఆకృతులను, గణిత ఆకృతులను, గణిత విశ్లేషణను విద్యార్థులు నమూనాలు ప్రదర్శించారు.

ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ సూరెడ్డి విష్ణు, పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, ఉపసంచాలకులు రోజ్‌మేరీ, ప్రిన్సిపాల్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ద్రవిడ సూరీడు పుస్తకావిష్కరణ

ధర్నాచౌక్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ కరుణానిధి స్ఫూర్తితో ఏకమైతేనే వారికి రాజకీయ మనుగడ సాధ్యమని బహుజన సమాజ్ పార్టీ ఏపీ స్టేట్ కో-ఆర్డినేటర్ జుజ్జువరపు పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. నగరంలో పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బీసీ మేథావుల వేదిక స్థాపనకు సన్నాహ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా తమిళనాడు మాజీ సీఎం కరుణానిధిపై అన్నవరపు బ్రహ్మయ్య రచించిన 'ద్రవిడ సూరీడు' పుస్తకాన్ని బీసీ ప్రముఖులు ఆవిష్కరించారు. రిటైర్డ్ ఉన్నతాధికారులు బీవీ రమణ కుమార్, రవీంద్ర నాథ్, బి.రామారావు, పలువురు బీఎస్పీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



క్రీస్తు జననం నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఎన్ఎస్ఎంలో సెమీక్రిస్మస్ వేడుకలు

పటమట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పటమట ఎన్ఎస్ఎం పాఠశాలలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ ఏసు ప్రభువు మానవాళికి అందించిన శాంతి సందేశాలను విద్యార్థులకు తెలిపారు. కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్‌ఫోర్డు మాట్లాడుతూ మనుషులు అందరూ క్షమాగుణం, సేవాభావం, అంకితభావం, మానవత్వం కలిగి ఉండాలన్నారు. జీసస్ జననం విశిష్టతను తెలిపే నాటకం, బైబిల్‌పఠనం, గీతాలాపన, చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. శాంతాక్లాజ్ వేషధారణలో విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు పంచిపెట్టారు. వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మ్యాథ్ యుఫోరియా 2కే 24లో పీబీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేబీఎన్ కళాశాల నిర్వహించిన మ్యాథ్ యుఫోరియా 2కే 24లో తమ జూనియర్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత అంత్యాక్షరిలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు కెమణికంఠకుమార్, వి.నాగహర్షలు, క్విజ్ మేథాన్‌లో కె. సందీప్, సిహెచ్ కృష్ణ, వి. పవన్‌కుమార్‌లు మూడో బహుమతి సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగాధిపతి ఎల్. కమలాభవానీ, అధ్యాపకులు ముంతాజ్‌బేగం, ఎల్. సాంబశివరావు, జయభారతి, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

లయోలాలో నానోటెక్నాలజీపై అవగాహన సదస్సు

భారతీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లయోలా కళాశాలలో ఫిజిక్స్ విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో కళాశాలలో ది ఫ్యూచర్ ఈజ్ నానో హౌ టైనీ టెక్నాలజీస్ ఆర్ ఛేంజ్ ది వరల్డ్ అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యోగి వేమన విశ్వవిద్యాలయం, నానోటెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం.మమతా కుమారి మాట్లాడుతూ నానోటెక్నాలజీ విప్లవాత్మకమైన అనువర్తనాలను వివరించారు. ఈ రంగం ఉపాధి, ఆవిష్కరణలకు అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్, హెచ్‌వోడీ డాక్టర్ టి.శ్రీకుమార్, ఐఏపీటీ ఏపీ చాప్టర్ సెక్రటరీ డాక్టర్ జి.సహాయభాస్కరన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పీబీఎస్ సాయిరాం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



పటమట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :నిర్భయ క్రాంతి మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో శనివారం పటమట శ్రీ విజయ భారతి హైస్కూల్‌లో వినియోగదారుల చట్టం- వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి సీనియర్ న్యాయవాది టీ కోదండరామ్, కన్స్యూమర్ కౌన్సిల్ మెంబర్ కె శ్రీనివాసరావులు వినియోగదారుల హక్కులు, మోసం జరిగినప్పుడు ఎలా గుర్తించాలి, దానికి సంబంధించి ఏ చట్టాలు ఉన్నాయనే అనే విషయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్భయ క్రాంతి అధ్యక్షురాలు అబ్బూరి రత్నలక్ష్మి, ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

నలందలో ప్రాంగణ ఎంపికలు

లబ్బీపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ హెచ్.ఆర్.వరదరాజన్, ఎస్.కృష్ణన్‌లు మాట్లాడుతూ సేల్స్, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్‌పై అవగాహన ఉండాలన్నారు. రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని, 110మంది బీకామ్, బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా వారిలో 45మంది ఎంపికయ్యారనితెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

27 నాటికి మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

● దగ్గుబాటి పురంధేశ్వరి



మాట్లాడుతున్న పురంధేశ్వరి

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కమిటీలు ఈనెల 27వ తేదీ నాటికి పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం బీజేపీ సంస్థాగత ఎన్నికలపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ పార్టీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాకా వెంకట సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ప్రధాన కార్యదర్శి మధుకర్ పాల్గొన్నారు.

కేజీ చిన్నారుల స్పోర్ట్స్ మీట్




చిన్నారులకు, సర్టిఫికెట్లు అందజేస్తున్న జాన్సన్, పద్మజ

గవర్నర్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నలంద విద్యానికేతన్‌లో శనివారం కేజీ చిన్నారుల 27వ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. నలంద కిండర్ గార్డెన్ విద్యార్థులతో పాటు వన్‌టౌన్‌లోని నలంద టాడ్‌లర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఒకే రకమైన దుస్తులతో చిన్నారులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ పి. జాన్సన్ విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పర్యవేక్షణలో జరిగిన మీట్‌లో 400 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మారని తీరుతో మార్పు ఎలా..?

జరిమానా ఎంతైనా విధించండి. మొత్తం చెల్లిస్తాం. హెల్మెట్ మాత్రం అడగొద్దు అన్నట్టుంది విజయవాడలోని ద్విచక్ర వాహనదారుల పరిస్థితి. ట్రాఫిక్ పోలీసుల తీరు కూడా అందుకు తగినట్టుగానే ఉంది. జరిమానా విధిస్తున్నారే కానీ వారిలో మార్పు తీసుకురాలేకపోతున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో సగం మంది హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రమాదాల్లో నెలకు సరాసరిన 22 మంది చనిపోతున్నారు. విజయవాడలో 30లక్షల వరకు వాహనాలున్నాయి. అందులో 10లక్షల వరకు ద్విచక్ర వాహనాలున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వారిలో ఎక్కువ మంది హెల్మెట్ జోలికి వెళ్లడం లేదని తెలుస్తోంది. ప్రతి 100 మందిలో 25-30 మంది మాత్రమే హెల్మెట్ ధరిస్తున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల హెల్మెట్ ధారణను కచ్చితంగా అమలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. దీనితో ట్రాఫిక్ పోలీసులు మళ్లీ జూలు విదల్చడం మొదలుపెట్టారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

- 'హెల్మెట్' అమలుకాకపోవడంపై హైకోర్టు సీరియస్
- జరిమానాలు విధిస్తున్నా మారని వాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో నెలకు సరాసరి 22 మంది మృతి
- నగరంలో కనిపించని ట్రాఫిక్ ఎడ్యుకేషన్



నిత్య ఉల్లంఘనలు

- సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వాహనంపై జంక్షన్ దాటడం
- సమీపంలో ఉన్న యూటర్న్ నుంచి వెళ్లడానికి వ్యతిరేక దిశలో వెళ్లడం
- రహదారులపై వేగ పరిమితిని వదిలేసి రాకెట్ మాదిరిగా దూసుకెళ్లడం
- ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను స్టాప్‌లకు పక్కన కాకుండా రహదారికి మధ్యలో నిలుపుదల చేయడం.

పోలీసు శాఖలోని అన్ని విభాగాలకు ప్రతి ఏడాది ఒక టార్గెట్ ఉంటుంది. ట్రాఫిక్ విభాగానికి ఈ-చలాన్ విధింపునకు టార్గెట్ పెట్టుకుంటారు. అవి లక్ష్యంతోపాటు లక్షలు దాటుతున్నా మార్పు కనిపించడం లేదు. నగరంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించిన పోలీసులు రూ.100 జరిమానా విధిస్తున్నారు. ఇది కాకుండా ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్నందుకు రూ.1000 జరిమానా విధిస్తున్నారు. మొత్తంగా రూ.1100 జరిమానాను విధిస్తున్నా వాహనదారులు తలపై హెల్మెట్ పెట్టుకునే పరిస్థితి నగరంలో కనిపించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు హడావుడి చేస్తారన్న విషయాన్ని వాహనదారులు గమనించారు. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించడంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పటిష్ఠంగా అమలు చేసినప్పుడు వాహనదారుడి తలపై హెల్మెట్ కనిపిస్తుందని రహదారి భద్రతపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి.

స్టాప్ ఉండదు.. జీబ్రా కనిపించదు..

స్టాప్‌లైన్, జీబ్రాలైన్ రహదారులపై కూడళ్ల వద్ద కనిపించాలి. వాటిపై వాహనదారులకు, పాదచారులకు అవగాహన ఉండాలి. అభివృద్ధి చెందిన నగరాల్లో ప్రతి కూడలిలో వాహనాలు ఆగే ప్రదేశంలో ముందుగా జీబ్రాలైన్, వెనుక స్టాప్‌లైన్ ఉంటుంది. గ్రీన్‌సిగ్నల్ ఆరెంజ్‌లోకి మారినప్పుడు వేగాన్ని తగ్గించుకోవాలి. రెడ్‌సిగ్నల్ పడగానే వాహనాలను ఆపుకోవాలి. ఇలా ఆగే వాహనాలు స్టాప్‌లైన్‌ను తాకకూడదు. ఒకవేళ తాకితే ఎదురుగా ఉండే సీసీ కెమెరా ఫొటో క్లిక్‌మనిపిస్తుంది. దాని ప్రకారం ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తారు. ఇక జీబ్రాలైన్ పూర్తిగా పాదచారులకు సంబంధించినది. కూడలిని ఒక వైపు నుంచి మరో వైపునకు దాటే పాదచారులు దీని మీదుగా నడవాలి. ప్రతి కూడలిలో పాదచారుల అడుగులను నియంత్రించే సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వాహనాలకు సిగ్నల్స్ ఉన్నట్టే పాదచారులకు సిగ్నల్స్ ఉంటాయి. విజయవాడలో పరిస్థితి లేదు. కేవలం వాహనాల రాకపోకలను మాత్రమే సిగ్నల్స్ నియంత్రిస్తున్నాయి. నగరంలో ఏ కూడలి వద్ద స్టాప్‌లైన్, జీబీలైన్ కనిపించవు. రెడ్‌సిగ్నల్ పడినప్పుడు స్టాప్‌లైన్ వెనుక ఆగాల్సిన వాహనదారులు జీబ్రాలైన్ దాటుకుని ముందుకొస్తారు. కొంత మంది సరిగ్గా జీబ్రాలైన్ మీదే ఆగుతారు. వాటి మధ్య నుంచి పాదచారులు దాటుతుంటారు.

కనిపించని 'ఈఈఈ'

ఈఈఈ... ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్ ట్రాఫిక్ విభాగానికి ఈ మూడు ముఖ్యమైన భాగాలు. దేశంలో మెట్రోపాలిటన్ నగరాల్లో ట్రాఫిక్ ఒక క్రమబద్ధీకరణ ప్రకారం నడుస్తుందంటే ప్రధాన కారణం ఇదే. పొరుగున ఉన్న హైదరాబాద్ నగరంలో 2010 నుంచి ఈఈఈని అమలు చేస్తున్నారు. ఫలితాలు నాలుగైదేళ్ల తర్వాత కనిపించాయి. ప్రస్తుతం ట్రాఫిక్ అవగాహన ఉన్న నగరాల్లో హైదరాబాద్ ఒక స్థానాన్ని సంపాదించుకుంది. అమరావతిలో భాగంగా ఉన్న విజయవాడలో మాత్రం ఈఈఈ ఛాయలు ఎక్కడా లేదు. ఒక ఈ మాత్రమే కనిపిస్తోంది. వారాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మాత్రం నిర్వహిస్తున్నారు. నంబర్ల ప్లేట్, రికార్డులు లేకుండా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు చలాన్లు విధిస్తున్నారు. వీటిని వాహనదారులు పట్టించుకోవడం లేదు. ఇంజనీరింగ్ కొద్ది రోజులుగా నగరంలో కొనసాగుతోంది. పోలీసు కమిషనర్, ట్రాఫిక్ విభాగాధికారులు నగరంలో పర్యటించి ట్రాఫిక్ ఆగిపోతున్న ప్రదేశాలను గుర్తించారు. అక్కడ మార్పులను వీఎంసీ అధికారులకు వివరించి సరిచేయించారు. ఇది కొంత వరకు ఫలితాలను ఇస్తోంది.

తగినంత ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదు : వాసు, వీడు (వలంటరీ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఎకానమిక్ డెవలప్‌మెంట్ యూనిట్)

కేరళలోని కొచ్చి, తమిళనాడు చెన్నై, కొయంబత్తూరు, మధురైలో హెల్మెట్ నిబంధన కచ్చితంగా అమలు చేస్తారు. హెల్మెట్ ధరించి చిన్‌స్ట్రాప్ పెట్టుకోకపోయినా జరిమానా విధిస్తారు. అందుకే అక్కడ మరణాల సంఖ్య చాలా తక్కువ. జాతీయ రహదారికి ఎడమ వైపు షోల్డర్ లైన్ ఉంటుంది. అందులోనే వెళ్లాలి. దీన్ని నగరం నుంచి వెళ్లే జాతీయ రహదారిపై ఎవరూ పాటించడం

ఏం చేయాలి?

- వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి ప్రతి కూడలిలో విస్తృతంగా ప్రచారం జరగాలి. ఉల్లంఘిస్తే జరిమానాలు, శిక్షలు వివరించాలి.
- ఇది పూర్తయ్యాక ట్రాఫిక్ నిబంధనలను ఎప్పటి నుంచి పటిష్ఠంగా అమలు చేస్తారో తెలపాలి. కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి. కొన్ని కూడళ్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలున్నాయి. ప్రకటనలు చేయించాలి.
- పదే పదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను కొన్ని రోజులపాటు సస్పెండ్ చేయడమో, రద్దు చేయడమో చేయాలి.
- ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సమన్వయంతో వ్యవహరించాలి.
- కూడళ్లలో స్టాప్‌లైన్, జీబ్రా లైన్ల వ్యత్యాసాలను వాహనదారులకు తెలపాలి.
- ట్రాఫిక్ సిగ్నల్స్ కచ్చితంగా అనుసరించేలా అవగాహన పెంచాలి.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో, డిప్యూటీ ఈవో

దుర్గమ్మ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

వన్‌టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను శనివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు దర్శించుకున్నారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేయగా ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు, పక్కన భైరా రామకోటేశ్వరరావు, రవికృష్ణ, రంగనాథం

మత్తు పదార్థాల కారణంగానే నేరాలు అధికం

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు

విజయవాడ లీగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల కారణంగానే సమాజంలో నేరాలు అధికంగా జరుగుతున్నాయని పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఎన్ఐసీ సెంటర్‌లో ఉన్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల కేసులను ఎలా విచారణ చేయాలి, ఎటువంటి శిక్షలుంటాయనే అంశంపై వర్చువల్‌గా సమావేశం జరిగింది. జిల్లాలోని ఏపీపీలు, పీపీలతో పాటు రాష్ట్రంలోని పలువురు పోలీసు అధికారులు, ఏపీపీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం గంజాయి ఇతర మత్తుపదార్థాలు అమ్మేవారిపైన, సేవించే వారిపైన కేసులు కట్టడం జరుగుతుందన్నారు. ఈగల్ డైరెక్టర్ రవికృష్ణ, సిస్టాస్టర్ సూపరింటెండెంట్ ఎ.రంగనాథం, డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ భైరా రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోర్టు స్టే ఉన్నా రైతుల భూముల్లో తవ్వకాలు

- వ్యతిరేకించిన రైతులు, తిరిగి గోతులు పూడ్చివేత

విజయవాడ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బైపాస్ పనుల్లో భాగంగా హైటెన్షన్ విద్యుత్ స్తంభాల మార్పిడి విషయంలో హైకోర్టు స్టే ఇచ్చినా మెఘా సంస్థ బేఖాతరు చేసింది. రైతులకు తెలియకుండా గురు, శుక్రవారాల్లో వారి పొలాల్లో తవ్వకాలు జరపి నిర్మాణ పనులు చేపట్టడాన్ని శనివారం రైతులు గుర్తించారు. సంస్థ చర్యలపై కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైతుల ఆందోళనతో వెనక్కి తగ్గిన సంస్థ పనులను నిలిపివేసి తవ్విన గోతులను పూడ్చివేసింది. వివరాల్లోకి వెళితే కొంతకాలంగా రూరల్ మండలంలోని పలు గ్రామాల పరిధిలో రైతుల అనుమతులు లేకుండా మెఘా సంస్థ వారి పొలాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం తవ్వకాలు జరుపుతున్న నేపథ్యంలో రైతులు వరుస ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై గత నెల 24న రైతులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అనంతరం రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి భూములు కోల్పోతున్నామని తెలియజేయగా ఆయన స్వయంగా ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీని వేశారు. అయినా సంస్థ వెనక్కి తగ్గకుండా రెండు రోజులుగా పొలాల్లో తవ్వకాలు చేపట్టి కాంక్రీట్ పనులు చేస్తోంది. దీనిపై రైతులు మరోమారు ఆందోళన వ్యక్తం చేస్తూ కొత్తపేట సీఐ కొండలరావుకు ఫిర్యాదు చేశారు. అలాగే రైతులు తవ్వకాలు జరిపిన ప్రాంతానికి వెళ్లి గోతులను పూడ్చాలని డిమాండ్ చేయడంతో వెనక్కితగ్గిన సంస్థ సిబ్బంది తవ్వినగోతులను పూడ్చివేశారు.



కోర్టు స్టే ఉన్నా తవ్వకాలు జరిపిన మెఘా సంస్థ

గ్రామచావిడి కూల్చివేత!

తిరువూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చీరాల సెంటర్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ భవనం (గ్రామచావిడి)ను ఎలాంటి అనుమతి లేకుండానే కూల్చివేశారు. పట్టపగలు రెవెన్యూకి భవనాన్ని పడేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ చావడిని ఎందుకు కూల్చారు? ఎవ్వరు కూల్చమన్నారు? అనేవి బేతాల ప్రశ్నలా మారాయి, 1938 బ్రిటీష కాలంలో పట్టణంలో రెవెన్యూ కార్యాలయం (తహసీల్దార్)తో పాటు, బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కనే సుమారు 6 సెంట్ల స్థలంలో గ్రామ చావడి భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటుగా, వీఆర్‌వోలు (అప్పట్లో కరణాలు) విధులు నిర్వహించేవారు. కాలక్రమంలో ఈ భవనం శిధిలావస్థకు చేరింది. దీంతో దీన్ని ఖాళీ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేవారు. మధ్యలో కొంతకాలం చావిడిని శుభ్రం చేయించి వీఆర్‌వోలు వినియోగించుకున్నా, వార్డు సచివాలయం రావడంతో వీఆర్‌వోలు, ఆయా వార్డు సచివాలయాల్లో తమ విధులు నిర్వహిస్తున్నారు. సమీపంలో రైతుబజార్ ఏర్పాటు చేయడంతో వినియోగదారులు ఈ చావిడిస్థలం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నిరుపయోగంగా ఈ స్థలంలో లీజు పద్ధతిలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తులో రెవెన్యూ అధికారులు కార్యాలయం నిర్వహణ, అతిథిగృహం ఏర్పాటుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు ప్రతిపాదించగా, స్థానిక రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అనంతరం ప్రధాన రహదారిలో కోట్ల విలువైన రెవెన్యూ స్థలం, అన్యాక్రాంతం అవుతుందని ఆరోపిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేయగడంతో అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం గ్రామచావిడి ఆవరణలో చిరువ్యాపారులు తమ బండ్లు, ఇతర వాహనాలు పెట్టుకుంటున్నారు. కాగా ఉదయం గ్రామచావిడి భవనాన్ని ఎవరు, ఎందుకు కూల్చివేశారో, రెవెన్యూ అధికారుల అనుమతి ఉందో లేదో తెలియని పరిస్థితి.



గ్రామచావిడి (ప్రభుత్వ కార్యాలయం) కూల్చివేయగా ఖాళీగా కనిపిస్తున్న స్థలం, పడేసిన ఎక్స్‌కవేటర్

కేసు పెడుతున్నాం: కె.లక్ష్మి, తహసీల్దార్

పట్టణంలో గ్రామచావిడి కూల్చివేతపై తహసీల్దార్ కె. లక్ష్మిని వివరణ కోరగా, గ్రామచావిడిని కూల్చివేసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, ఈ సంఘటనపై వీఆర్‌వోతో, పోలీస్ స్టేషన్‌లో కేసు పెడుతున్నట్టు తెలిపారు.



27 నుంచి నగరంలో సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాంప్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 27 నుంచి 29 వరకు 35వ సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి రావాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుకు జిల్లా ఆక్వాటిక్ చైర్మన్ యలమంచిలి వెంకట సురేష్, ఐ రమేష్ ఆహ్వానం అందించి కోరారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 బాలబాలికల విభాగాల్లో మొత్తం కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 500 మంది స్విమ్మర్ల బరిలో దిగుతున్నారన్నారు. క్రీడాకారులకు వసతి, ఇతర ఏర్పాట్లు చేసినట్టు రమేష్ వివరించారు.

యోగాసన పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్లు

భువనేశ్వర్‌లో కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పురుషుల, మహిళల చాంపియన్‌షిప్‌లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్లను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అభినందించారు.

మహిళా జట్టు: జీ శ్రీజ, జీ శ్రావణి, కే హరిణి, ఎస్‌కే కామర్జాహన్, ఎస్‌కే కరిష్మా, వీ సౌందర్య, టీవీ హైందవి.

పురుషుల జట్టు: జీ సాయి కిరణ్, ఎల్ సాయికృష్ణ, వై గోపీకృష్ణ, షిబినాత్ పాల్, పీ ముకేష్, టీ లవన్న, పీ నవీన్

స్వల్ప కాలిక వృత్తి కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే స్వల్ప కాలిక వృత్తి కోర్సుల శిక్షణకు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారధి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఆపై అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ (డిజిటల్ మార్కెటింగ్)కోర్సులకు 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ కల్పిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల యువత ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9347779032, 8008742842 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.



నవదుర్గ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 18వ వార్షికోత్సవం

ప్రసాదంపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గొప్ప సమాజాన్ని తయారు చేయాలంటే పిల్లలకు నైతిక విలువలు నేర్పాలని ఎంఈపీఎంఏ డైరెక్టర్ నంబూరి తేజ్ భరత్ అన్నారు. శనివారం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథిగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హాజరై 10, 12వ తరగతుల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. నవదుర్గ, అయ్యప్పస్వామి నృత్య రూపక ప్రదర్శనలతోపాటు జానపదాలు, దేశ, విదేశీ నృత్యాలతో విద్యార్థులు అలరించారు. అనంతరం తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రతి మనిషి ఓపిక, విశ్వాసం, నమ్మకం వంటి లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వరన్ వార్షిక నివేదికను సమర్పించారు. 2024-25 ఉత్తమ విద్యార్థిగా 12వ తరగతి చదువుతున్న తబిత శీలం, 2023-24లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ పి.సునంద బహుమతులు అందజేశారు. సీబీఎస్ఈ రీజనల్ ఆఫీసర్ సువేందు శేఖర్ దాస్, డైరెక్టర్స్ పరిమి చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలు పారిశ్రామికంగా ఎదగాలి

- 29న జంక్షన్‌లో ప్రపంచ మాదిగ దినోత్సవం, పారిశ్రామిక సదస్సు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మాదిగలు పారిశ్రామికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ అండ్ ట్రేడ్ ఇండస్ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు గెడ్డం బాపిరాజు తెలిపారు. ఈ నెల 29న హనుమాన్‌జంక్షన్‌లో ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్, ఇంటర్నేషనల్ మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 7వ ప్రపంచ మాదిగ దినోత్సవంతో పాటు మాదిగల పారిశ్రామిక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. అవగాహన సదస్సు, మాదిగ దినోత్సవం వాల్ పోస్టర్, కరపత్రాలను శనివారం స్థానిక విజయవాడ రోడ్డులో ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సన్నాహక కార్యక్రమంలో బాపిరాజు ఆవిష్కరించారు. సదస్సుకు దేశం నలుమూలల నుంచి మాదిగ మేధావులు, రాజకీయ ప్రముఖులు, హాజరవుతున్నట్టు తెలిపారు. అలాగే దాదాపు 2వేల మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సదస్సుకు జంక్షన్‌లో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన కమిటీ సభ్యులు మట్టా విద్యార్థి, మట్టా వరసాయి ప్రసాద్, జాన్‌ముడి, కోలవెంటి గాంధీ, బొకినాల సాంబశివరావు, గండేపూడి నితీష్‌కుమార్, కొమ్మన కవిత, పచ్చిగళ్ల నాగేశ్వరరావు, కాటూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.



ప్రపంచ మాదిగ దినోత్సవం వేడుక పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళా శక్తి, సాధికారతకు సాక్ష్యం బ్రాహ్మణి

వన్‌టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తికి, సాధికారతకు నిలువెత్తు సాక్ష్యం నారా బ్రాహ్మణి అని, పుట్టినిల్లు నందమూరి, మెట్టినిల్లు నారా కుటుంబాల ప్రతిష్ఠలను బ్రాహ్మణి ఇనుమడింపజేస్తోందని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలను కృష్ణా జిల్లా టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అందరికీ విందాయిలు పంచిపెట్టారు. అనంతరం పేదవారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ, రాష్ట్ర బీసీ ఫెడరేషన్ తరపున బ్రాహ్మణికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ యువ వ్యాపారవేత్తగా ఆమె దేశం అంతటా హెరిటేజ్ సంస్థను విస్తరిస్తూ, వ్యాపార రంగంలో సత్తాను చాటుతూ దేశ విదేశాల్లో నందమూరి, నారా కుటుంబాల పేరును నిలబెడుతున్నారన్నారు. జోన్-1 కో-ఆర్డినేటర్ పూతి కోటేశ్వరరావు, జోన్-5 కో-ఆర్డినేటర్ నరసింహులు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పెరేపి ఈశ్వర్, గుర్రం నూకరాజు, గొల్లంగి ఆనంద్‌బాబు, ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మరక శ్రీనివాస్ యాదవ్, విశాఖపట్నం జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయ్ కుమార్, ఉపాధి హామీ మండలి మాజీ సభ్యుడు పోతుగంటి పిరయ్య, ఎన్టీఆర్ జిల్లా గౌడ సాధికారి కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, రాష్ట్ర బీసీ సెల్ నేతలు కత్తుల మణికంఠ, వల్లూరు కిరణ్, తిరుపతి గౌడ్, యార్లగడ్డ రమేష్, మన్నెం పోతురాజు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నేతలు



ఎన్టీటీపీఎస్ సీఈ నాగరాజు సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

ఎన్టీటీపీఎస్ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు ఉత్పత్తి

- సీఈని సన్మానించిన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్ చరిత్రలోనే గతంలో వచ్చిన 50.17 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని అధిగమించి ఈనెల 18న 50.47, 19న 50.66, 20న 51.14 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించి ఆల్‌టైమ్ రికార్డు సాధించినందుకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచ్ కోశాధికారి తానికొండ మణిబాబు ఆధ్వర్యంలో చీఫ్ ఇంజనీర్ నాగరాజును శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర నేత సత్య ప్రసాద్ మాట్లాడుతూ అపార అనుభవం కలిగిన సీఈ వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఉద్యోగులందరూ కష్టపడి పనిచేసి మరింత ఉత్పత్తి సాధించాలన్నారు. ఎస్ఈ పటేటి ప్రసాద్, డీఈలు ఈశ్వరయ్య, గోపికృష్ణ, పాపారావు, ఏడీ జ్ఞానేశ్వరరావు, కొత్తపల్లి వెంకట రమణ పాల్గొన్నారు.



కేబుల్ ఆపరేటర్‌లతో మాట్లాడుతున్న ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి

కేబుల్ ఆపరేటర్‌ల సమస్యలు పరిష్కరిస్తాం

- ఫైబర్‌నెట్ చైర్మన్ వెంకట్ రెడ్డి

గన్నవరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ ఆడిటోరియంలో కేబుల్ ఆపరేటర్ల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షలు కనెక్షన్‌లుండేవని ఇప్పుడు 5 లక్షలకు పడిపోవడానికి గత ప్రభుత్వమే కారణమన్నారు.

ఏపీ రోలర్ స్కేటర్లకు పతకాల పంట

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు, మైసూరు, కోయంబత్తూర్ నగరాల్లో జరిగిన 62వ జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో 371 మంది స్కేటర్లు వివిధ కేటగిరుల్లో పాల్గొనగా 168 పతకాలను వశం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ స్కేటర్లు ఇంత స్థాయిలో పతకాలను సాధించడంపై ఏపీ రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి థామసయ్య, అధ్యక్షుడు జే సుధాకర్ రెడ్డి, కోచ్‌లు వరుణ్‌కృష్ణ, దిలీప్ క్రీడాకారులను అభినందించారు. అత్యధికంగా ఆర్టిస్టిక్‌లో 25 స్వర్ణాలు, 30 రజతాలు, కాంస్యాలు 21 పతకాలను, స్పీడ్‌లో 4, అదర్ గేమ్స్‌లో 4, హాకీ టీమ్‌లో 1, ఆర్టిస్టిక్ ఈవెంట్‌లో 9 స్వర్ణాలను క్రీడాకారులు సాధించారు.

మానవత్వం లేదా!?

హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖులు.. బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదేం!?

- హీరో, నిర్మాత.. ఎవరూ పిల్లాడి దగ్గరకు పోలేదు
- పోలీసులు రావద్దని చెప్పినా థియేటర్‌కు హీరో
- మానవత్వం లేని ఇలాంటి వాళ్లను అరెస్టు చేస్తే.. పదేళ్లు మంత్రులుగా పని చేసిన వాళ్ల పైశాచికత్వం
- సినీ పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "ఒక్కపూట జైలుకు వెళ్లి వచ్చిన హీరో ఇంటికి సినీ ప్రముఖులంతా క్యూ కట్టారు. ఆయనకు ప్రమాదం జరిగిందా? ఏమైనా జబ్బు పడ్డారా? హీరోను పరామర్శించేందుకు క్యూ కట్టిన సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు!? సినిమా చూడటానికి వెళ్లిన కుటుంబంలో మహిళ చనిపోతే 11వ రోజు వరకు హీరో, ప్రొడ్యూసర్ ఎవరూ వారిని పరామర్శించలేదు. కనీసం ఆస్పత్రిలో ఉన్న ఆ పిల్లాడి దగ్గరకు పోలేదు. ఇది ఏ రకమైన మానవత్వం!?" అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కనీసం వారిని పరామర్శించాలన్న మానవత్వం కూడా సినిమా పరిశ్రమకు లేదా!? అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు పోయే సంఘటనలు జరుగుతాయంటే సినీ పరిశ్రమకు ప్రత్యేక రాయితీలు కల్పించబోమని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని తమ సర్కారు వదిలిపెట్టబోదని తేల్చి చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అసలు ఏం జరిగిందో ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కోరారు. దాంతో, సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఈ ఘటనపై విపక్షాలు, సినీ ఇండస్ట్రీ వ్యవహరించిన తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈనెల 4న పుష్ప-2 సినిమా విడుదలవుతుందని, ఆ రోజు చిత్ర యూనిట్ సభ్యులు, హీరో, హీరోయిన్ వస్తున్నారని, బందోబస్తు కావాలంటూ ఈనెల 2న సంధ్య థియేటర్ యాజమాన్యం చిక్కడపల్లి పోలీసు స్టేషన్లో దరఖాస్తు పెట్టుకుంది. దాంతో, ఆ థియేటర్ పరిసరాల్లో పది వరకు సినిమా హాళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయని, ఎంట్రీ, ఎగ్జిట్ ఒక్కటేనని, సెలబ్రిటీలు వస్తే జనాన్ని అదుపు చేయడం కష్టమని, బందోబస్తు ఇవ్వడం కుదరదని మూడో తేదీనే చిక్కడపల్లి పోలీసులు రాతపూర్వకంగా జవాబిచ్చారు. దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు అందులో చెప్పారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా పుష్ప సినిమా హీరో థియేటర్‌కు వెళ్లారు. కేవలం సినిమా చూసి వెళ్లిపోతే అభ్యంతరం ఉండేది కాదు. కానీ, ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచే కారు రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేసుకుంటూ వెళ్లారు. దీంతో, పక్కన ఉన్న అన్ని థియేటర్ల నుంచి అభిమానులు ఒక్కసారిగా థియేటర్ వైపు వచ్చారు. హీరో కారు థియేటర్ లోపలికి పంపేందుకు గేట్లు తెరిచారు. దాంతో ఆయన్ను చూసేందుకు అభిమానులంతా ఒక్కసారిగా లోపలికి తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు హీరో ప్రైవేటు సెక్యూరిటీ, బాడీ గార్డ్స్ గట్టిగా వెనక్కు నెట్టారు. అది తొక్కిసలాటకు దారి తీసింది. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి చనిపోయారు. ఆమె కుమారుడికి ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. కోమాలోకి వెళ్లాడు. అంత తొక్కిసలాటలో కూడా ఆ తల్లి కొడుకు చేయి విడిచిపెట్టలేదు. కొడుకు చేయి పట్టుకుని ఆ తల్లి చనిపోయింది. హీరో థియేటర్ లోపల ఉండడంతో అక్కడ కూడా తొక్కిసలాట జరిగింది. ఈ విషయాన్ని సంధ్య థియేటర్ యాజమాన్యానికి చెప్పి, హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. అయినా, వారు వినలేదు. సరికదా బాడీ గార్డ్‌లు పోలీసులను నిలువరించారు. పరిస్థితి చేజారే ప్రమాదం ఉందని గుర్తించి ఏసీపీ రంగంలోకి దిగారు. శాంతి భద్రతలు చేయి దాటే ప్రమాదం ఉందని, ఇప్పటికే ఒకరు చనిపోయారని, మరొకరు ఆస్పత్రి పాలయ్యారని హీరోకు ఏసీపీ వివరించారు. తక్షణమే థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయినా.. సినిమా మొత్తం అయిపోయిన తర్వాతే వెళ్తానని అంటూ బయటకు వెళ్లడానికి హీరో ఒప్పుకోలేదని సిటీ కమిషనర్ చెప్పారు. దీంతో డీసీపీ వెళ్లి ఇక్కడి నుంచి కదలకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించి హీరోను కారు ఎక్కించారు. థియేటర్ నుంచి వెళ్లేటప్పుడూ కార్ రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేస్తూ వెళ్లారు" అని అన్నారు. ఈ నేపథ్యంలోనే హీరోపై, యాజమాన్యంపై పోలీసులు కేసు పెట్టారని, తర్వాత హీరో ఇంటికి వెళ్లినప్పుడు కూడా దురుసుగా ప్రవర్తించాడని, బాధ్యతారహితంగా సమాధానాలు ఇచ్చాడని, అందుకే పోలీసులు వారి విధి నిర్వహించారని వివరించారు.



కేటీఆర్‌ది పైశాచికత్వం

ఒకరి మృతికి కారణమైన వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళితే.. కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికత్వం ప్రదర్శించాయని మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "రేవతి భర్త చిరుద్యోగి. నెలకు రూ.30 వేలే జీతం. అయినా.. తన కొడుకు ఆ హీరో అభిమాని అని తనయుడి కోసం ఒక్కో టికెట్ రూ.3 వేల చొప్పున రూ.12 వేలు పెట్టి కొన్నారు. హీరోపై అభిమానంతో అంత డబ్బు వెచ్చించారు. థియేటర్‌లో ఒక తల్లి చనిపోతే ఆ కుటుంబాన్ని, ఆ పిల్లవాడిని హీరో పరామర్శించలేదు. అలాంటి మానవత్వం లేని వాళ్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తే పదేళ్లు మంత్రులుగా పని చేసిన వాళ్లు కూడా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. తప్పు పట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూశారు. సోషల్ మీడియాలోనూ, యూట్యూబ్ చానెళ్లలోనూ ఎంతో నీచమైన భాష వాడారు" అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. హీరోను ఒక్కరోజు అరెస్టు చేయగానే హైకోర్టులో స్పెషల్ పిటిషన్, లంచ్ మోషన్ వేశారని, బెయిల్‌పై వచ్చేలా చేశారని వ్యాఖ్యానించారు. సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలని భావించి తమ ప్రభుత్వం ప్రత్యేక షోలకు అనుమతి ఇచ్చిందని, ప్రాణాలు బలి తీసుకున్నా వాళ్లను ఏమీ అనొద్దు అంటే ఇదేం న్యాయమని సీఎం ప్రశ్నించారు. ఫిల్మ్ స్టార్స్, సూపర్ స్టార్స్, పొలిటికల్ స్టార్స్ హత్యలు చేసినా వాళ్లను విచారించవద్దని మీరు చట్టం చేస్తే తాము అమలు చేస్తామని ఎద్దేవా చేశారు. సంధ్య థియేటర్ ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై బరాబర్ కేసులు పెట్టి విచారించాల్సిందేనని స్పష్టం చేశారు. "సినీ ప్రముఖులకు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నా. అమానవీయ ఘటనలను ఈ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు. సినిమాలు తీసుకోండి. వ్యాపారం చేసుకోండి. డబ్బులు సంపాదించుకోండి. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి. షూటింగులకు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి. ప్రజల ప్రాణాలు పోతుంటే మాత్రం మా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. నేను కుర్చీలో ఉన్నంత వరకూ ఇలాంటి ఘటనలను ఉపేక్షించను. ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండవు" అని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు.

ఇక బెనిఫిట్ షోలు, టికెట్ పెంపులు ఉండవు: మంత్రి కోమటిరెడ్డి

సంధ్య థియేటర్ ఘటనలో చనిపోయిన రేవతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షలు అందించనున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాసన సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇక నుంచి సినిమా విడుదలకు ముందు రోజు ఎటువంటి బెనిఫిట్ షోలు ఉండబోవని తేల్చి చెప్పారు. టికెట్ల రేట్లు పెంచేందుకు కూడా అనుమతి ఇవ్వబోమన్నారు. బాలుడి కుటుంబానికి పరిహారం ఇస్తామన్న హామీని కూడా అల్లు అర్జున్ నిలబెట్టుకోలేదన్నారు. శ్రీతేజ్ వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

ఏపీలోనూ బెనిఫిట్ షోలను అనుమతించొద్దు: సీపీఐ

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి సినిమా టికెట్ల ధరలను పెంచమని, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని సీఎం ంచంద్రబాబు కూడా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఆహ్వానించిన రామకృష్ణ ఆయనకు అభినందనలు తెలిపారు. ఇటీవల పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాదులో రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె కుమారుడు అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో టీసీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై రామకృష్ణ స్పందించారు.



నాపై తప్పుడు ఆరోపణలు!

అవాస్తవాలతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు

- నేను ఎలాంటి రోడ్ షో, ఊరేగింపూ చేయలేదు
- థాంక్యూ చెప్పేందుకే కారులోంచి చేతులూపా
- థియేటర్ నుంచి బయటకెళ్లాలని పోలీసులు నాకు చెప్పలేదు: అల్లు అర్జున్

హైదరాబాద్, డిసెంబరు 21: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి తనమీద సీఎం రేవంత్ అసెంబ్లీలో చేసిన విమర్శలపై అల్లు అర్జున్ స్పందించారు. శనివారం సాయంత్రం మీడియాతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. తనపై తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని.. తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఇలా జరిగినందుకు బాధిత కుటుంబానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్తున్నాను. వారికి జరిగిన నష్టానికి నా ప్రగాఢ సంతాపం. శ్రీతేజ్ అతి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. వారికి జరిగిన నష్టం పట్ల నా మనసంతా బాధతో నిండిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సినిమా వాడిగా ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే ముఖ్య కర్తవ్యంగా భావిస్తానని ఆయన తెలిపారు. "వీ్మమ్మల్ని నవ్వుతూ ఉంచాలనుకుంటాను. మీ మనసుల్ని గెలిచి థియేటర్ నుంచి బయటకు పంపిద్దామనుకుంటాను. నాకు థియేటర్ ఒక గుడిలాంటిది. అలాంటి చోట ఈ ప్రమాదం జరగడం బాధాకరం. ఈ విషయంలో నాకంటే బాధపడేవాడుండడు. నేను గంటగంటకూ బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్నాను. మంచి విషయం ఏంటంటే తను కదులుతున్నాడు.. కొంచెం కొంచెం కోలుకుంటున్నాడని తెలిసింది. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఇది ఊరటనిచ్చే విషయం" అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంలో తనపై కొన్ని తప్పుడు ఆరోపణలు, అవాస్తవాలు ప్రచారం అవుతున్నందునే పత్రికా సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహుశా కమ్యూనికేషన్ లోపం వల్లే తనపై ఈ తప్పుడు ప్రచారం జరుగుతుండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "నన్ను ఈ ప్రమాదం విషయంలో పూర్తిగా అపార్థం చేసుకున్నారు. నేను ఎవర్నీ నిందించడం లేదు. ఏ డిపార్టుమెంటునీ, ప్రత్యేకించి ఏ రాజకీయ నాయకుడిని, ప్రభుత్వాన్ని అనడం లేదు. నిజానికి మాకు సినిమా విషయంలో ప్రభుత్వం ఎంతో సాయం చేసింది. ప్రత్యేక టికెట్ రేట్ మంజూరు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వం విషయంలో చాలా సంతృప్తితో ఉన్నాను. ఇది ఎవ్వరినీ ఉద్దేశించి కాదు. నాపై జరుగుతున్న ప్రచారం.. క్యారెక్టర్ ఎసాసినేషన్ (వ్యక్తిత్వ హననం) గురించి మాత్రమే నేను స్పష్టతనివ్వాలనుకుంటున్నాను" అని స్పష్టం చేశారు.

ఎప్పుడూ ఇలా జరగలేదు..

ఈ ప్రమాదం విషయంలో తన తప్పేమీ ప్రత్యక్షంగా లేదని సర్దిచెప్పుకొంటున్నానని అల్లు అర్జున్ పేర్కొన్నారు. "ఇటువంటి సమయంలో నేను ఇలా అన్నాను.. అలా అన్నాను.. కాళ్లూచేతులూ విరిగిపోయినా ఫర్లేదన్నానంటూ నా వ్యక్తిత్వాన్ని జాతీయ మీడియా ముందు తప్పుగా ప్రచారం చేస్తున్నారు. దాదాపు 20 ఏళ్లకుపైగా నా సినిమాలతో పాటు ప్రతి సినిమాకూ నేను ఈ థియేటర్‌కే వెళ్లేవాణ్ని. ఎప్పుడూ ఏ ప్రమాదం జరగలేదు. ఈ సినిమా నా మూడేళ్ల కష్టం. అందుకే థియేటర్లో అభిమానులతో చూడాలనుకున్నాను. నేను నిర్లక్ష్యంతో థియేటర్‌కు వెళ్లానని.. పర్మిషన్ లేకుండా వెళ్లాలనేది తప్పుడు సమాచారం. థియేటర్ వారు పర్మిషన్ తీసుకుని ఉంటారనే అక్కడికి వెళ్లాం. కొద్ది దూరం వెళ్లాక అక్కడ ట్రాఫిక్ బ్లాక్ అయిపోయింది. కారులో ఉన్న నేను బయటకి రాకుంటే అభిమానులు బాధ పడతారని బయటకి వచ్చి చేతులు ఊపా. ఒక్కసారి అయినా వారికి కనిపించి 'థాంక్యూ' చెప్పడానికి అలా చేయాల్సి వచ్చింది. లేదంటే.. కారులోంచి బయటకు రాకుండా దాక్కున్నానని వారు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటారు. చేతులు ఊపితే అయినా ముందుకు వెళ్లడానికి దారి ఇస్తారని అలా చేశాను" అని వివరణ ఇచ్చారు. థియేటర్లోకి వెళ్లాక కూడా పోలీసులు తనను సంప్రదించలేదని.. ఏం చెప్పలేదని.. సినిమా చూస్తుండగా థియేటర్ సిబ్బంది వచ్చి 'బయట ప్రజలను అదుపుచేయలేని స్థితి, దయచేసి వెళ్లిపోండి' అని చెప్పారని.. దీంతో తాను బయటకు వచ్చేశానని స్పష్టం చేశారు. "ఆ తర్వాతి రోజే నాకు ఓ మహిళ చనిపోయారని.. బాలుడికి పరిస్థితి విషమంగా ఉందని తెలిసి షాక్ అయ్యా" అని చెప్పారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే బన్నీవాసుకు ఫోన్ చేసి.. హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించినట్టు తెలిపారు. తాను థియేటర్‌కు వస్తానంటే వాసు వద్దన్నారని.. అయినా వినకుండా ఆస్పత్రికి వెళ్దామనుకుంటే తన లీగల్ టీమ్ వారించిందని వెల్లడించారు. ఏమి చేయాలో తోచక.. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని వీడియో చేసినట్టు చెప్పారు.

పరిస్థితులు చేతులు కట్టేశాయి..

బాలుడి విషయంలో తాను స్పందించలేదని అంటున్నారని.. కానీ, పరిస్థితులు, లీగల్ విషయాలే తన చేతులను కట్టి పడేశాయని వాపోయారు. తాను వెళ్లకున్నా.. తన తండ్రి అరవింద్‌ను, దర్శకుడు సుకుమార్‌ను, లీగల్ టీమ్‌ను పంపి అక్కడి విషయాలు తెలుసుకోవాలని ప్రయత్నించానని చెప్పారు. మానసికంగా తాను చాలా దృఢంగా ఉంటానని.. కానీ ఇప్పుడు తనపై జరుగుతున్న ప్రచారం ఎంతో బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను అసలు సినిమాలు చేసేదే తెలుగువారు గర్వించేలా మంచి పేరు, గుర్తింపు తెద్దామని. అలాంటిది మనల్ని మనం కిందికి లాక్కోవాలనుకోకూడదు. నేను శ్రీతేజ్ విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నానని అంటున్నారు. నిరంతరం శ్రీతేజ్ ఆరోగ్యం గురించి.. తన బాగోగుల గురించి నేను దర్శకుడు సుకుమార్‌తో చర్చిస్తూనే ఉన్నా. ఆ బాలుడి విషయంలో చేయాల్సింది చేసి చేతులు దులిపేసుకోకుండా.. నేను, సుకుమార్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు వై.రవి శంకర్, నవీన్ యెర్నేని అంతా కలసి బాలుడి కోసం ఓ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఏర్పాటు చేద్దామని.. ఫిజియోథెరపిస్టును పెట్టిద్దామని అనుకున్నాం" అని అల్లు అర్జున్ అన్నారు. శ్రీతేజ్ విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటానని.. వారి కుటుంబానికి అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, ఆయన తండ్రి అల్లుఅరవింద్ మాట్లాడారు. "సినిమా ఇంతటి విజయం సాధించినా.. ఈ దురదృష్టకర సంఘటన వల్ల మా అబ్బాయి ఇంట్లోనే కూర్చుండిపోయాడు. తన అభిమానుల కుటుంబానికి ఇలా జరిగినందుకు అర్జున్ తట్టుకోలేకపోతున్నాడు. 22ఏళ్లు కష్టపడి తను ఈ పేరు సంపాదించుకున్నాడు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నవ్య | చిత్రజ్యోతి

నాదైన ముద్ర కోసం తపిస్తా



'ప్రతి పాటను ఒక సవాల్‌గా తీసుకొని కొరియోగ్రఫీ చేస్తాను. పనిలో నాదైన ముద్ర ఉండాలని తపిస్తాను. దాని వల్లే ఇండస్ట్రీలో, ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు దక్కింది' అని విజయ్ పోలాకి మాస్టర్ అన్నారు. టాలీవుడ్‌లో పలువురు అగ్రహీరోల సినిమాలకు డాన్స్ మాస్టర్‌గా పనిచేస్తూ బిజీగా ఉన్న విజయ్ పోలాకి తన సినీ ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడారు. 'కెరీర్ ఆరంభంలో డాన్స్ మాస్టర్‌గా అవకాశాల కోసం చాలా కష్టపడ్డాను. నా వీడియోలు చూసిన హీరో రామ్ పోతినేని ప్రోత్సహించారు. చాలా సినిమాలకు కొరియోగ్రఫీ చేసినా తొలిసారి ప్రేక్షకులు, ఇండస్ట్రీలో గుర్తింపు దక్కింది మాత్రం 'పలాస' చిత్రంలోని 'నాది నక్కిలీసు గొలుసు' పాటతోనే. ఆ తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ 'పుష్ప' చిత్రంలోని 'ఊ అంటావా మావా' పాటకు కొరియోగ్రఫీ చేసే అవకాశం ఇచ్చారు. 'పుష్ప 2' చిత్రంలో టైటిల్ సాంగ్, జాతర పాటకు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చాలా సంతృప్తినిచ్చింది. ఈ సినిమా నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది' అని అన్నారు.

త్రీడీలో చేయడం సవాల్‌గా అనిపించింది



మోహన్‌లాల్

"'బరోజ్ 3డీ' దర్శకుడిగా నాకు తొలి సినిమా. మొదటి చిత్రాన్నే త్రీడీలో చేయడం సవాల్‌గా అనిపించింది. నటుడిగా, దర్శకుడిగా ఈ చిత్రం నాకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. గత 40 ఏళ్లలో మలయాళ పరిశ్రమలో ఇలాంటి సినిమా రాలేదు' అని మోహన్‌లాల్ అన్నారు. అగ్ర కథానాయకుడిగా మలయాళ పరిశ్రమను ఏలుతున్న మోహన్‌లాల్ 'బరోజ్'తో మెగాఫోన్ చేపట్టారు. ఆయన టైటిల్ రోల్ పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మోహన్‌లాల్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్ నవల ఆధారంగా ఒక కల్పిత ప్రపంచాన్ని సృష్టించాం. ఒక రహస్య నిధిని కాపాడుతూ అందులోని సంపదను నిజమైన వారసులకు అందించేందుకు బరోజ్ అనే పాత్ర చేసే ప్రయత్నాలు అద్భుతంగా ఉంటాయి. కథనం కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులు తర్కాన్ని పక్కనపెట్టి, సినిమాను ఆస్వాదించాలని కోరుతున్నాను. త్రీడీ సినిమా చేయడం అంత సులువు కాదు. ప్రేక్షకుడికి గొప్ప అనుభూతిని ఇవ్వడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేశారు. హాలీవుడ్ పాపులర్ కంపోజర్ మార్క్ కిల్లియన్ బీజీఎం, లిడియన్ నాదస్వరం సంగీతం, సంతోశ్ శివన్ కెమెరా వర్క్ 'బరోజ్'ను ప్రత్యేకంగా నిలుపుతాయి. టాప్ హాలీవుడ్ టెక్నీషియన్స్ గ్రాఫిక్స్‌ను అందించారు. ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. పిల్లలు, పెద్దలు అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు.

మీ అభిమానానికి మాటలు రావడం లేదు

- రామ్‌చరణ్



శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన భారీ చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వాణీ హీరోయిన్. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా జనవరి 10న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూఎస్‌లోని డల్లాస్‌లో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఇక్కడి వారు చూపించిన అభిమానానికి మాటలు రావడం లేదు. మీరు స్వాగతం పలికిన తీరుకు ఆశ్చర్యపోయాను. ఆంధ్ర, తెలంగాణలో ఉన్నామా లేక డల్లాస్ వచ్చామా అని కూడా అర్థం కావడం లేదు. ఇక్కడి నుంచే మూవీ ప్రమోషన్స్‌ను మెదలుపెడుతున్నాం. మీ అందరి ఆశీస్సులు కావాలి' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'గేమ్ ఛేంజర్ అనే టైటిల్‌ను పెట్టినప్పుడే సరికొత్తగా ప్రమోషన్స్ చేయాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగా డల్లాస్‌ను ఎంపిక చేసుకున్నాం. ఇక్కడ ఈవెంట్ నిర్వహణకు రాజేశ్ ముందుకొచ్చి సహకరించారు' అని చెప్పారు.

క్రిస్మస్ గిఫ్ట్‌లాంటి సినిమా



అనన్య నాగళ్ల

"'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రంలో నా పాత్ర పేరు భ్రమరాంబ. నేను ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. అందమైన ప్రేమకథతో పాటు థ్రిల్, సస్పెన్స్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులకు ఈ సినిమా మంచి క్రిస్మస్ గిఫ్ట్ అవుతుంది' అని హీరోయిన్ అనన్య నాగళ్ల అన్నారు. వెన్నెల కిశోర్ టైటిల్ పాత్ర పోషించిన ఈ చిత్రానికి మోహన్ దర్శకత్వం వహించారు. వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. చిత్రం ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా అనన్య నాగళ్ల మీడియాతో ముచ్చటించారు. 'మోహన్ కథ చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. సంఘటన ఒకటే అయినా దాన్ని చూసిన వాళ్లలో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తారు అనే పాయింట్‌తో విభిన్న కోణాల్లోంచి కథను నడిపించడం ఆసక్తికరంగా అనిపించింది. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే చిరంజీవి గారి 'చంటబ్బాయ్' గుర్తుకొస్తుంది. మా సినిమా కథ కూడా అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా 'చంటబ్బాయ్ తాలూకా' అనే ఉపశీర్షిక పెట్టారు. మోహన్ స్పష్టత ఉన్న దర్శకుడు. రమణారెడ్డి సినిమాకు అవసరమైన వాటన్నింటినీ సమకూర్చారు' అని తెలిపారు.

పాత ఈవీలపై 18% జీఎస్టీ

పాప్‌కార్న్‌పై ఫ్లేవర్ ఆధారంగా పన్ను.. విమాన ఇంధనంపై పన్ను రాష్ట్రాల చేతిలోనే..

- జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తగ్గింపు వాయిదా
- జీన్ థెరపీకి జీఎస్టీ మినహాయింపు
- ఫోర్టిఫైడ్ బియ్యంపై 5 శాతం పన్ను
- 55వ జీఎస్టీ మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



జైసల్మేర్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం జరిగిన 55వ జీఎస్టీ మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాడిన లేదా పాత విద్యుత్ వాహనాల (ఈవీ)పై పన్నును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని మండలి నిర్ణయించినట్లు సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీతారామన్ వెల్లడించారు. కంపెనీలు కొనుగోలు చేసిన పాత ఈవీలు లేదా విక్రేతలు మోడిఫై చేసి విక్రయించే ఈవీల మార్జిన్ విలువ (కొనుగోలు, విక్రయ ధర మధ్య వ్యత్యాసం)పైనే పన్ను వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన పాత ఈవీ కొనుగోలు లావాదేవీకి ఎలాంటి పన్ను వర్తించదని కూడా తెలిపారు. ప్రస్తుతం కొత్త ఈవీలపై జీఎస్టీ 5 శాతంగా ఉంది. ఈవీయేతర వాహనాల విషయానికొస్తే, వ్యాపారులు విక్రయించే పాత లేదా వాడిన చిన్న పెట్రోల్, డీజిల్ కార్ల మార్జిన్ విలువపై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది.

బీమా..లేదు ఊరట: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గించాలన్న ప్రతిపాదనపై మండలి తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. బీమా రంగ నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ అభిప్రాయం తెలపాల్సి ఉన్నందున ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని పక్కన పెట్టినట్లు మంత్రి తెలిపారు.

రేట్ల హేతుబద్ధీకరణపై నివేదిక వాయిదా

జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జీఓఎం) తన నివేదికను వాయిదా వేసింది. వాస్తవానికి, జీఓఎం శనివారం మండలికి నివేదిక సమర్పించాల్సి ఉంది. మండలి తదుపరి సమావేశంలో నివేదిక సమర్పిస్తామని జీఓఎం కన్వీనర్, బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై 35 శాతం జీఎస్టీతో పాటు మొత్తం 148 ఉత్పత్తులపై జీఎస్టీ రేట్ల సవరణను ఈ ప్యానెల్ ప్రతిపాదించింది.

పర్యావరణ విపత్తు సెస్సు.. జీఓఎం ఏర్పాటు

పర్యావరణ విపత్తు కారణంగా భారీగా నష్టపోయిన రాష్ట్రాలు జీఎస్టీలో భాగంగా ప్రత్యేక సుంకం విధించేందుకు అనుమతించే విషయంపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రుల బృందాన్ని (జీఓఎం) ఏర్పాటు చేయాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది. పర్యావరణ విపత్తు నష్టాల నుంచి తేరుకునేందుకు విలాస వస్తువులపై 1% సెస్సు విధించేందుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ విషయంపై జీఓఎంను ఏర్పాటు చేసేందుకు ఏపీ మంత్రి పయ్యావుల కేశవులు కూడా అంగీకరించారని మంత్రి నిర్మల తెలిపారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ కూడా ఇందులో భాగస్వాములయ్యేందుకు అంగీకరించినట్లు చెప్పారు. కాగా వరదలతో సంభవించిన నష్టాల కారణంగా వ్యాపార సంస్థల మధ్య జరిగే (బీ2బీ) లావాదేవీలపై ఒక శాతం సెస్సును విధించుకునే అధికారం తెలంగాణకు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జీఎస్టీ కౌన్సిల్‌ను కోరారు

మరిన్ని నిర్ణయాలు..

- విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్)ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనపై రాష్ట్రాలు అంగీకరించలేదని మంత్రి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్‌తోపాటు ఏటీఎఫ్‌పైనా పన్ను విధింపు అధికారం రాష్ట్రాల చేతుల్లోనే ఉండనుంది.
- స్నాక్ పాప్‌కార్న్‌పై పన్ను విషయంలో మండలి వివరణ ఇచ్చింది. ఉప్పు, మసాలా దినుసులు కలిసిన పాప్‌కార్న్‌ను ప్రస్తుతం నమ్‌కీన్‌గా పరిగణిస్తున్నారు. కాబట్టి ఈ పాప్‌కార్న్ లూజు విక్రయంపై 5 శాతం పన్ను వర్తిస్తుందని.. ప్రీ-ప్యాకేజ్డ్, లేబుల్‌తో విక్రయిస్తే మాత్రం 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మండలి స్పష్టం చేసింది. చక్కెర కలిపిన (క్యారమెలైజ్డ్) పాప్‌కార్న్‌పైన 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రజా పంపిణీకి వినియోగించే ఫోర్టిఫైడ్ బియ్యం గింజలపై పన్ను 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని మండలి నిర్ణయించింది. జీన్ థెరపీకి జీఎస్టీ మినహాయింపునిచ్చింది.
- బ్యాంక్‌లు, ఆర్థిక సేవల సంస్థలు రుణగ్రహీతలపై విధించే పెనాల్టీ చార్జీలపై జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు.
- 50% శాతం ఫ్లైయాష్‌తో కూడిన ఏసీసీ బ్లాక్స్‌పై 12% జీఎస్టీ
- రైతు నేరుగా సరఫరా చేసే మిరియాలు, ఎండు ద్రాక్షపై జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఎగుమతుల పోటీ సామర్థ్యం పెంచేందుకు మర్చంట్ ఎక్స్‌పోర్టర్లకు సరఫరాపై పరిహార సుంకం 0.1 శాతానికి తగ్గింపు
- నైపుణ్య శిక్షణ భాగస్వాములకు జీఎస్టీ మినహాయింపు ప్రతిపాదనకు ఆమోదం. త్వరలోనే అధికారిక ప్రకటన జారీ
- పేమెంట్ అగ్రిగేటర్లకు ఊరట కల్పించేందుకు, రూ.2,000 లోపు డిజిటల్ చెల్లింపుల లావాదేవీలపై జీఎస్టీ మినహాయింపు
- స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ డెలివరీ చార్జీలపై పన్ను విధింపు నిర్ణయం వాయిదా

10 ఏళ్ల వరకు కారాగార శిక్ష

అనుమతుల్లేకుండా అప్పు ఇస్తే జైలుకే..



- రూ. కోటి వరకు జరిమానా
- దా'రుణ' యాప్‌లను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదన

న్యూఢిల్లీ: దారుణ యాప్‌ల ఆగడాలకు చెక్ పెట్టడంతో పాటు అధిక వడ్డీకి అప్పులిచ్చే వారిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త చట్టం తీసుకురాబోతోంది. అనుమతుల్లేకుండా భౌతికంగా లేదా డిజిటల్ మార్గంలో రుణాలిచ్చే వారికి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించేందుకు కొత్త బిల్లును ప్రతిపాదించింది. అనియంత్రిత రుణ వ్యాపార కార్యకలాపాలను అడ్డుకోవడంతోపాటు వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆర్‌బీఐ వర్కింగ్ గ్రూప్ 2021 నవంబరులో తన నివేదికను సమర్పించింది. అనియంత్రిత రుణ కార్యకలాపాలను నిషేధించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావడంతో పాటు పలు చర్యలను వర్కింగ్ గ్రూప్ సూచించింది. ఆర్‌బీఐ లేదా ఇతర నియంత్రణ మండళ్లతో పాటు ఏదైనా చట్ట ప్రకారంగా రుణ వ్యాపారం కొనసాగించేందుకు అనుమతి లేని వ్యక్తులు లేదా సంస్థలను నిషేధించాలని ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించింది.

నియంత్రిత రుణాలకు సంబంధించిన ఏ చట్టం పరిధిలోకి రాని భౌతిక, డిజిటల్ లేదా ఇతర మార్గాల్లో నిర్వహించే రుణ కార్యకలాపాలను (బంధువులకిచ్చే రుణాలు మినహా) అనియంత్రిత రుణ వ్యాపారంగా బిల్లు నిర్వచించింది. నియమావళికి విరుద్ధంగా రుణాలిచ్చే వారికి కనీసం 2 ఏళ్ల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించనున్నట్లు బిల్లులో ప్రతిపాదించారు. రుణగ్రహీతలను వేధించడం లేదా అనైతిక పద్ధతుల్లో బకాయిల రికవరీకి పాల్పడేవారికి 3 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అనియంత్రిత రుణదాత, రుణగ్రహీతలు, ప్రాపర్టీలు పలు రాష్ట్రాల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పక్షంలో లేదా ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే స్థాయి సొమ్ముకు సంబంధించిన కేసును సీబీఐకి బదిలీ చేయాలని కూడా బిల్లులో ప్రతిపాదించారు. బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్ (బీయూఎల్‌ఏ) పేరుతో రూపొందించిన ఈ ముసాయిదా బిల్లుపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 13 నాటికి సూచనలు, అభిప్రాయాలు తెలపాలని ప్రభుత్వం ప్రజలను కోరింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న అమాయకులు దారుణ యాప్‌ల వలలో పడి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావడం లేదా రుణ యాప్‌ల వేధింపులకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన పలు సంఘటనలు అనేకం. దాంతో కేంద్ర ప్రభుత్వం మోసపూరిత రుణ యాప్‌ల ప్రచారాలు లేదా ప్రకటనలు తమ వేదికలో లేకుండా చూడాలని సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌ను గతంలో ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి గూగుల్ 2022 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టు మధ్య కాలంలో 2,200 మోసపూరిత రుణ యాప్‌లను తన ప్లేస్టోర్ నుంచి తొలగించింది. దేశంలో అక్రమంగా డిపాజిట్ల సమీకరణ కార్యకలాపాలు, పోంజీ స్కీమ్‌లను అడ్డుకునేందుకు కేంద్రం 2019లో అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450 ▲	71,000 ▲	99,000 ▲
విజయవాడ	78,500 ▲	72,220 ▲	90,000 ▼
విశాఖపట్నం	76,570 ▲	70,190 ▲	88,400 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	89,700 ▲
ప్రొద్దుటూరు	78,600 ▲	72,780 ▲	90,000 ▲
ముంబై	75,377 ▼	69,045 ▼	85,133 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	580
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	583	విశాఖపట్నం	590
		దజను గుడ్లు రూ. 84	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	91	విజయవాడ	94
వరంగల్	91	గుంటూరు	97
కరీంనగర్	91	ఒంగోలు	97
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	85
కర్నూలు	91	నెల్లూరు	85
విశాఖపట్నం	98	అనంతపురం	85
గోదావరి	94		

జీఎస్టీ వార్షిక రిటర్నులు..కొన్ని జాగ్రత్తలు !

గడచిన ఆర్థిక సంవత్సరాని (2023-24)కి సంబంధించి వార్షిక రిటర్నులు జీఎస్టీఆర్-9 దాఖలు చేయటానికి చివరి తేదీ 2024 డిసెంబరు 31. ఈ జీఎస్టీఆర్-9 అనే రిటర్న్ ఒక ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సమగ్ర రిటర్న్. అంటే ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అమ్మకాలు, కొనుగోళ్లు, తీసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్, చెల్లించిన పన్నులు.. మొదలైన విషయాలను ఈ రిటర్న్ ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే సంబంధిత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పొరపాట్లను ఈ రిటర్న్ ద్వారా సరి చేసుకోవచ్చు. ఉదాహరణకు, తీసుకోవాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్ కంటే ఎక్కువ తీసుకున్నా, కట్టాల్సిన పన్ను కంటే తక్కువ కట్టినా, రివర్స్ చేయాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్ కంటే తక్కువ చేసినా ఈ రిటర్న్ ద్వారా సవరణ చేసే అవకాశం ఉంది. కాబట్టి ఈ రిటర్న్ దాఖలు చేసినప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం.

అలాగే ఈ రిటర్న్‌లో కొన్ని కొన్ని ఫీల్డ్స్ అనేవి ఆ సంవత్సరానికి సంబంధించిన ఇతర రిటర్నులు అంటే జీఎస్టీఆర్-3బీ, జీఎస్టీఆర్-2ఏ, జీఎస్టీఆర్-2బీ నుంచి స్వయంగా కనిపిస్తాయి. దీన్నే 'ఆటో పాపులేట్' అంటారు. అంటే, ఈ ఫీల్డ్స్‌ను సిస్టమ్ ఆటోమేటిక్‌గా నింపుతుంది. ఇకపోతే వివగతా ఫీల్డ్స్‌ను స్వయంగా నింపాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆటో పాపులేట్ ఫీల్డ్స్‌కు, మాన్యువల్ ఫీల్డ్స్‌కు మధ్య వ్యత్యాసం లేకుండా చూసుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో ఈ జీఎస్టీఆర్-9కు సంబంధించి కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి.

ఉదాహరణకు 2022-23 ఆర్థిక సంవత్సరం ఇన్‌పుట్ ట్యాక్స్‌కు సంబంధించిన ఆటో పాపులేట్ అనేది సిస్టమ్.. జీఎస్టీఆర్-2ఏ నుంచి తీసుకోగా ఇప్పుడు అదే విషయాలు జీఎస్టీఆర్-2బీ నుంచి తీసుకుంటుంది. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ విషయానికి వస్తే ఇది మూడు రకాలుగా ఉంటుంది. మొదటిది.. ఈ ఆర్థిక సంవత్సరపు క్రెడిట్‌ను ఇదే సంవత్సరం తీసుకోవటం. రెండోది.. గడచిన ఆర్థిక సంవత్సరపు క్రెడిట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం, మూడోది.. ఈ ఆర్థిక సంవత్సరం క్రెడిట్‌ను తదుపరి ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం. దీనికి కారణాలు అనేకం.. ఇన్వాయిస్ ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చి సరఫరా తదుపరి ఆర్థిక సంవత్సరంలో వచ్చి ఉండొచ్చు. సరఫరాదారుడు జీఎస్టీఆర్-1 ఆలస్యంగా దాఖలు చేయవచ్చు లేదా క్రెడిట్ తీసుకోవటం మర్చిపోవచ్చు. జీఎస్టీ నిబంధన ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఇన్వాయిస్‌లకు సంబంధించిన క్రెడిట్‌ను తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 వరకు తీసుకునే వెసులుబాటు ఉంది. కాబట్టి, ఇలా ఒక ఆర్థిక సంవత్సరపు క్రెడిట్ తదుపరి ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం (గడువు లోపు) చట్ట ఉల్లంఘన కానప్పటికీ, తీసుకున్న క్రెడిట్‌కు.. ఆటో పాపులేట్ వివరాలకు మధ్య వ్యత్యాసం ఉండే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీఎస్టీఆర్-9 దాఖలుకు సంబంధించి ఇటీవల కొన్ని సూచనలు (అడ్వైజరీ) విడుదల చేసింది. ఆ వివరాలు...



రాంబాబు గొండాల

సరఫరాదారుడు ఇన్వాయిస్ 2023-24లో ఇచ్చి ఆ వివరాలను 2024-25 జీఎస్టీఆర్-1లో చూపి ఉంటే, ఈ వివరాలు 2023-24 జీఎస్టీఆర్-9లో ఆటో పాపులేట్ కావు. అలాగే దీనికి సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కూడా 2024-25లో తీసుకుని ఉంటారు (ఇన్వాయిస్ 2023-24కు చెందినప్పటికీ). అలాంటప్పుడు ఈ క్రెడిట్‌కు సంబంధించిన విషయాలను జీఎస్టీఆర్-9లోని టేబుల్ 8ఏ, 13లో చూపాలి.

అలాగే కొనుగోలు 2023-24లో జరిగి సంబంధించిన వివరాలు జీఎస్టీఆర్-2బీలో కనిపించినప్పటికీ, సరఫరా అనేది 2024-25లో పొంది ఉండవచ్చు. ఇలాంటప్పుడు ఈ వివరాలు 2023-24 జీఎస్టీఆర్-9లో ఆటో పాపులేట్ అయినప్పటికీ క్రెడిట్‌ను 2024-25లో తీసుకోవాల్సి ఉంటుంది. ఈ వివరాలను కూడా టేబుల్ 8ఏ, 13లో చూపాలి.

అలాగే 2023-24లో క్రెడిట్ రివర్స్ చేసి తిరిగి 2024-25లో తీసుకుని ఉంటే.. అంటే రీక్లెయిమ్ చేసి ఉంటే ఆ వివరాలను టేబుల్ 6హెచ్‌లో చూపాలి.

పైన చెప్పినవి కొన్ని ముఖ్య సూచనలు అయినప్పటికీ, ముందు చెప్పినట్లు జీఎస్టీఆర్-9 రిటర్న్ చాలా ముఖ్యమైన రిటర్న్ కాబట్టి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18లో..

జోరు కొనసాగాలి!

విండీస్‌తో భారత్ తొలి వన్డే నేడు


హేలీ మాథ్యూస్

వడోదర: ఐదేళ్ల తర్వాత స్వదేశంలో టీ20 సిరీస్ విజయంతో భారత మహిళల జట్టు జోష్‌లో ఉంది. ఈనేపథ్యంలో వెస్టిండీస్‌తో మరో పోరుకు సిద్ధమైంది. ఆదివారం నుంచి ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. వడోదరలో కొత్తగా నిర్మించిన కోటంబి స్టేడియంలో ఆదివారం జరిగే ఈ వన్డేనే తొలి అంతర్జాతీయ మ్యాచ్. ఓవరాల్‌గా ఇరుజట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా భారత్ 21-05తో ఆధిక్యంలో ఉంది. ఈనెల ఆరంభంలో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిన తర్వాత హర్మన్‌ప్రీత్ సేన విండీస్‌పై టీ20ల్లో చెలరేగి ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకుంది. ఓపెనర్ స్మృతి మంధాన భీకర ఫామ్‌లో ఉంది. వరుసగా మూడు అర్ధసెంచరీలతో సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. దీనికితోడు తన చివరి 10 వన్డేల్లోనూ తను 599 పరుగులతో రాణించడం సానుకూలాంశం కానుంది. ఇదే జోరు తాజా సిరీస్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు మరో సిరీస్ ఖాయమే. చివరి రెండు టీ20లకు కెప్టెన్ హర్మన్ గాయంతో దూరం కాగా, మంధాన నాయకత్వంలోనూ ఆకట్టుకోగలిగింది. మరోవైపు హర్మన్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. దీప్తి, రేణుక సైమా, టిటాస్ సాధులతో బౌలింగ్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. మరోవైపు విండీస్ ఆశలన్నీ కెప్టెన్ హేలీ మాథ్యూస్, వెటరన్ డియాండ్రా, క్యాంప్‌బెల్ ఆటపైనే ఆధారపడి ఉన్నాయి.



ప్రణవి, ముకేష్ డబుల్ ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర షూటర్లు ప్రణవి, ముకేష్ ద్వయం రెండు రజత పతకాలు సొంతం చేసుకుంది. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగం సీనియర్, జూనియర్ కేటగిరీల్లో ప్రణవి (ఒంగోలు), ముకేష్ (గుంటూరు) జోడీ ఈ పతకాలను సొంతం చేసుకుంది. సీనియర్ విభాగంలో ప్రణవి-ముకేష్ ద్వయం 577 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. జూనియర్ విభాగంలో ఈ జోడీ 576 పాయింట్లతో రజతంతో మెరిసింది.


స్పోర్ట్స్

విరాట్ పబ్‌కు నోటీసులు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించారంటూ.. కోహ్లీకి చెందిన 'వన్8 కమ్యూన్' పబ్‌కు బెంగళూరు నగరపాలక సంస్థ (బీబీఎంపీ) నోటీసులు జారీ చేసింది. చిన్నస్వామి స్టేడియం దగ్గరల్లోని రత్నం కాంప్లెక్స్ ఆరో అంతస్థులో ఈ పబ్ కమ్ రెస్టారెంట్ ఉంది. అయితే, ఫైర్ సేఫ్టీ విభాగం నుంచి ఎన్‌వోసీ తీసుకోకుండానే పబ్‌ను నడుపుతున్నారంటూ సామాజిక కార్యకర్త ఒకరు ఫిర్యాదు చేశారు. దీనిపై నోటీసులిచ్చినా పబ్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో తాజాగా బీబీఎంపీ మరోసారి నోటీసులు జారీ చేసింది. వారం రోజులలోపు వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది.

ఊతప్పపై అరెస్ట్ వారెంట్

బెంగళూరు: భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. తన కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) డబ్బులు జమ చేయకుండా మోసం చేసినట్టు అతడిపై ఆరోపణలు వచ్చాయి. దీంతో రాబిన్‌పై ఈనెల నాలుగునే అరెస్ట్ వారెంట్ జారీ అయింది. బెంగళూరుకు చెందిన సెంటారస్ లైఫ్‌స్టయిల్ బ్రాండ్స్‌కు 39 ఏళ్ల రాబిన్ డైరెక్టర్‌గా ఉన్నాడు. తన సంస్థలో పనిచేసే ఉద్యోగుల జీతాల నుంచి రూ. 23.36 లక్షలు మినహాయించినా, అవి వారి పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో రీజినల్ పీఎఫ్ కమిషనర్ గోపాల్ రెడ్డి అతడికి నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రాబిన్‌పై వారెంట్ జారీ కావడమే కాకుండా, ఈనెల 27లోగా వారికివ్వాల్సిన మొత్తాన్ని పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో అరెస్ట్ తప్పదని హెచ్చరించారు.



కప్పు ఎవరిదో?

- బంగ్లాదేశ్‌తో భారత్ ఫైనల్ నేడు
- అండర్-19 టీ20 ఆసియాకప్

రాత్రి 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

మూడోస్థానానికి ఢిల్లీ

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ టాప్-2 అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకొంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 33-31తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది. ఢిల్లీ రైడర్ అషు మాలిక్ 12 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండు జట్లూ ఈపాటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించగా.. ఈ విజయంతో ఢిల్లీ మూడో స్థానానికి ఎగబాకింది. కాగా, పట్నా పైరేట్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 40-40తో టైగా ముగిసింది. పట్నా రైడర్ దేవాంక్ సూపర్-10 సాధించాడు.

అంతా అగమ్యగోచరంగా ఉంది

అశ్విన్ భార్య భావోద్వేగం



చెన్నై: అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ వీడ్కోలు పలకడంపై అతడి భార్య ప్రీతి భావోద్వేగంతో స్పందించింది. 'గత రెండు రోజులుగా ఏమీ అర్థం కాకుండా అంతా అగమ్యగోచరంగా ఉంది. అసలేం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. గత 13-14 ఏళ్లుగా ఎన్నో అనుభవాలు చవిచూశాం. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్, ఎంసీజీలో విజయం, సిడ్నీ టెస్టు డ్రా, గాబాలో వీరోచిత విజయంతో పాటు టీ20ల్లో పునరాగమనం వల్ల మేం పొందిన ఆనందం అనిర్వచనీయం. నాకు క్రికెట్‌ను పరిచయం చేసింది నువ్వే. ఈ ఆట పట్ల ప్రేమను కలిగించావు. ఇక నీకిష్టమైన రీతిలో కొత్త జీవితాన్ని గడుపు' అని అశ్విన్‌కు సూచించింది.

'బాక్సింగ్ డే'కు సన్నాహాలు

ప్రాక్టీస్ ప్రారంభించిన టీమిండియా

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో కీలకమైన బాక్సింగ్ డే టెస్ట్‌కు వేళవుతోంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్-ఆస్ట్రేలియా ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే. దాంతో ఈనెల 26న మొదలయ్యే నాలుగో టెస్ట్ ఇరు జట్లకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. వచ్చే గురువారం నుంచి జరిగే ఈ టెస్ట్‌కు భారత జట్టు సన్నాహకాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం సాధన మొదలు పెట్టింది. ముఖ్యంగా బౌలర్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. పేస్ దళపతి బుమ్రా, సిరాజ్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, ఆకాశ్ దీప్, జడేజా, వాషింగ్టన్ సుందర్ నెట్స్‌లో సుదీర్ఘ సమయం గడిపారు. 'కష్టపడడానికి ఎలాంటి ప్రత్యామ్నాయాలుండవు. బాక్సింగ్ డే టెస్ట్‌కు భారత బౌలర్లు అన్ని విధాలా సిద్ధమవుతున్నారు' అని బౌలర్ల సాధన వీడియోను విడుదలజేస్తూ బీసీసీఐ పేర్కొంది.

రాహుల్‌కు గాయం ?

బౌలర్లతోపాటు బ్యాటర్లు కూడా సాధనలో పాల్గొన్నారు. అయితే బ్యాటింగ్ ప్రాక్టీస్ అనంతరం ఓపెనర్ కేఎల్ రాహుల్ చేతికి ఫిజియో చికిత్స చేయడం కనిపించింది. దాంతో రాహుల్ గాయపడ్డాడనే ఆందోళన వ్యక్తమైంది. టెస్ట్‌కు మరో నాలుగు రోజుల సమయం ఉండడంతో అప్పటికల్లా కోలుకుంటాడని భావిస్తున్నారు.

ఎంసీజీలో 'బ్లూస్టాండ్' అలజడి

లక్ష మంది సామర్థ్యం కలిగిన మెల్‌బోర్న్ స్టేడియంలో నాలుగో టెస్ట్‌కు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా స్టేడియంలోని 'బ్లూస్టాండ్' వద్ద పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరిస్తున్నారు. ఆ స్టాండ్‌లో ఉండే అభిమానులు మద్యం సేవించి విపరీతంగా ప్రవర్తిస్తుంటారట. ప్రత్యర్థి జట్టు ఏకాగ్రతను దెబ్బతీసేందుకు వాళ్లు చేయాల్సిందంతా చేస్తారని మెల్‌బోర్న్ గ్రౌండ్ భద్రతా సిబ్బంది ఒకరు చెప్పాడు. షేన్ వార్న్ ఎండ్‌వైపు ఉండే ఆ బ్లూస్టాండ్‌లో ఆరు బ్లాకులుంటాయి. బాక్సింగ్ డే టెస్ట్ తొలి రోజు ఆటకు లక్షకు..లక్ష టిక్కెట్లు అమ్ముడుపోయాయి. దీంతో బ్లూస్టాండు కూడా పూర్తిగా నిండిపోతుందని, అందులో ఫ్యాన్స్ ప్రవర్తన చాలా దూకుడుగా ఉంటుందని ఆ భద్రతా సిబ్బంది తెలిపాడు. సాధారణంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగే మ్యాచ్‌లకు బౌండరీ లైన్ వద్ద 10 మంది గార్డులను నియమిస్తారు. అయితే ఈ నాలుగో టెస్ట్‌కు మాత్రం 15 మందిని ఏర్పాటు చేస్తున్నారని అతడు చెప్పాడు.



సచిన్ రికార్డుపై కోహ్లీ గురి

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే ఎన్నో రికార్డుల్ని తన పేరిట లిఖించుకున్న కోహ్లీ..సచిన్ మరో రికార్డుకు చేరువయ్యాడు. ఆస్ట్రేలియాపై మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో 449 రన్స్‌తో..అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్ రికార్డు టెండూల్కర్ పేరిట ఉంది. ఇక ఇప్పటి వరకు మూడు టెస్ట్‌ల్లో 316 పరుగులు చేసిన కోహ్లీ..సచిన్ రికార్డుకు 133 పరుగుల దూరంలో ఉన్నాడు.

ఆసీస్ మీడియా అతి



భారత జట్టు ఎంసీజీలో శనివారం సాధన చేసింది. ఆ సందర్భంగా భారత్ నుంచి వెళ్లిన మీడియా ప్రతినిధులతో జడేజా ప్రత్యేకంగా మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో స్టేడియంలో ఉన్న కొందరు ఆస్ట్రేలియా విలేకరులు జడేజా వద్దకు వచ్చారు. కేవలం భారత మీడియా కోసమే ఆ సమావేశమని, ఇతర జర్నలిస్టులకు కాదని జట్టు మీడియా మేనేజర్ చెప్పినా వినలేదు. భారత విలేకరుల ప్రశ్నలకు హిందీలో బదులిచ్చిన జడేజా.. సమయం అయిపోవడంతో అక్కడ నుంచి వెనుదిరిగాడు. కానీ ఆస్ట్రేలియా మీడియా ప్రతినిధులు..జడేజా తమ ప్రశ్నలకు ఇంగ్లిష్‌లో సమాధానమివ్వలేదంటూ గొడవ చేశారు.



అన్‌మోల్ రికార్డు సెంచరీ

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిన పంజాబ్ బ్యాటర్ అన్‌మోల్ ప్రీత్ సింగ్ (45 బంతుల్లో 12 ఫోర్లు, 9 సిక్స్‌లతో 115 నాటౌట్) లిస్ట్-ఎ క్రికెట్‌లో వేగవంతమైన శతకం బాదిన తొలి భారత బ్యాటర్‌గా, ఓవరాల్‌గా మూడో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-సిలో శనివారం అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అన్‌మోల్ 35 బంతుల్లోనే సెంచరీతో చెలరేగడంతో.. పంజాబ్ 9 వికెట్ల తేడాతో బోణీ చేసింది. కాగా, మాజీ ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ (40 బంతుల్లో 100) రికార్డును అన్‌మోల్ బద్దలుకొట్టాడు. 2009-10 సీజన్‌లో మహారాష్ట్రతో మ్యాచ్‌లో బరోడా తరఫున యూసుఫ్ ఈ ఫీట్ సాధించాడు. మొత్తంగా లిస్ట్-ఎ క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు జాక్ ఫ్రేజర్ (29 బంతుల్లో), దక్షిణాఫ్రికా దిగ్గజం డివిల్లీర్స్ (31 బంతుల్లో) టాప్-2లో ఉన్నారు. కాగా, అన్‌మోల్ విరుచుకుపడడంతో.. అరుణాచల్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 12.5 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది.



శతక్కొట్టిన అశ్విన్.. ఆంధ్ర బోణీ

ముంబై: అశ్విన్ హెబ్బర్ (132) శతకంతో చెలరేగడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర ఘనంగా బోణీ చేసింది. గ్రూప్-బిలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 91 పరుగులతో రైల్వేస్‌ను చిత్తు చేసింది. తొలుత 49.2 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (41), కెప్టెన్ కేఎస్ భరత్ (30) ఫర్వాలేదనిపించారు. రాహుల్ 4, యువరాజ్ 3 వికెట్లు తీశారు. ఛేదనలో రైల్వేస్ 41.5 ఓవర్లలో 203 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఉపేంద్ర (64) హాఫ్ సెంచరీ చేశాడు. విజయ్ కుమార్ 4, శశికాంత్ 3 వికెట్లు పడగొట్టారు.

అఫ్ఘాన్‌దే వన్డే సిరీస్

హరారే: జింబాబ్వేతో జరిగిన మూడో వన్డేలో అఫ్ఘానిస్థాన్ 8 వికెట్లతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను అఫ్ఘాన్ 2-0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ముందుగా జింబాబ్వే 30.1 ఓవర్లలో 127 పరుగులకే పరిమితమైంది. షాన్ విలియమ్స్ (60) రాణించాడు. 18 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ ఘజన్‌ఫర్ 5 వికెట్లతో ఆకట్టుకోగా రషీద్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో అఫ్ఘాన్ 26.5 ఓవర్లలో 2 వికెట్లకు 131 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్ సెడికుల్లా అటల్ (52) అర్ధసెంచరీ సాధించాడు.



తెలుగు చిత్రపరిశ్రమలో శ్రీకాంత్ వంటి అదృష్టవంతుడు మరెవరూ లేరని అంటుంటారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించడమే కాకుండా ఏనాడూ వివాదాల జోలికి పోకుండా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. పరిశ్రమలో అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న శ్రీకాంత్.. వచ్చే జనవరిలో విడుదల కానున్న గేమ్ ఛేంజర్ చిత్రంలో తన తండ్రిని పోలిన గెటప్‌తో నటిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు 'నవ్య'తో పంచుకున్నారు శ్రీకాంత్.

అదృష్టం అంటే ఇదే కదా అనిపిస్తుంటుంది!

ముప్పై మూడేళ్ల కెరీర్.. 130కి పైగా చిత్రాలు.. ఎలా అనిపిస్తుంటుంది?

నిజం చెప్పాలంటే ఇన్నేళ్ల కెరీర్‌ను నేను ఊహించలేదు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్నప్పుడు సినిమాల్లో నటించాలనే కోరిక ఉండేది తప్ప ఇలా 30 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో కొనసాగుతానని అనుకోలేదు. నేనే కాదు బహుశా ఎవరూ అలా అనుకోలేరేమో! 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' చిత్రంలో తొలి అవకాశం దొరకడమే ఒక అదృష్టంలా భావించాను ఆ రోజు. ఎక్కడో ఒక గ్రామంలో పుట్టి పెరిగి ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా పరిశ్రమలోకి రావడం, ఒక్కో మెట్టు ఎదుగుతూ 130 పైగా చిత్రాల్లో నటించడం.. ఎలా సాధ్యమైందా అని ఆలోచిస్తుంటే నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. అదృష్టం అంటే ఇదే కదా అనిపిస్తుంటుంది.

కెరీర్ ఆరంభంలో మిమ్మల్ని గైడ్ చేసినవాళ్లు ఎవరైనా ఉన్నారా?

'పీపుల్స్ ఎన్‌కౌంటర్'లో చేస్తుండగానే 'మధురానగరిలో' సినిమాలో నలుగురి హీరోల్లో ఒకరిగా అవకాశం వచ్చింది. ఆ సినిమా అయిన తర్వాత ఆరు నెలలు గ్యాప్. చాలా టెన్షన్ పడ్డా. ఇక ఇంటికి తిరిగి వెళ్లిపోవాల్సిందేనా అనుకున్నాను. అటువంటి తరుణంలో 'సీతారత్నంగారి అబ్బాయి' చిత్రంలో అవకాశం వచ్చింది. కాకపోతే విలన్ వేషం. హీరోగా రెండు చిత్రాల్లో నటించి, ఇప్పుడు విలన్‌గా నటించాలా అనిపించింది. ఆ సమయంలో దర్శకుడు శరత్ నన్ను గైడ్ చేశారు. 'చిత్ర పరిశ్రమలో నిలబడడం ముఖ్యం. ఒకసారి పేరు వచ్చిన తర్వాత హీరో కావడం సులభమే' అన్నారు. ఇక ఆలోచించకుండా సరే అనేశా. ఇక అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. విలన్‌గా కొన్ని చిత్రాల్లో నటించి ఆ తర్వాత మళ్లీ హీరో అయ్యా. ఇప్పటికి 130కి పైగా చిత్రాలు పూర్తి చేశా. మధ్యలో కింద పడ్డాను, మళ్లీ పైకి లేచాను. 'అఖండ' చిత్రం తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి వచ్చి సెటిల్ అయ్యా. వస్తున్న క్యారెక్టర్స్ ఎంజాయ్ చేస్తూ నటిస్తున్నా. ఇంట్లో ఖాళీగా ఉంటే చిరాకుగా అనిపిస్తుంది. ఏదో ఒకటి చేయాల్సిందే. రిలాక్స్ మూడ్ అనేది ఇంకా రాలేదు. ప్రయాణం సాఫీగా సాగుతోంది. లక్కీగా ఇప్పుడు నాకు అన్నీ మంచి పాత్రలే వస్తున్నాయి.

ఎక్కువగా ట్రావెల్ చేస్తుంటారెందుకు?

నాకు ట్రావెలింగ్ అంటే బాగా ఇష్టం. ఫ్రెండ్స్‌తో కలసి తిరుగుతుంటాను. సాధ్యమైనంత వరకూ కారులో వెళ్లడానికే ప్రయత్నిస్తుంటా. ఇదివరకు అన్నీ జాలీ ట్రిప్పులే. గోవా, బ్యాంకాక్ ఇలా.. పదేళ్ల నుంచి రూట్ మార్చి ఆధ్యాత్మిక యాత్రలు చేస్తున్నాను. అమరనాథ్ యాత్ర, కేదార్‌నాథ్ వంటి కొన్ని ప్రదేశాలకు తప్ప శక్తి పీఠాలు, జ్యోతిర్లింగాలు.. అన్నీ చూసేశా. గత నెల కుటుంబంతో కలసి నేపాల్ వెళ్లి వచ్చాను. రుద్రాక్షలు మెళ్లో వేసుకుని నుదుటిన ఇంతింత బొట్లు, విభూతి పెట్టుకుని అక్కడి వీధుల్లో తిరుగుతుంటే మనసు చాలా ప్రశాంతంగా అనిపించింది. ఇప్పుడు కాశీ, అయోధ్య వెళ్లాలని ప్లాన్ చేస్తున్నా. ఇంట్లో వాళ్లు మాత్రం కారులో ఎందుకు అని అంటున్నారు. కారులో వెళుతుంటే ఆ కిక్కే వేరు. మన తెలుగు రాష్ట్రాల్లో చేయలేని పనులు అక్కడ స్వేచ్ఛగా చేయవచ్చు. దారిలో ఎక్కడన్నా చిన్న టీ కొట్టు కనిపించిందనుకోండి... ఆగి తాపీగా టీ తాగవచ్చు. తెలియని ప్రదేశంలో మనల్ని గుర్తు పట్టేవాళ్లు ఎవరూ ఉండరు కదా. ఒకసారి లడఖ్ వెళ్లి కారులో తిరిగి వస్తున్నాం. చండీఘడ్ దాటిన తర్వాత రోడు పక్కన ఒక దాబా కనిపించింది. కారు అక్కడ ఆపుకొని, భోజనం చేసి అక్కడున్న నులక మంచాల మీద పడుకుని తెల్లారిన తర్వాత బయలుదేరి వచ్చేశాం. ఇదంతా థ్రిల్లింగ్‌గా అనిపించింది. జనం మనల్ని గుర్తు పట్టనప్పుడు ఏమైనా చేయవచ్చు.

భక్తి భావం ఎప్పటినుంచి మొదలైంది?

నాకు మొదటి నుంచీ ఉంది. పదేళ్ల నుంచి మరింత ఎక్కువైంది. గుళ్లో ఉన్నంతసేపూ మనసు ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. నాకే కాదు... ఊహకి కూడా భక్తి ఎక్కువ. తరచూ ఇంట్లో పూజలు, హోమాలు చేయిస్తుంటుంది.

క్రికెట్ ఆటకు దూరమయ్యారా?

లేదు లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా వెళ్లి ఆడి వచ్చాం. సంగీత దర్శకుడు తమన్, తరుణ్... మేమంతా ఒక టీమ్. వచ్చే ఏడాది అమెరికాలో మ్యాచ్ ఉంది. దాని కోసం సన్నద్ధం అవుతున్నాం.

గేమ్ ఛేంజర్‌లో మీ నాన్నగారి గెటప్‌లో కనిపిస్తున్నారట!

ఆ సినిమాలో నాకు అవకాశం రావడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. కానీ మొదట కథ విన్న తర్వాత ఈ పాత్రకు నన్ను ఎందుకు అనుకున్నారా అనిపించింది. ఎందుకంటే అది వయసు పైబడిన పాత్ర. ముఖ్యమంత్రి పాత్ర. చాలా డెప్త్ ఉన్న వేషం.. నేను చేయగలనా అనిపించింది .కాకపోతే ఫ్లాష్ బ్యాక్‌లో యంగ్ గెటప్ కూడా ఉంది. ఇది పాజిటివ్ కాదు, నెగెటివ్ కాదు. ఒక్కో సమయంలో ఒక్కోలా అనిపిస్తుంటుంది. ఇలాంటి పాత్ర చేసే అవకాశం నాకు రావడం నిజంగా అదృష్టమే. శంకర్ దర్శకత్వంలో నటించడం లక్కీనే కదా. అందులోనూ నాన్నగారి గెటప్‌లో కనిపించడం మరింత ఆనందం కలిగించింది. ఆ గెటప్ ఎంతవరకూ సెట్ అవుతుందా అని భయపడ్డాను. ముంబైలో మేకప్ టెస్ట్ జరిగింది. ఆ గెటప్‌లో నన్ను చూసి శంకర్ చాలా సంతృప్తి చెందారు. ఎవరూ గుర్తు పట్టలేదు. ఆఖరికి మా అమ్మ కూడా. గెటప్ కుదిరితే నేను పాస్ అయినట్లే అనుకున్నాను. చాలా చక్కగా ఉంది. శంకర్ ఎలా చెబితే అలా నటించా.



మీ కారు నంబర్, ఫోన్ నంబర్.. అన్నీ ఫ్యాన్సీగా ఉంటాయి. న్యూమరాలజీ మీద బాగా నమ్మకమా?

అలా ఏమీ లేదండీ. ఫ్యాన్సీ నంబర్లు అంటే ఇష్టం. అందుకే అలా ఉంటాయి. కానీ ఐదు అంకెకూ నాకూ ఏదో తెలియని అనుబంధం ఉందని చెప్పాలి. నా అదృష్ట సంఖ్య ఐదు అని చెబుతారు. ఇంటి నంబర్ 23. అది కావాలని మనం అనుకున్నది కాదు. నా ఫోన్ నంబర్‌లో అంకెలన్నీ కలిపితే ఐదు వస్తుంది. నా పేరులోని అక్షరాలు కలిపితే ఐదు.

మీ ముగ్గురు పిల్లల్లో ఒకరు హీరో. మిగిలిన వారి సంగతి?

పాప కెనడాలో చదువుతోంది. రెండో అబ్బాయి టెన్త్ చదువుతున్నాడు. పెద్ద అబ్బాయి రోషన్ కంటే వాళ్లిద్దరూ బాగా చదువుతారు.

మీ ఇంట్లో పెత్తనం ఎవరిది.. మీదా.. ఊహదా?

ఇంటి విషయాల్లో ఆవిడదే పెత్తనం. డబ్బు తెచ్చి ఇవ్వడమే నా పని. పిల్లల చదువుల దగ్గర నుంచీ అన్నీ తనే చూసుకుంటుంది.

ఆవిడ సినిమాల్లో నటించకూడదని కండిషన్ పెట్టారా?

అదేమీ లేదండీ. పెళ్లయిన తర్వాత నటన వద్దని తనే అనుకుంది. పిల్లలు పుట్టిన తర్వాత ఆ నిర్ణయానికి మరింత కట్టుబడింది. ముగ్గురు పిల్లలను పెట్టుకుని మేం ఇద్దరం సినిమాల్లో నటించడం కరెక్ట్ కాదుగా. మధ్యలో కొందరు అడిగారు కానీ తనే చేయనని చెప్పేసింది. నేను నటించే సినిమాల వేడుకలకు కూడా ఆమె రాదు.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారా?

నాకు అకౌంట్స్ ఉన్నాయి కానీ అరుదుగా పోస్టులు పెడుతుంటాను. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉంటాను. వాటి గురించి తెలుసుకుంటాను కానీ ఎక్కడా కామెంట్ చేయను.

● వినాయకరావు



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఫోర్జ్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 22
ఓరిజిన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 25
స్క్విడ్ గేమ్ 2	కొరియన్ సిరీస్ (తెలుగులో)	డిసెంబర్ 26
భూల్ భూలయ్య 3	హిందీ చిత్రం	డిసెంబర్ 27
సొర్గవాసల్	తమిళ చిత్రం (తెలుగులో)	డిసెంబర్ 27
అమెజాన్ ప్రైమ్		
సింగం ఎగైన్	హిందీ చిత్రం	డిసెంబర్ 27
థానర	మలయాళ చిత్రం	డిసెంబర్ 27
జియో సినిమా		
డాక్టర్స్	హిందీ సిరీస్	డిసెంబర్ 27
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
వాట్ ఇఫ్? 3	యానిమేషన్ సిరీస్	డిసెంబర్ 22
డాక్టర్ వూ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 25
జీ5		
ఖోజ్	హిందీ చిత్రం	డిసెంబర్ 27
మనోరమా మ్యాక్స్		
పంచాయత్ జెట్టీ	మలయాళ చిత్రం	డిసెంబర్ 24
ఐ యామ్ కథలన్	మలయాళ చిత్రం	డిసెంబర్ 25
డిస్కవరీ ప్లస్		
హ్యారీపోటర్: విజర్డ్స్ ఆఫ్ బేకింగ్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 25
లయన్స్ గేట్ ప్లే మదర్స్ ఇన్‌స్టింక్ట్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 27

మళ్లీ వస్తోన్న స్క్విడ్ గేమ్



ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న కొరియన్ వెబ్‌సిరీస్ 'స్క్విడ్ గేమ్'కు కొనసాగింపుగా సీజన్ 2 వస్తోంది. తొలి సీజన్ తరహాలోనే రెండో సీజన్‌లోనూ స్క్విడ్ గేమ్‌లో పాల్గొన్న పోటీదారులు ఒక్కో టాస్క్ పూర్తి చేస్తూ ముందుకెళతారు. సీజన్ 2లో మొత్తం తొమ్మిది ఎపిసోడ్స్ ఉన్నాయి. కొత్త రూల్స్‌తో, తొలి సీజన్‌కు మించిన మలుపులతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. హోయాన్ జంగ్, లీ జంగ్ జే, పార్క్ హేసూ ప్రధాన పాత్రలు పోషించారు. డిసెంబర్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవనుంది.

ముఖానికి మీగడ రాస్తే...

చలికాలంలో ముఖం మీద చర్మం పొడిగా మారి పగులుతుంది. చిన్న పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మన పెద్దలు చెప్పిన పరిష్కారం పాల మీగడ రాయడమే. పాలను బాగా కాచి చల్లార్చిన తరవాత దానిపై ఒక పొర ఏర్పడుతుంది. దీనినే మీగడ అంటారు. దీనిని ఎక్కువగా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటారు. శీతాకాలంలో చర్మ సంరక్షణకు మీగడను మించింది లేదు.

ఎలా రాయాలంటే...

● ముందుగా ముఖాన్ని సున్నిపిండితో రుద్ది శుభ్రం చేసుకోవాలి. తరవాత కొద్దిగా పాల మీగడను తీసుకుని ముఖానికి రాసి వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావు గంట తరవాత మీగడ పూర్తిగా చర్మంలోకి ఇంకిపోతుంది. గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని మెత్తని టవల్‌తో అద్దుకోవాలి. సాధ్యమైనంత వరకు సబ్బులు వాడకపోవడం మంచిది.

మీగడ రాయడం వల్ల...

● ముఖానికి, చేతులకు మీగడ రాసుకోవడం వల్ల చర్మం మీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి.



మీగడలోని లాక్టిక్ యాసిడ్ చర్మం మీద ఉన్న ఎపిడెర్మల్, డెర్మల్ పొరల్లో కొత్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల చర్మం మృదువుగా కొత్తకాంతితో మెరిసిపోతుంది.

● చలి గాలుల వల్ల చర్మం తేమను కోల్పోతుంది. ఇలాంటపుడు మీగడను తరచూ రాస్తూ ఉంటే చర్మానికి తేమ అంది పగుళ్లు ఏర్పడవు. చిన్న పిల్లల చర్మం కోమలంగా ఉంటుంది. రసాయనాలతో కూడిన క్రీమ్‌లు రాయడం అంత మంచిది కాదు. వీరికి పాల మీగడ అద్భుతంగా పనిచేస్తుంది. మీగడలోని కొవ్వు పదార్థం చర్మానికి పోషణను అందిస్తుంది.

● ముఖానికి మీగడ రాసి మర్దన చేయడం వల్ల చర్మ రంధ్రాలన్నీ తెరచుకుంటాయి. వాటిలో చేరిన మురికి, ఇతర వ్యర్థ పదార్థాలన్నీ తొలగిపోతాయి. చర్మం శుభ్రపడడం వల్ల మొటిమలు, గుల్లలు రావు.


● బయటికి వెళ్లే ముందు ముఖానికి కొద్దిగా పాల మీగడ రాసుకుంటే ఎండ వల్ల చర్మం నల్లబడకుండా ఉంటుంది. సూర్యరశ్మిలోని ప్రమాదకర కిరణాలనుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది.

● మీగడలో కొద్దిగా ఓట్స్ పొడి లేదా పంచదార కలిపి దానితో ముఖాన్ని మెల్లగా రుద్దితే చర్మం మృదువుగా మారుతుంది. మీగడలోని పోషకాలు చర్మంలోకి చేరి ముడతలు రాకుండా కాపాడతాయి. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. మీగడను చేతులకు రాసుకున్నా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

● కొంతమందికి ఎండ తగలగానే ముఖం ఎర్రగా కందిపోతుంది. ఇటువంటి వారికి పాల మీగడ బాగా పనిచేస్తుంది. ఎండ వల్ల కలిగే సురుకుపోటును నివారిస్తుంది.

అంతా 'రామ' మయం

వెండితెర వేలుపు, తెలుగువారి ప్రియతమ నేత ఎన్.టి.రామారావు. ఆయన సినీ జీవిత విశేషాలతో కూడిన వ్యాసాల సమాహారం 'తారకరామం' పుస్తకం ఇటీవల విడుదలైంది. అందులోని కొన్ని ఆసక్తికర అంశాలు ఇవి...



విశాఖలో శ్రీరామపట్టాభిషేకం

● 'రామా! అయిదు ఘడియలు దాటకముందే యుద్ధాన్ని ప్రారంభించు! అది దాటెనా, నీవు లంకేశ్వరుని నిర్జించలేవు!' ఈ సలహా శ్రీరామునికి ఇచ్చింది మరెవరో కాదు. సాక్షాత్తూ రావణుడే. అంతేకాదు 'సమస్త సన్మంగళానిభవన్తు! విజయోస్తు!' అని కూడా శ్రీరాముని ఆశీర్వదిస్తాడు లంకాధినాథుడు. ఈ దృశ్యాన్ని 'శ్రీరామ పట్టాభిషేకం' చిత్రానికై అత్యంత సహజమైన రీతిలో విశాఖపట్టణం సముద్రతీరాన గల జోడుగుళ్ల పాలెం వద్ద రామారావు చిత్రీకరించారు.

ఈ విధంగా తల పండిన విద్వాంసునిగా, మహోదాత్తునిగా రావణుని వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేసి ఇప్పటికే తెరకెక్కిన ఎన్నెన్నో రామాయణ గాథల కన్నా మిన్నగా, రికార్డ్ బ్రేక్ చిత్రంగా శ్రీరామపట్టాభిషేకం గాథను ప్రజలకందించాలని తలపెట్టినట్లు రామారావు స్వయంగా తెలియజేశారు.

● భీమునిపట్నం వెళ్లే దారిలోగల ముప్పలవాని పాలెం సమీపాన సుమారు పన్నెండు రోజులపాటు ఈ సినిమా నిర్మాణం జరిగింది. లంకకు వానరసేన వారధి నిర్మించడం, రామ-రావణ యుద్ధం, సంజీవి మూలికను ఉపయోగించి లక్ష్మణుని మూర్ఛ నుంచి బతికించడం, రావణ వధ, సీతాదేవి అగ్ని ప్రవేశం లాంటి అనేక కీలక ఘట్టాలను ఇక్కడ చిత్రీకరించారు.

● మరునాడు యుద్ధభూమిలో రావణుడు నేలకూలి తాడనగా భార్య మండోదరి(జమున) 'ఆలపించనా ఈ వేళ! మధురస్మృతులే, హృదిని మీటగా, శ్రీలంకేశుని జీవనకావ్యం' అంటూ గానం చేస్తుంది.

● స్టంట్ మాస్టర్ సాంబశివరావు వానర సేనకు సూచనలిచ్చి షాట్‌కు సిద్ధం చేశారు. 'యాక్షన్' అని అసోసియేట్ డైరెక్టర్ సాయిబాబు ఆదేశం ఇచ్చినా, ఎవ్వరూ గదలు కదపలేదు. కట్, కట్ అంటూ ముందుకు వచ్చిన రామారావు 'ఎవ్వరూ యాక్షన్ చెయ్యరేం!' అని ప్రశ్నించారు. 'అవునండీ మరి గదలు, తోకలు విరిగితే మాకిచ్చే డబ్బుల్లో కోతపెడతామని రంగులేసే దగ్గర వార్నింగిచ్చారు. అందుచేత అవి పాడవకుండా చూస్తున్నాం!' అని జవాబిచ్చాడు ఒక ధర్మబుద్ధి. 'ఛ ఛ! అదేం లేదు గదలు విరిగినా పర్వాలేదు. మీ తలలు పగలకుండా చూసుకుని, స్టంట్ మాస్టర్ చెప్పినట్లు బాగా ఫైటింగ్ చేయండి. మీ డబ్బులేమీ తగ్గించరు' అని రామారావు వారికి అభయం ఇచ్చాక వానర మూక షాట్‌లో చెలరేగిపోయారు.

కథేమిటని అడిగితే...

(గుడిపూడి శ్రీహరి ఇంటర్వ్యూలో ఎన్‌టీఆర్ చెప్పిన విశేషాలు)

● నేను ఈ రోజు దర్శకుణ్ణవడానికీ, దీక్షతో చిత్రాలు తీయడానికీ- గతంలో ప్రముఖ దర్శకుల వద్ద పనిచేసే రోజుల్లో ఒంటబట్టించుకున్న సారమే ప్రోత్సహించింది. నా జీవితంలో మొదటి మలుపు తీసుకొచ్చిన దర్శకులు కే.వీ.రెడ్డి, బీ.యన్ రెడ్డి, యల్.వీ.ప్రసాద్. ఈ రోజు వరకూ ఇంతకన్నా గొప్ప దర్శకులు తెలుగు సినిమా రంగంలో రాలేదు. వీరి దర్శకత్వంలో నేను రెండు సంవత్సరాల్లో (పాతాళభైరవి తీస్తున్న రోజులు) పైకి రాలేకపోతే మద్రాసునీ, చలనచిత్ర రంగాన్ని శాశ్వతంగా వదిలి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నా! వారి దర్శకత్వంలో హీరోగా క్రమశిక్షణతో కృషి చేసి పైకి రావడానికి అదే సరైన సమయమనీ, అదొక పరీక్ష అనీ భావించుకున్నా! ఈ రోజు నేను దర్శకుణ్ణవడానికి కూడా నా మీద పడిన వారి ప్రభావమే కారణం.

● ఇప్పుడు నటనలో, సినిమా తీసే విధానాల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, కార్యదీక్ష చాలావరకూ తగ్గిపోయాయి. ఉదాహరణకు ఒక విషయం చెబుతాను. మద్రాసుకు యాభై మైళ్ల దూరంలో ఉన్న తడకి తెల్లవారుఝామునే వెళ్లి మేకప్ వేసుకుని అక్కడి నుంచి అయిదు మైళ్లు కారులో వెళ్లి రిహార్సల్సు చేసుకుని షూటింగ్‌కి సూర్య భగవానుడి కోసం ఎదురుచూసే వాళ్లం. ఇప్పుడు అలా ఉండడం లేదు. జగదేక వీరుని కథ తీస్తున్న సమయంలో ఎవరో అరవై మంది ప్రముఖులు షూటింగ్ చూడడానికి స్టూడియోకి వచ్చారు. నాగిరెడ్డి వారిని సెట్ మీదికి తీసుకు వచ్చారు. శివశంకరీ... శివానంద లహరీ.... పాట చిత్రీకరించాలి. మేమంతా మేకప్ వేసుకుని రెడీగా ఉన్నాం. అంతలో 'రామారావు గారూ! మనం షాట్ తీద్దాం!' అన్నారు రెడ్డిగారు. ఆరున్నర నిమిషాల పాట అది. 'రెడీ' అన్నాను. అంతే! షూటింగ్ మొదలైంది. ఒకే టేక్‌లో పాటంతా షూట్ చేశారు. ప్రతి దృశ్యానికీ మా సంసిద్ధత అలా ఉండేది.

● అప్పుడప్పుడూ నేను 'కథేమిటి?' అని అడిగేవాణ్ణి. కే.వీ. రెడ్డి, బీ.యన్.రెడ్డి వెంటనే నవ్వేసేవారు. 'రామారావూ! స్క్రిప్టు తీసుకు చదవాలిగానీ కథ అడుగుతావేమిటి?' అనేవారు. చివరికి షాట్ ఏమిటో అడిగినా సరే హాస్యాస్పదంగా ఉండేది. ఎందుకంటే స్క్రిప్టు రెడీగా ఉండేది. చదువుకుని సిద్ధపడే వాళ్లం. ఈ రోజుకి కూడా నాకు వారి పద్ధతులే ఒక ఇన్‌స్పిరేషన్. వాటితోనే దర్శకత్వం నిర్వహించడానికి కృషి చేస్తున్నా! నాకే కాదు తెలుగు పరిశ్రమకే వారు గురుతుల్యులు. వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నా! ఒక చిత్రం ప్రారంభించిన తరవాత అది ముగిసేదాకా మరో చిత్రం గురించి ఆలోచించకూడదు. దాన్ని పూర్తిచేయాలంటే కనీసం ఆరేడు నెలలైనా పడుతుంది. ఇప్పుడేముంది? స్పీడ్... స్పీడ్... అంటూ చిత్రం త్వరగా పూర్తిచేయాలంటారు. మేం నటించడం లేదు. పాత్రలతో ఆడుకుంటున్నాం. అంతే!

● నేను కూడా ఇదే గాలివానలో కొట్టుకుపోతున్నందుకు బాధగా ఉంది. నా అభిమానులంతా నేను అలాగే నటించాలంటున్నారు. అలాగే నటిస్తున్నా! కానీ ఇది నా అభిమతం కాదు. కమర్షియల్ ఆర్టిస్టుని కదా! పొరపాటున ఈ గాలికి అడ్డం తిరిగానంటే కొట్టుకుపోతాను. నిజానికి నాలోని కళాకారుడు నేను వేస్తున్న వేషాలకి ప్రతిక్షణం తిరగబడుతున్నాడు. ఇప్పటికి 280 పాత్రలు ధరించాను. ఇతరులను తృప్తిపరచగలిగాను కానీ నన్ను నేను తృప్తిపరచుకోలేకపోతున్నా! అభిమానులు చాలామంది ఇప్పటికీ నా పాత్రల గురించి ప్రస్తావిస్తుంటారు. వాటినే వారు గుర్తుంచుకున్నారు. వైవిధ్యం గల పాత్రలవి. అటు శ్రీరామ, శ్రీకృష్ణ, సుయోధన, భీష్మ, భీమ..... ఇటు ఉమ్మడి కుటుంబం, కోడలు దిద్దిన కాపురం, పెళ్లి చేసి చూడు తదితర చిత్రాల్లోని పాత్రలు.... వీటిని నటించడానికి ఎంతో నేర్పు, సామర్థ్యం అవసరం.

ఆనాటి కోతిబావ ఈనాటికీ...

● అందరూ ఎన్.టీ.ఆర్‌ని నటరత్న అని రాస్తుంటే ఏ ఒక్కరూ కూడా అందగాడని అనరేంటి? అనుకునేదాన్ని. దానికి కారణం లేకపోలేదు. రామారావు నటన కంటే మనిషిని మెచ్చిన కుర్రతనం అది. మల్లీశ్వరి సినిమాని ప్రముఖ జర్నలిస్ట్ ఖాసా సుబ్బారావుతో కలిసి చూశా. అప్పటికి నాకు తెలుగు వచ్చు. కానీ అది పరీక్షల చదువుతో వంటబట్టిన తెలుగు మాత్రమే. మల్లీశ్వరి పేరుతో సినిమా వచ్చినప్పటికీ అది హీరో సబ్జెక్ట్ అని ఈ రోజుకీ అంటున్నా. మల్లీశ్వరిలో మొదటిసారి హీరో రామారావుని చూశా. అంతకుముందు ఎక్కడో షావుకారు సినిమా వేస్తుంటే వెళ్లి చూశా. కానీ మల్లీశ్వరిలో రామారావు పంచె కట్టు, జుబ్బాతో అచ్చ తెలుగు యువకుడిలా అందంగా కనిపించాడు. మల్లీశ్వరిలో రామారావు గురించి ఎందుకు చెప్పుకోరు? నిజానికి ఆయన లేకపోతే కథేది? అని నేను వాదిస్తే 'అది నిజమే' అని ఖాసా నవ్వారు.

● ఎన్.టీ.ఆర్ ఇదివరకు చాలా తక్కువ మాట్లాడి ఎక్కువ నటించేవారు. అలా ఆలోచిస్తే నాకు తట్టే కారణం ఒక్కటే. పురాణ పురుషుల వేషాలు వేసిన రామారావుకి ఆ హుందా ఒంటబట్టేసింది. ఆ నిదానం, ఆ సుతిమెత్తని చిరునవ్వు, ఆ చేతుల కదలిక, ఆ నడక తీరు అతనికి అలవాటై పోయాయి. నిజానికి మీరే ఆలోచించండి! రాముడు, కృష్ణుడు ఎలా ఉండేవారు? మనకి తెలియదు. వారికొక రూపకల్పన ఇచ్చి మన ముందు సజీవ ప్రతిమలుగా నిలబెట్టారు రామారావు. దైవరూపాల్లో అక్షరాస్యులనే ఆకట్టుకున్న ఎన్‌టీఆర్ నిరక్షరాస్యులకు దైవంగా తోచడంలో ఆశ్చర్యం ఏముంటుంది.

● ప్రేక్షకుల అభిరుచిలో మార్పు వస్తోంది. శంకరాభరణం లాంటి చిత్రాలను ప్రేక్షకులు అభిమానిస్తే నాలాంటి కళాకారుడికి ఎంతో ఆనందం కలుగుతుంది. కానీ అలాంటి చిత్రాలు అరుదుగా వస్తున్నాయి. ఒక్కోసారి అలాంటి చిత్రాలు ప్రేక్షకుల అభిమానానికి నోచుకోకపోయినా నాలాంటి వారు ఆ చిత్రాలను తీసినవాళ్లని అభినందించకుండా ఉండలేరు. అలాంటి చిత్రాలకు ప్రేక్షకాదరణ లభిస్తే అంతకన్నా ఏం కావాలి? పుణ్యం, పురుషార్థం రెండు దక్కడమే అవుతుంది. శంకరాభరణం, సిరిసిరి మువ్వ సినిమాలు చూసి విశ్వనాథ్ అభిమానిని అయ్యాను. ఇలాంటి చిత్రాలు చూసినపుడు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయా అనిపిస్తుంది. అయితే విశ్వనాథ్ లాంటి దర్శకులు నాలాంటి ఆర్టిస్టులతో ఇలాంటి చిత్రాలు తీయడానికి ధైర్యం చేయరు. నాలాంటి నటులు నటించడానికీ ధైర్యం చేయరు. ఎందుకంటే మా నుంచి ప్రేక్షకులు చూడదలచింది వేరేగా ఉంటుంది.



● ఇప్పటికీ ఎన్‌టీఆర్ సినిమాలు చూస్తూ ఉంటా. నా అభిప్రాయం ఎప్పుడూ ఒక్కటే. రామారావు అందగాడు. అందుకే హీరోగా నిలబడ్డారు. ఆ అందంలో హుందాతనం, వృత్తిపై గౌరవం, తన శక్తిపై నమ్మకం ఉండడం వల్ల ఇంకా అందంగా కనిపించారు. అంతఃసౌందర్యమే కదా బాహ్య రూపానికి జీవకళనిచ్చేది! ఆ అంతరంగికమైన నిర్మలత్వం అండగా నిలిచి వయసుని తోసి రాజును చేసింది. అందుకే ఆనాటి 'కోతి బావ' ఈనాటికీ 'మగాడు' అని పించుకుంటున్నాడు.

- రామలక్ష్మి ఆరుద్ర

చిన్నారి ప్రాణం తీసిన జగన్ పుట్టినరోజు వేడుక!

- నడి రోడ్డుపై వైసీపీ నాయకుల దానధర్మాలు
- బీరువా పడి తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు దారివ్వని వైనం
- చిన్నారిని భుజంపైనే వేసుకుని ఆసుపత్రికి తండ్రి
- అంబులెన్స్ రాకా ఆలస్యం.. చిన్నారి తుదిశ్వాస
- కాకినాడ జిల్లా కొత్తపల్లిలోని ఉప్పాడలో ఘోరం
- మైలవరంలో మాజీ మంత్రి జోగి హంగామా
- 'పోలీసు సైరన్ల'తో వాహన ర్యాలీ.. ట్రాఫిక్ జామ్


బెట్సీ జయకీర్తన(ఫైల్)

కొత్తపల్లి(కాకినాడ)/మైలవరం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు ఓ చిన్నారిని పొట్టనబెట్టుకున్నాయి. కాకినాడ జిల్లాలోని కొత్తపల్లిలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు దారిలేక ఆమె తండ్రి చిన్నారిని భుజాన వేసుకుని ఆసుపత్రికి పరుగులు పెట్టాల్సి వచ్చింది. అప్పటికే సమయం గడిచిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో ఆ చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇక, ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరంలో మాజీ మంత్రి జోగి రమేశ్ అనుచరులు హంగామా సృష్టించారు. ప్రైవేటు వాహనాలకు పోలీసు సైరన్లు పెట్టి మోగిస్తూ.. రోడ్లపై హల్చల్ చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ ఆగిపోయింది. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ చిక్కుకుంది.

కొంచెం దారిచ్చి ఉంటే..

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో క్రీస్తు గాస్పెల్ చర్చి నిర్వాహకులు రాజబాబు ఇటీవల నూతన చర్చి నిర్మాణం చేపట్టారు. పాత చర్చిలో సామగ్రిని తరలించడంలో భాగంగా శనివారం చెక్క బీరువాను బయటకు తీశారు. ఈ లోగా అక్కడే ఆడుకుంటున్న రాజబాబు మనవరాలైన రెండేళ్ల చిన్నారి బెట్సీ జయకీర్తన.. చెక్కబీరువాకు వేలాడుతున్న తాళాల గుత్తిని చూసి లాగింది. దీంతో బీరువా ఒక్కసారిగా ఆ చిన్నారిపై పడింది. దీంతో తీవ్ర గాయాలైన చిన్నారిని తండ్రి షారోన్‌కుమార్ కారులో కొత్తపల్లి పీహెచ్‌సీకి తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే, మార్గం మధ్యలో ప్రధాన రహదారి వాకతిప్పలో వైసీపీ కార్యకర్తలు మాజీ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని పేదలకు దానధర్మాల కార్యక్రమం చేపట్టారు. దుప్పట్లు, చీరల కోసం పెద్ద ఎత్తున పేదలు, వృద్ధులు రోడ్డుపై గుమిగూడారు. దీంతో షారోన్‌కుమార్ కారు పీహెచ్‌సీకి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఆయన తన కుమార్తెను భుజాన వేసుకొని పీహెచ్‌సీకి పరుగున పరుగున తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో చిన్నారిని పరీక్షించిన వైద్యులు అత్యవసర చికిత్స కోసం కాకినాడ తరలించాలని చెప్పారు. దీంతో


మైలవరంలో నిర్వహించిన జగన్ పుట్టిన రోజు వేడుకలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జోగి రమేశ్


మైలవరంలో జోగి రమేశ్ అనుచరుల హల్చల్‌తో ట్రాఫిక్‌లో నిలిచిపోయిన అంబులెన్స్

అంబులెన్స్ కోసం 2 గంటలు నిరీక్షించారు. 108 రాకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో తరలిస్తుండగా కీర్తన మార్గమధ్యంలో మృతిచెందింది. అయితే.. తమ కారుకు కొంచెం దారిచ్చి ఉంటే ముందుగానే పీహెచ్‌సీకి చేరుకునే వారమని, చిన్నారికి ప్రాణాపాయం తప్పేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

మైలవరంలో జోగి.. యాగీ

జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ మైలవరంలో నానా యాగీ చేశారు. నాలుగైదు కార్లలో ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం వెళుతూ తమ ప్రైవేటు వాహనాలకు పోలీసు లేదా అత్యవసర సేవల వాహనాల సైరన్‌లు పెట్టి మోగిస్తూ హంగామా చేశారు. సాధారణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే.. ఇంత జరిగినా ఇబ్రహీంపట్నం, జి.కొండూరు పోలీసులతో పాటు మైలవరం పోలీసులు కూడా జోగి హడావుడిని ప్రశ్నించిన పాపాన పోలేదు. మైలవరంలో ఎల్‌హెచ్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ఓ కార్యక్రమంలో జోగి పాల్గొని కేక్ కట్ చేశారు. దీంతో నడిరోడ్డుపై అరగంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ కూడా చిక్కుకుపోయింది. అయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోలేదు. ఈ విషయంపై మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ స్పందిస్తూ.. మైలవరంలో వైసీపీ నేతల కార్యక్రమం ఉన్నట్లు తమకు సమాచారం లేదన్నారు. తామెవరికీ అనుమతులివ్వలేదని తెలిపారు. ప్రైవేటు వాహనదారులు పోలీసు లేదా అత్యవసర సేవల వాహనాల సైరన్‌ను వినియోగించరాదని చెప్పారు.

ఏబీవీపై కేసుల ఉపసంహరణ

- రిటైర్డ్ అధికారికి గతంలో కోర్టులు, యూపీఎస్సీ ఇచ్చిన ఆదేశాలు వర్తించవు
- జీవో జారీ చేసిన సీఎస్ నీరభ్ కుమార్



అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)పై జగన్ సర్కారు పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంది. న్యాయశాఖ, అడ్వకేట్ జనరల్ అభిప్రాయాల మేరకు ఈ కేసులు ఉపసంహరించుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరభ్ కుమార్ ప్రసాద్ శనివారం జీవో జారీ చేశారు. ఏబీవీ ఇప్పటికే రిటైర్ అయ్యారని, ఈ నేపథ్యంలో గతంలో కోర్టులు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఇచ్చిన ఆదేశాలు చెల్లవని, చెల్లింపుల్లో కోతలు, ఇంక్రిమెంట్లు ఆపడం, పెనాల్టీలు విధించడం, కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఇతర ఆదేశాలు ఆయనకు వర్తించవని న్యాయశాఖ అభిప్రాయపడినట్టు జీవోలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏబీవీ వేతనం అందుకోవడం లేదు కాబట్టి.. భవిష్యత్ ఇంక్రిమెంట్లను ఆపలేమని న్యాయశాఖ పేర్కొన్నట్టు వెల్లడించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని, ఎస్‌టీసీఐఎల్ నిధులన్నీ తిరిగిచ్చేసిందని తెలిపారు. ఏబీవీపై వచ్చిన ఆరోపణలు, ఉల్లంఘనలపై విచారణ చేసిన అధికారికి ఏబీవీ గానీ, ఆయన కుమారుడు గానీ లబ్ధిపొందినట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదని పేర్కొన్నారు. వీటన్నింటిపై ఏజీ, న్యాయశాఖ ఇచ్చిన అభిప్రాయాల ఆధారంగా కేసులు ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చీరాగానే ఏబీవీపై గురిపెట్టారు. ఆయనపై కక్షగట్టినట్టు వ్యవహరించారు. అకారణంగా ఆయన్ను సస్పెండ్ చేశారు. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించగా సస్పెన్షన్ ఎత్తివేయాలని జగన్ ప్రభుత్వానికి క్యాట్ సూచించింది. దీనిపై జగన్ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే, క్యాట్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అలా ఐదేళ్లపాటు ఏబీ వెంకటేశ్వరరావు న్యాయం పోరాటం చేశారు.

జల్ జీవన్ మిషన్‌లో రూ.11,400 కోట్ల పనులు రద్దు

- తాజా డీపీఆర్‌లతో కొత్తగా టెండర్లు

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) కార్యక్రమం కింద రూ.11,400 కోట్ల అంచనా వ్యయంతో బోర్‌వెల్స్ ఆధారంగా మంజూరు చేసిన 44,195 పనులను ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే రూ.7,910.10 కోట్ల అంచనాతో ఐదు మల్టీ విలేజ్ స్కీమ్స్(ఎంవీఎస్)కు సంబంధించిన ఒప్పందాలను కూడా రద్దు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జేజేఎం సవరణలో భాగంగా.. సవరించిన డిజైన్లతో వీటికి తాజా టెండర్లు పిలవాలని ఆదేశించింది. ఎంపిక చేసిన ఏజెన్సీలు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లు రూపొందించాలని స్పష్టం చేసింది. అలాగే ప్రస్తుతం జరుగుతున్న 33,717 పనులను పూర్తిచేయడానికి ఒప్పందం గడువును మరో ఆరు నెలలకు పొడిగిస్తున్నట్లు పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఎన్‌సీ ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ భేష్

- ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఎదుగుదలలో కీలకం
- ఇతర రాష్ట్రాలకు ఒక ఆదర్శప్రాయమైన మోడల్
- సీఎంకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 45,094 పాఠశాలల్లో మెగా పేరెంట్-టీచర్ సమావేశాలను నిర్వహించడం పట్ల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం విజయవంతం కావడానికి చంద్రబాబు దూరదృష్టి గల నాయకత్వం దోహదపడిందన్నారు. ఇటువంటి ఆదర్శప్రాయమైన కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు ఒక నమునాగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యా మంత్రి నారా లోకేశ్‌కు కూడా అభినందనలు తెలిపారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో 72 లక్షల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారని తెలిసి సంతోషిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వారంతా 1.85 లక్షల మంది ఉపాధ్యాయులతో అర్థవంతమైన చర్చలో నిమగ్నమయ్యారని, ఇటువంటి కార్యక్రమం నిస్సందేహంగా ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. వారి మధ్య సృహద్భావ వాతావరణం పిల్లలు చదువులో రాణించడానికి, వారి వ్యక్తిగత ఎదుగుదలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఏపీలోని మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విషయాన్ని ఎంపీ అప్పలనాయుడు ఆయన దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

ఐపీఎస్ సంజయ్ ప్రాసిక్యూషన్

(మొదటి పేజీ తరువాయి)

పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ జరిపి అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ చట్టం 1969లోని సెక్షన్ 3(1) కింద చర్యలు తీసుకుంది. అక్రమాలపై విచారణ చేయాలని ఏసీబీ అధికారులను ఆదేశించింది. ఏసీబీ అధికారులు కూడా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అవినీతి నిరోధక చట్టం 17ఎ ప్రకారం ఒక ప్రభుత్వ అధికారిపై విచారణ జరపాలంటే ఆయనను తొలగించే అధికారం ఉన్న అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. దాంతో ఏసీబీ అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు. సంజయ్‌పై కేసుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేకుండా విజయవాడ దాటి వెళ్లకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఏసీబీ విచారణ ప్రారంభించడంతో పాటు ఆయన్ను అరెస్టు చేసే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నో ఆరోపణలు...

జగన్ జమానాలో సీఐడీ చీఫ్ కంటే ముందు సంజయ్ ఫైర్ సర్వీసెస్ డీజీగా విధులు నిర్వహించారు. అప్పట్లో అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. అగ్ని ఎన్‌వోసీ టెండర్ల ప్రక్రియలో అక్రమాలతో పాటు నిబంధనల అమలులో అవకతవకలకు పాల్పడ్డారు. గత ప్రభుత్వంలో అగ్ని ఓర్టల్‌లో ఎన్‌వోసీలు, హార్డ్‌వేర్ సరఫరా కోసం రూ.2.29 కోట్ల ఒప్పందాన్ని సౌత్రికా టెక్నాలజీ అండ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. ఈ ఒప్పందంలో సదరు కంపెనీకి రూ.59.93 లక్షలు ముందుగా చెల్లింపులు చేశారు. కానీ నెల రోజుల్లో కేవలం 14 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. మైక్రోసాఫ్ట్ లాప్‌ట్యాప్‌లు, యాపిల్ ఐ ప్యాడ్‌లను ఆయన నేరుగా కొనుగోలు చేశారు. టెండర్ ప్రక్రియ లేకుండా కొనుగోలు చేయడంతో పాటు అధిక ధరలకు రూ.17.89 లక్షలు చెల్లింపులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇలా నిబంధనలు పక్కన పెట్టి ఇష్టారాజ్యాంగా ఆర్థిక లావాదేవీలు, అధిక ధరలకు పరికరాలు కొనుగోలు చేయడం వంటి వాటిని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఎస్సీ, ఎస్టీ అవగాహన సదస్సుల నిర్వహణలో కూడా ఆయన అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు న్నాయి. ఎస్సీ, ఎస్టీలకు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.1.19 కోట్లు కేటాయించింది. వాటిని కృతివ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో నిర్వహించారు. వాస్తవానికి భారీ స్థాయిలో సదస్సులు నిర్వహించలేదు. ఏ కంపెనీకీ సదస్సు నిర్వహణ బాధ్యతలు అప్పగించలేదు. తూతు మంత్రంగా ప్రైవేటు భవనాల్లో సదస్సులు నిర్వహించేశారు. ఇందుకు రూ.3.10 లక్షలు మాత్రమే ఖర్చు అయింది. మిగిలిన బడ్జెట్ మొత్తం లేని కంపెనీ పేరుతో దారి మళ్లించారు. కాగితాలపై మాత్రం టెండర్లు పిలిచినట్లు, కంపెనీని



ఎంపిక చేసినట్లు, దాని ద్వారా సదస్సులు నిర్వహించినట్లు చూపించారు. దీనిపైనా విజిలెన్స్ అధికారులు విచారణ చేసి బాధ్యుడిగా సంజయ్‌ను గుర్తించారు.

సీఐడీ చీఫ్‌గా వివాదాలు

జగన్ ప్రభుత్వంలో సంజయ్ సీఐడీ విభాగాధిపతి కాకముందు కీలకమైన పోస్టులు, చెప్పుకోదగ్గ పోలీస్ విభాగంలో పని చేయలేదు. జగన్ ప్రభుత్వం ఒక్కసారిగా సీఐడీ చీఫ్‌గా నియమించింది. ఆయన వైసీపీ రాజకీయ ప్రత్యర్థుల్ని వేటాడి వేధించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సంఘటనలు మొదలుకుని చాలా విషయాల్లో ఆయన చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. చివరికి అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు అరెస్టు విషయంలో కూడా సంజయ్ కీలకంగా మారారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల్లో ముఖ్యమంత్రికి నేరుగా జోక్యం ఉండదన్న విషయం తెలిసీ స్కిల్ కేసులో అత్యుత్సాహం ప్రదర్శించారు. అర్ధరాత్రి నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేయించారు. తన అధికార పరిధి దాటి మరీ జగన్‌కు జై అన్నట్లుగా వ్యవహరించారు. మార్గదర్శి కేసుల విషయంలో దూకుడుగా వ్యవహరించారు. కేసుల విషయాల్లో గతంలో ఏ పోలీస్ అధికారి చేయనివిధంగా ప్రెస్‌మీట్లు పెట్టి హడావిడి చేశారు. చివరికి ప్రభుత్వంపై ఎవరైనా విమర్శలు చేసినా, నోరెత్తినా కేసులు , అరెస్టులతో పాటు వారి ఆస్తులు కూడా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

ఈడీ దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

అసలు యజమాని కేవీ రావును ఆనాడు జగన్ సన్నిహితులు బెదిరించి, భయపెట్టి కారుచౌకగా వాటాలు కొట్టేసిన వైనంపై ఈడీ పలు ప్రశ్నలు అడిగింది. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు, గనులు, పోర్టులు చేతులు మారిపోయాయి. అందులో కాకినాడ సీపోర్టు కూడా ఒకటి. ఇందులో 41 శాతం వాటాను తాడేపల్లి పెద్దలకు బాగా దగ్గరైన 'అరబిందో' దక్కించుకుంది. తనను బెదిరించి, భయపెట్టి మరీ వాటాలు రాయించుకున్నారని పోర్టు యజమాని కేవీ రావు ఇటీవల సీఐడీకి ఫిర్యాదు చేశారు. "చెన్నైకు చెందిన శ్రీధర్ అండ్ సంతానం కంపెనీతో ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని (జగన్) ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. ముంబైకి చెందిన మరో సంస్థకూడా ఆడిట్ చేస్తుందంటూ సమాచారం ఇచ్చారు. రెండు సంస్థలకూ మేం సహకరించాం. రికార్డులన్నీ వారి ముందుంచాం. మా సంస్థ ప్రభుత్వానికి 984 కోట్ల రూపాయలు ఎగ్గొట్టినట్లు ఆడిట్ కంపెనీ....వైసీపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఇదే సమయంలో మాకు విజయసాయిరెడ్డి ఫోన్ చేశారు. జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని కలవాలని సూచించారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో ఉన్న విక్రాంత్ ఇంటికెళ్లి కలిసి మాట్లాడాను. 'మీరు ప్రభుత్వానికి వెయ్యి కోట్లు ఎగ్గొట్టారు. మొత్తం కుటుంబం జైలుకు వెళ్లకూడదు అనుకుంటే మీ కంపెనీ షేర్లన్నీ విక్రయించేయండి. ఇది నా మాట కాదు ముఖ్యమంత్రి జగన్ 'ఆదేశం' అని భయపెట్టారు. 41.14 శాతానికి 494 కోట్లకు ఖరారు చేశామని, డీల్ సెట్ చేసుకోమని ఏకపక్షంగా చెప్పారు. వేల కోట్ల ఆస్తులను కొట్టేశాక విక్రాంత్ రెడ్డి తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌కు నన్ను తీసుకెళ్లారు... 'ఇది చాలా అన్యాయం' అని నేను అంటుండగా... 'విక్రాంత్ చెప్పినట్లు చెయ్యండి' అంటూ జగన్ హుకుం జారీ చేశారు. అంతకు ముందు మేం ప్రభుత్వానికి రూ.904 కోట్లు ఎగ్గొట్టామని నివేదిక ఇచ్చిన శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ.. ఆ తర్వాత పన్ను ఎగవేత తొమ్మిది కోట్లే అని తేల్చింది" అని ఆ ఫిర్యాదులో ఆయన వెల్లడించారు.

శరత్‌చంద్రారెడ్డికి సీఐడీ నోటీసులు

- మరో ఇద్దరు డైరెక్టర్లకు కూడా..
- వాటాలు వదులుకునేలా కేవీరావుపై నాడు ఒత్తిడి
- అందులో కీలక పాత్ర పీకేఎఫ్‌దే

కాకినాడ సీపోర్టులో వ్యాపారవేత్త కేవీ రావును బెదిరించి అన్యాయంగా వాటాలను రాయించుకున్న కేసు దర్యాప్తులో సీఐడీ వేగం పెంచింది. జగన్ హయాంలో వివాదాస్పదంగా మారిన ఈ వ్యవహారంలో బెదిరించి కేవీరావుతో వాటాలు రాయించుకోవడంలో కీలకంగా వ్యవహరించినవారికి తాఖీదులు జారీ చేస్తోంది. విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేస్తోంది. కాకినాడ పోర్టు, సెజ్‌ను ఆనాడు బెదిరించి లాగేసుకున్నారని యజమాని కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కొడుకు విక్రాంత్ రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, అరబిందో ఫార్మాకు చెందిన శరత్ చంద్రారెడ్డి, చెన్నైకు చెందిన ఆడిటింగ్ కంపెనీ పీకేఎఫ్ ప్రతినిధులు సుందర్, విశ్వనాథ్, ప్రసన్నకుమార్, అపర్ణలను నిందితులుగా చేర్చారు. సెజ్‌ను లాక్కున్న అరబిందో ఇన్‌ఫ్రాను కేసులో చేర్చారు. ఈ క్రమంలో కాకినాడ పోర్టుకు ఆడిట్ నివేదికను రూపొందించిన పీకేఎఫ్ సంస్థ ప్రతినిధులు సుందర్, విశ్వనాథ్‌ను సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం విచారించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి వరకు విచారణ సాగుతూనే ఉంది. విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆడిటింగ్ కంపెనీ ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పీకేఎఫ్‌కు డైరెక్టర్లుగా ఉన్న ప్రసన్నకుమార్, అపర్ణకు కూడా నోటీసులు ఇవ్వడానికి సీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈనెల 24వ తేదీ తర్వాత వారిని విచారణకు పిలిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవీ రావు నుంచి కాకినాడ సీపోర్టును లాక్కోవడంలో ప్రధానంగా అభియోగాలు ఎదుర్కొంటున్న అరబిందో ఫార్మా ప్రతినిధి పెనకా శరత్‌చంద్రారెడ్డికి సీఐడీ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. తాను అయ్యప్పస్వామి మాలలో ఉన్నందున ఈ నెల 24 తర్వాత విచారణకు వస్తానని శరత్‌చంద్రారెడ్డి సీఐడీకి లేఖ రాశారు. కాకినాడ సీపోర్టుపై చెన్నైకి చెందిన పీకేఎఫ్ కన్సల్టెన్సీతో ఆనాడు ఆడిట్ చేయించారు. దీనివెనుక కుట్ర కోణం ఉన్నదని సీఐడీ అనుమానిస్తోంది. కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా ఉన్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి పీకేఎఫ్ కంపెనీతో సత్సంబంధాలు ఉన్నాయి.

ఆ చీకటి జీవో సంగతి చూడండి!

- ప్రభుత్వ భూములను తెగనమ్మేందుకు

ల్యాండ్ పాలసీనే మార్చేసిన నాటి జగన్ సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2011, డిసెంబరు 14... 'హైదరాబాద్‌ను అమ్మేశారు' అంటూ 'ఆంధ్రజ్యోతి' సంచలన పరిశోధనాత్మక వార్తలను ప్రచురించింది. ఆ నగరం, దాని చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి ఉండగా అప్పటి ప్రభుత్వం తెగనమ్మేసిందని, నేతలు రూ.వందల కోట్ల విలువైన భూములు కబ్జాచేశారంటూ అనేక పరిశోధనాత్మక వార్తలు ప్రచురించింది. దాని ఫలితంగా నాటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఆ వార్తలపై స్పందించింది. విచారణ కోసం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. దాని సిఫారసుల ఆధారంగా.. ప్రభుత్వ భూములను వనరుల సమీకరణ కోసం అమ్మరాదు.. తాకట్టు పెట్టరాదంటూ 2012 సెప్టెంబరు 14న సమగ్ర భూ కేటాయింపు పాలసీ తెచ్చింది. రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్ అధికారంలోకి వచ్చాక, ఈ పాలసీనే నిర్వీర్యం చేసేశారు.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆనాడు అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములపై కన్నేశారు. నిధులు, వనరుల సమీకరణ పేరిట ఉమ్మడి గుంటూరు, విశాఖ జిల్లాల్లో పరిధిలో వేలాది కోట్ల రూపాయల విలువచేసే 69.15 ఎకరాల ప్రభుత్వ భూములను దర్జాగా అమ్ముకుందామని 2020లో ప్రయత్నాలు మొదలుపెట్టారు. మిషన్ బిల్డ్ ఏపీ పేరిట ఓ సంసను ఏర్పాటుచేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఈ భూములను అమ్మేందుకు అనుమతి ఇస్తూ 2020జూన్ 12న జీవో 172ను తెచ్చారు. అది చెల్లదని, ఎవరైనా కోర్టుకు వెళితే ఈ జీవో రద్దయిపోతుందని చెప్పినా ఆయన లక్ష్యపెట్టలేదు. ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' అప్పట్లోనే వెలుగులోకి తీసుకొచ్చింది. అయితే, అనుకున్నంత సులువుగా భూముల అమ్మకం సాధ్యపడటం లేదని ఆచరణలో తెలుసుకున్నారు. ఇందుకు ల్యాండ్ పాలసీలోని సెక్షన్ 3 (ఏ)లోని క్లాజే ప్రధాన కారణమని నాటి రెవెన్యూ అధికారులు జగన్‌కు చెప్పారు. అంతే...ఆ క్లాజ్‌ను పాలసీ నుంచే తొలగిస్తూ మరో చీకటి జీవో 243ను 2021 సెప్టెంబరు 13న జారీ చేయించారు. 2019 నవంబరు 11నుంచే ఈ సవరణ అమల్లోకి వచ్చినట్లుగా మరో అంశాన్ని జోడించడం ఇందులో పెద్ద ట్విస్టు. ఇది పాలనా పద్ధతులకు పూర్తి విరుద్ధమని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు.

అంతా ఏకపక్షమే..

ల్యాండ్ పాలసీ సవరణ గురించి జగన్ ఆనాడు మంత్రివర్గంలో చర్చించలేదు. అసెంబ్లీలో అజెండాగా చేర్చి సభ ఆమోదం కూడా తీసుకోలేదు. ఏకపక్షంగా ఒక్క కలంపోటుతో ఓ జూనియర్ అధికారితో పాలసీలో కీలకమైన అంశాలను తొలగింపచేసిన ఘనుడుగా నిలిచారు. ఈ ఉత్తర్వు బయటకొస్తే జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు తూర్పారబడతారని భయపడి వెలుగులోకి రాకుండా గోప్యంగా చీకట్లో కలిపేశారు. అప్పటికే ప్రభుత్వ జీవోలను ప్రజలకు అందుబాటులోకి రాకుండా జగన్ చేస్తున్నారు. దీంతో ఏ జీవో ఇచ్చారు...దేన్ని రద్దుచేశారో ప్రజలకు తెలియకుండా పోయింది. జగన్ సర్కారును ప్రజలు ఇంటికి పంపించిన తర్వాత ఆ నాటి చీకటి జీవోలు, ఉల్లంఘనలు బయటకొస్తున్నాయి. ఇందులోభాగంగానే జీవోలు 243, 172 వెలుగులోకి వచ్చాయి.

అప్పట్లోనే బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'

జీవో 243 చీకటి జీవోను జగన్ ప్రభుత్వం జారీ చేసినప్పుడే, 'ఆంధ్రజ్యోతి' ఆ విషయం బయటపెట్టింది. అయితే, 'ఆంధ్ర జ్యోతి' తప్పుడు వార్తలు రాస్తోందని, అబద్ధాలను ప్రచారం చేస్తోందంటూ జగన్ ప్రభుత్వం అప్పట్లో ఆగ్రహించింది. పత్రికపై కేసులు నమోదుచేయాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చారు. కానీ ఆచరణలో ఆ పనిచేయలేదు. ఎందుకంటే ఆయన చేసిన చీకటి పనులు నిజమే అన్న విషయం ఆయనకే బాగా తెలుసు కాబట్టి! ఏదో బెదిరించాలి కాబట్టి చేశారంతే. ఆ నాటి చీకటి జీఓ 243 ఇప్పుడు బయటకొచ్చింది. ఈ జీవోలో రెండు కీలకమైన అంశాలున్నాయి... ఒకటి ల్యాండ్ పాలసీ మార్చడం. రెండోది...సవరించిన పాలసీని 2019 నవంబరు 11 నుంచే అమల్లోకి తేవడం. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతోంది. ఈ జీవోలు ఇంకా అమల్లోనే ఉన్నాయి. ఇది చాలా ప్రమాదకమని రెవెన్యూనిపుణులు చెబుతున్నారు. "ఆ జీవోల వల్ల విలువైన ప్రభుత్వ భూములకు ముప్పు ఉందని రిటైర్డ్ అధికారి, రెవెన్యూ నిపుణుడు రామయ్య 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 'ఆ రెండు జీవోలు అమల్లో ఉన్నంతవరకు ప్రభుత్వ భూములకు రక్షణ లేనట్లే. కూటమి ప్రభుత్వం ఇకనైనా ఆ చీకటి జీవోలపై సమీక్ష చేసి తగిన నిర్ణయం తీసుకోవాలి. భవిష్యత్ అవసరాలు, భావితరాలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను కాపాడేలా ల్యాండ్ పాలసీని తిరిగి పునరుద్ధరించాలి" అని ఆయన సూచించారు. జగన్ జమానాలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై కూటమి సర్కారు విచారిస్తోంది. విధ్వంసమైన వ్యవస్థలను తిరిగి గాడిలో పెడుతోంది. దీంట్లో భాగంగా ఈ చీకటి జీవో 243ను కూడా సమీక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఆ క్లాజ్ ఏం చెబుతుందంటే..

'విలువైన ప్రభుత్వ భూములను అమ్మకూడదు, తాకట్టు పెట్టకూడదు, వనరుల సమీకరణకోసం ఉపయోగించుకోకూడదని భూ కేటాయింపుల పాలసీలోని సెక్షన్ 3(ఏ) చెబుతోంది. అంటే, ప్రభుత్వ భూముల అమ్మకాలపై నిషేధం ఉందన్నమాట!

ఫార్ములా ఈ-కారు రేసు కేసులో తొలుత బ్యాంకర్ విచారణ!

- అధికారులను విచారించాకే కేటీఆర్‌కు ఈడీ నోటీసులు!

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కారు రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. ముందుగా విదేశీ సంస్థకు డబ్బు బదిలీ చేసిన బ్యాంకర్‌ను విచారించనున్నట్లు తెలుస్తోంది. బ్రిటన్‌లోని ఫార్ములాఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో)కు డబ్బు చెల్లించిన హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ)ను తొలుత ప్రశ్నించనున్నట్లు సమాచారం. నాటి పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశాల మేరకు ఎఫ్‌ఈవోకు డబ్బు చెల్లించాల్సిందిగా.. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి నుంచి ఐవోబీకి సమాచారం వెళ్లింది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్ 3న రూ.22,69,63,125 మొత్తాన్ని పౌండ్ల రూపంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు చెల్లించారు. ఆ తర్వాత అక్టోబరు 11న రూ.23,01,97,500లను ఎఫ్‌ఈవో ఖాతాకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వాస్తవానికి దేశంలోని ఏ బ్యాంకు అయినా ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థలకు సంబంధించి విదేశీ కంపెనీలకు ఆయా దేశాల కరెన్సీ రూపంలో డబ్బు చెల్లించాలంటే భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ)కు సమాచారం ఇవ్వాలి. డబ్బు పంపిస్తున్న సంస్థలు ఆర్‌బీఐ అనుమతి తీసుకుని ఆ విషయాన్ని బ్యాంకర్‌కు తెలపాలి. కానీ, ఎఫ్‌ఈవో కేసు విషయంలో హెచ్ఎండీఏ.. ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. అలాంటప్పుడు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు మొత్తాన్ని హెచ్ఎండీఏ ఖాతాల నుంచి బ్రిటన్‌లోని ఎఫ్‌ఈవోకు ఎందుకు బదిలీ చేశారు? వారిపై ఏమైనా ఒత్తిళ్లున్నాయా? ఆర్‌బీఐకి సమాచారం ఇచ్చారా? లేదా? అనే విషయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఈడీ అధికారులు తదుపరి విచారణ చేపట్టవచ్చని సమాచారం. ముందుగా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయవచ్చని తెలుస్తోంది. ఏసీబీ అధికారులు తొలుత తమకు ఫిర్యాదు చేసిన పురపాలకశాఖ కార్యదర్శి దానకిషోర్ వాంగ్మూలాన్ని రికార్డు చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం నాటి పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులిచ్చి వారిని విచారించడానికి ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.


సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను సన్మానించి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏపీ హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం తదితరులు

హైకోర్టులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఘన సన్మానం

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం జస్టిస్ మిశ్రాకు శాలువా కప్పి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనం కోసం విజయవాడ వచ్చిన జస్టిస్ మిశ్రా.. న్యాయవాదుల సంఘం ఆహ్వానం మేరకు హైకోర్టుకు కూడా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జస్టిస్ మిశ్రా మాట్లాడుతూ.. ఏపీ హైకోర్టుతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సీజేగా పనిచేసిన కాలంలో ఎంతగానో ఆదరించారని అన్నారు. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఎంతో సౌమ్యులు, మంచివారని కొనియాడారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడే కేసుల సత్వర పరిష్కారం సాధ్యమని తెలిపారు. ఏపీ హైకోర్టులో బార్ అండ్ బెంచ్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీహరి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాహనాలు తిప్పకుంటే అధికారులకు చెప్పాలి

- వాహన యజమానులకు హైకోర్టు స్పష్టీకరణ.. సింగిల్ జడ్జి తీర్పు రద్దు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనాలను రోడ్లపై తిప్పబోమని యజమానులు రవాణా శాఖ అధికారులకు రాతపూర్వకంగా తెలియజేసినప్పుడు మాత్రమే వారు పన్నుల నుంచి మినహాయింపు పొందగలరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. పన్ను చెల్లింపు త్రైమాసికానికి ముందే వాహన యజమానులు స్టాపేజ్ రిపోర్ట్/నాన్ యూజ్ రిపోర్ట్‌ను అధికారులకు అందజేయాలని, లేకుంటే ఆయా వాహనాలు రోడ్లపై తిరుగుతున్నట్లు భావించి పన్ను విధించే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుందని స్పష్టం చేసింది. తమ వాహనాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని సెంట్రల్ డిస్పాచ్ యార్డ్‌లో తిరుగుతున్నాయని, ఈ ప్రాంతం పబ్లిక్ ప్లేస్ పరిధిలోకి రానందున తమకు పన్ను మినహాయింపు ఉంటుందన్న తారాచంద్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వాదన ఏపీ మోటార్ వాహన పన్ను నిబంధన 12ఏకి విరుద్ధమని ప్రకటించింది. తారాచంద్ సంస్థ పన్ను రూపంలో చెల్లించిన రూ 22.71 కోట్లను వెనక్కివ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం రద్దు చేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. తారాచంద్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఐరన్ స్టోరేజ్, నిర్వహణ కాంట్రాక్టు దక్కించుకొంది. ఇందుకోసం 36 వాహనాలను ఏర్పాటు చేసింది. అప్పటి వరకు ఆ వాహనాలను రోడ్లపై తిప్పినందుకు సంస్థ పన్ను చెల్లించింది. ఆతర్వాత పన్ను చెల్లింపు కాలపరిమితి ముగియడంతో రూ.22.71 కోట్ల పన్ను చెల్లించాలంటూ అధికారులు నోటీసులు పంపడంతో సంస్థ పన్ను చెల్లించింది. అయితే తమ వాహనాలు స్టీల్ ప్లాంట్ లోపల ఉన్న సెంట్రల్ డిస్పాచ్ యార్డ్‌లోనే తిరుగుతున్నప్పటికీ అధికారులు పన్ను వసూలు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి తారాచంద్ సంస్థ చెల్లించిన రూ.22.71 కోట్లను వెనక్కివ్వాలని అధికారులను ఆదేశిస్తూ 2023 జూన్ 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ రవాణాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం పన్నుల నుంచి మినహాయింపు పొందాలంటే పన్ను చెల్లింపు త్రైమాసికం మొదలు కావడానికి ముందే వాహన యజమాని స్టాపేజ్ రిపోర్ట్/నాన్ యూజ్ రిపోర్ట్ అధికారులకు అందజేయాలని స్పష్టం చేసింది. అలా చేయకుంటే వాహనాలు వినియోగిస్తున్నారా?లేదా? అనే విషయంతో సంబంధం లేకుండా పన్ను చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది.



పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి

'మహిళలకు ఉచిత బస్సు'పై కమిటీ

» పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఈ దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న మహిళల ఉచిత బస్సు పథకం అమలును అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేసింది. రవాణా శాఖ మంత్రి ఛైర్మన్‌గా, హోంమంత్రి, మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సభ్యులుగా ఉండే కమిటీకి రవాణా, రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శిని కన్వీనర్‌గా నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం జీవో జారీ చేశారు. వీలైనంత త్వరగా ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం తెలంగాణ, కర్ణాటకలో ప్రస్తుతం అమల్లో ఉంది. ఆ రాష్ట్రాల్లో మంత్రుల కమిటీ పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది.

త్వరలో 2 వేల ఎలక్ట్రికల్ బస్సు సర్వీసులు

» రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పార్వతీపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీతోపాటు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి పార్వతీపురంలో అత్యాధునిక హంగులతో బస్టాండ్ నిర్మిస్తామన్నారు. వెనకబడిన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాను తమ ప్రభుత్వం అన్నివిధాలా అభివృద్ధి చేస్తుందని చెప్పారు. అనంతరం ఆయన పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధునాతన క్రీడాప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేశారు. నర్సీపురంలో ఆర్టీసీ సిబ్బంది శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సీతానగరంలో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పార్టీ శ్రేణులు, అధికారులు ఉన్నారు.

ఉచిత బస్సుపై ప్రభుత్వానికి నిబద్ధత లేదు: షర్మిల

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై కూటమి ప్రభుత్వానికి నిబద్ధత లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి విమర్శించారు. కాలయాపన తప్ప ఇచ్చిన హామీని నిలబెట్టుకునే బాధ్యత కనిపించడం లేదని శనివారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లో పండుగలు, పబ్బాలు పేరు చెప్పి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని దాటవేశారని అన్నారు. బస్సులు కొంటున్నామని చెప్పుకొచ్చారని.. ఇప్పుడు మంత్రివర్గ ఉపసంఘం పేరుతో మరికొన్ని రోజుల సాగతీతకు సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంలో ఇన్ని బాలారిష్టాలు ఎందుకని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. తెలంగాణ, కర్ణాటకల్లో అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశాయని షర్మిల చెప్పారు. జీరో టికెట్ల కింద నెలకు రూ.300 కోట్లు ఆర్టీసీకి చెల్లించడానికి నిధులు లేవా? అని ప్రశ్నించారు. నూతన సంవత్సర కానుకగానైనా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తారా? లేదా? అని నిలదీశారు.

జగన్ వల్ల 30% పెరిగిన రాజధాని నిర్మాణ ఖర్చు

» ఈ డబ్బులు జగన్ తన జేబులో నుంచి ఇవ్వాలి: టీడీపీ

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పిచ్చి చేష్టల వల్ల రాజధాని అమరావతి నిర్మాణ ఖర్చు 30% పెరిగిందని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఈ ఖర్చు పెరగడానికి జగనే కారణమని, ఈ డబ్బులు తన జేబులో నుంచి ఇస్తారో ఇవ్వరో ఆయన సమాధానం చెప్పాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. శనివారం ఇక్కడ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు విలేకరులతో మాట్లాడారు. 'అమరావతిపై విద్వేషంతో జగన్ ఐదేళ్లపాటు రాజధాని నిర్మాణ పనులు నిలిపివేశారు. ఇప్పుడు పనులు మొదలు పెట్టేసరికి నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ప్రతి పని ఖర్చు కనీసం 30 శాతం పెరిగిందని అధికారులు అంచనా వేశారు. ఈ అదనపు ఖర్చుకు ప్రజల డబ్బే ఖర్చు చేయాల్సి వస్తోంది. పనులు ఆపకుండా కొనసాగించి ఉంటే ఈ అదనపు ఖర్చు ఉండేది కాదు. ఈ సరికి రాజధాని నిర్మాణం పూర్తయి ఉండేది. జగన్ విద్వేషపూరిత వ్యవహార శైలి వల్ల రాష్ట్రంలో రూ.వేల కోట్ల అదనపు భారం పడింది. ఇది ప్రజల దృష్టికి రాకుండా అమరావతి నిర్మాణానికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని జగన్ తన మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. జగన్ మీడియా ఒళ్లు దగ్గర పెట్టుకొని వార్తలు ఇవ్వాలి. జగన్ చెప్పాడని నోటికి వచ్చినట్లు అసత్యాలు ప్రచారం చేస్తే తీవ్రంగా తీసుకొంటాం. కూటమి ప్రభుత్వం నానా తిప్పలు పడి రాజధాని నిర్మాణం చేస్తుంటే బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ ఇంకా పాత ఆలోచనలతోనే ప్రయాణిస్తే ఈసారి 11 సీట్లు కూడా రావు' అని అశోక్ అన్నారు.

ఉద్ధరిస్తే.. 5 లక్షల మంది ఎందుకు తగ్గారు

» జగన్ సమాధానం చెప్పాలి: పీతల సుజాత

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తన హయాంలో విద్యారంగాన్ని ఎంతో ఉద్ధరించానని చెబుతున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అదే కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారో సమాధానం చెప్పాలని టీడీపీ డిమాండ్ చేసింది. జగన్ పనికిమాలిన ప్రయోగాలతో పేద ప్రజానీకం ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారని, లక్షల సంఖ్యలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుంచి మాన్పించారని ఆ పార్టీ విమర్శించింది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి పీతల సుజాత శనివారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వం జీవో 117 తెచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలవారు ఉండే ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేసి వాటిని వేరేచోటకు తరలించింది. దూరంగా ఉన్న పాఠశాలలకు పంపించే అవకాశం లేక తల్లిదండ్రులు పిల్లలను మానిపించారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పిన జగన్ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. దీనితో విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం 94 ఉంటే జగన్ హయాంలో అది 70- 75%కి పడిపోయింది. దానికి కారణం ఏమిటో జగన్ మాట్లాడరు. ఉపాధ్యాయులకు చదువు తప్ప ఇతరత్రా అనేక పనులు అప్పగించారు. చివరకు మద్యం షాపుల వద్ద వారిని కాపలా పెట్టిన ఘనత కూడా ఆయనకే దక్కింది' అని సుజాత విమర్శించారు.

కక్ష సాధింపు నా విధానం కాదు: అచ్చెన్న

టెక్కలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నన్ను ఎన్నో ఇబ్బందులకు గురిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేను ప్రత్యర్థులపై కొరడా ఝుళిపిస్తానని అందరూ భావించారు. కానీ, కక్షసాధింపు చర్యలు నా విధానం కాదు. నాకు ఎవరిపైనా కోపమూ, ద్వేషము లేదు. కక్ష సాధిస్తున్నానని కొన్ని పిచ్చి కుక్కలు మొరుగుతున్నాయి. నేను తలచుకుంటే ఏ ఒక్కరూ మిగలరు. కోపం అనే పదమే నా నుంచి దూరమైంది. ఎవరైనా తప్పు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని మంత్రి అచ్చెన్న అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఒక్క బీటీ, సీసీ రోడ్డు అయినా వేశారా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.4,600 కోట్లు ఖర్చుపెట్టి ఊరూరా రోడ్లు వేస్తున్నాం. ప్రతి రైతుకి అన్నదాత సుఖీభవ కింద కేంద్రం ఇస్తున్న రూ.6 వేలు, రాష్ట్రం నుంచి రూ.14 వేలుతో కలిపి రూ.20 వేలు అందిస్తాం. వైసీపీ నాయకుల ఆందోళనలో అర్థం లేదు. ఇటీవల రైతు ధర్నా అని ఎందుకు చేశారో వారికే తెలియదు. మా ప్రభుత్వం రైతు దగ్గర నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తుంది' అని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

తండాల అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సందర్శించారు. ఈ సందర్భంగా వాజంగి జంక్షన్‌లో గుమ్మంతి నుంచి రాచకీలం మీదుగా రెడ్డిపాలెం వరకూ రూ.5.86 కోట్లతో, సమీధ నుంచి తట్టబూడి మీదుగా చింతపాక వరకూ రూ.16.67 కోట్లతో నిర్మించనున్న రోడ్లు సహా మొత్తం రూ.105 కోట్లతో 19 రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గిరిజనులతో మాట్లాడి డోలీ మోతల గురించి అడిగి తెలుసుకుని చలించిపోయారు. తర్వాత బల్లగరువులో సభా ప్రాంగణం వద్దకు చేరుకుని.. గిరిజన కళాకారులతో కలిసి థింసా నృత్యం చేశారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయించారు. ఐసీడీఎస్, జీసీసీ, వన్ వికాస్ కేంద్రాలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడారు. 'ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గిరిజనులు మంచి మనసున్నవారు. వారి ఆచార, సంప్రదాయాలంటే నాకు చాలా ఇష్టం. రాష్ట్రంలో డోలీమోతలు లేకుండా అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మిస్తాం. డోలీ మోతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. జిల్లాలో 90 శాతం గిరిజన గ్రామాలకు పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా రోడ్లు వేసేందుకు కృషిచేస్తున్నాం. వంద మంది కంటే ఎక్కువ జనాభా కలిగి ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించాలని నిర్ణయించాం. గిరిజన ప్రాంతాల్లో ప్రతి రెండు నెలలకు ఒకసారి పర్యటిస్తా. వారి అభ్యున్నతికి కృషిచేస్తా. ఐదేళ్ల తర్వాత మా పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వాలి' అని గిరిజనులకు సూచించారు. ఈ 19 రోడ్ల వల్ల 4,500 మంది జనాభాకు ప్రయోజనం కలుగుతుందన్నారు. రోడ్ల కోసం జనవరి నెలలో మరో రూ.250 కోట్లు విడుదల చేస్తామని, రహదారుల నిర్మాణానికి దశల వారీగా రూ.2,869 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతగిరి మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తామన్నారు. గిరిజన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, వారి పంటలకు మార్కెటింగ్ సదుపాయం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గిరిజనులు ఇళ్లు నిర్మించుకునేందుకు అదనపు నిధుల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో అదాలత్ ఏర్పాటుచేసి, గిరిజనులకు పట్టాలను మంజూరు చేస్తామని చెప్పారు. జీవో నంబర్ 3 విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.



వాజంగి నుంచి కాలినడకన బల్లగరువు వెళుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



బల్లగరువులో థింసా నృత్య కళాకారులతో డిప్యూటీ సీఎం పవన్

జీవితాలు నాశనం చేసుకుంటున్నారు

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా స్వచ్ఛ సంకల్పం పేరుతో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఉపముఖ్యమంత్రి ఆవిష్కరించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా, సాగు వంటి వాటికి దూరంగా ఉండాలని వారికి పిలుపిచ్చారు. జిల్లాను, రాష్ట్రాన్ని గంజాయి రహితంగా చేసేందుకు ముందుకు రావాలన్నారు. గిరిజన యువత పర్యాటకంపై దృష్టిపెట్టాలని.. 2-3 గ్రామాలను కలిపి.. పర్యాటకంగా విడిది గదులను ఏర్పాటుచేసి, మంచి ఆదాయం పొందవచ్చని పవన్ సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి గిరిజనులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, కొప్పుల వెలమ సంఘం చైర్మన్ పీవీజీ కుమార్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సివేరి దొన్నుదొర, కలెక్టర్ దినేశ్‌కుమార్, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎస్పీ ప్రమోద్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, ఈఈ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల్లో 60 వేల మందికి పదవులు

» 100% పదవులు కూటమి గెలుచుకొంది: నిమ్మల

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో చిన్నా పెద్దా పదవుల్లో 60,000 మందికి అవకాశం దక్కిందని సాగునీటి మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వందకు వంద శాతం పదవులను కూటమి పార్టీలు గెలుచుకొన్నాయని ఆయన చెప్పారు. శనివారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'నీటి సంఘాల్లో ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులుగా 48 వేల మంది గెలిచారు. ఆరు వేల మంది నీటి సంఘాల అధ్యక్షులుగా, మరో 6,000 మంది ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లుగా 267 మంది, ఉప చైర్మన్లుగా 267 మంది నెగ్గారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్లుగా 58 మంది, ఉపాధ్యక్షులుగా 58 మంది గెలుపొందారు. మొత్తం మీద 60 వేల మంది ఈ ఎన్నికల్లో నెగ్గారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీలు 93% స్ట్రైక్ రేటుతో విజయం సాధిస్తే ఈ ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించాయి. సాగునీటి సంఘాల్లో మొత్తం కోటి మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వారందరి భాగస్వామ్యంతో కూటమి అభ్యర్థులు గెలిచారు. రైతులు ఇచ్చిన మద్దతును స్ఫూర్తిగా తీసుకొని సాగునీటి రంగాన్ని ముందుకు తీసుకువెళ్తాం. రాష్ట్రంలోని ప్రతి మూలకూ సాగునీరు చేర్చాలన్న మా ఆలోచనలు సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నెరవేరతాయని ఆశిస్తున్నాం' అని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు.

గోపిరెడ్డి ఆదేశించారు... సీఐ బెదిరించారు

» భయపెట్టి 24 లక్షలు వసూలు చేశారు

» గత ప్రభుత్వంలో బార్‌కు టెండర్ వేసిన బాధితుడి ఆవేదన

» వైసీపీ నేతల భూదందాలపై టీడీపీకి ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి పార్థసారథి, టీడీపీ నేత అశోక్‌బాబు తదితరులు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల అరాచకాలతో అవస్థలు పడుతున్న అనేక మంది బాధితులు టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశారు. న్యాయం కోసం టీడీపీ నేతలకు మొరపెట్టుకున్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి పార్థసారథి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, యూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. నరసరావుపేటకు చెందిన నాదెండ్ల రంగారావు మాట్లాడుతూ 'గత ప్రభుత్వంలో లిక్కర్ బార్‌కు టెండర్ వేయడానికి ప్రయత్నించా. అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆదేశాలతో టూటౌన్ సీఐ వెంకటరావు నన్ను కేసులో ఇరికిస్తానని బెదిరించాడు. అయినా టెండర్ దక్కించుకుని, లైసెన్స్ ఫీజు చెల్లించాను. ఎక్సైజ్ అధికారులు లైసెన్స్ పత్రాలు ఇవ్వకుండా గోపిరెడ్డితో మాట్లాడాలని చెప్పారు. నన్ను బెదిరించి రూ.24 లక్షలు తీసుకున్న పిల్లి ఓబులరెడ్డి, బీరం భాస్కర్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలి. ఆ డబ్బు తిరిగి ఇప్పించాలి' అని కోరారు. 'గత ప్రభుత్వం భూముల రీసర్వే చేసిన సమయంలో నా పొలానికి రికార్డుల్లో వైసీపీ నేత అక్రమంగా తన పేరు నమోదు చేయించుకున్నాడు. విచారించి, న్యాయం చేయాలి' అని పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయిగూడెంకు చెందిన సజ్జనకుమార్ విజ్ఞప్తి చేశారు. తన స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆత్మకూరుకు చెందిన మునీర్ అహ్మద్ వేడుకున్నారు. తమ భూమిని పెద్దిరాజు అనే వ్యక్తి కబ్జా చేశాడని నరసాపురానికి చెందిన వీ వెంకటేశ్వర్లు వాపోయారు. 'నా భూమిని వైసీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు' అని రంపచోడవరం మండలం ఇర్లపల్లికి చెందిన రామకృష్ణదొర వాపోయారు. తమ భూముల్ని, చుక్కల భూములుగా చూపడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదని శ్రీసత్యసాయి జిల్లా గుంకేపల్లి రైతులు వాపోయారు.

రజినీ మరిది.. మామూలోడు కాదు!

» క్రషర్ యజమానిని బెదిరించడంలో మాజీ మంత్రి మరిది గోపీది కీలక పాత్ర

» వదిన చెప్పింది.. ఆయన అమలు చేశాడు

» రూ.2.20 కోట్ల వ్యవహారంలో కొత్త కోణం

» విజిలెన్స్ దర్యాప్తులో వెలుగుచూసిన వైనం



గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రి పదవిని అడ్డు పెట్టుకుని వైసీపీ నాయకురాలు, అప్పటి మంత్రి విడదల రజిని, ఆమె కుటుంబ సభ్యులు దౌర్జన్యకాండ సాగించారు. పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.2.20 కోట్లు కాజేసిన వ్యవహారంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో మాజీ మంత్రి రజిని, అప్పటి విజిలెన్స్ ఏఎస్పీ జాషువా, రజిని పీఏల పాత్రను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. తాజాగా.. మరో ముఖ్య పేరును తెరపైకి తెచ్చారు. క్రషర్ కంపెనీ యజమాని నంబూరి శ్రీనివాసరావు తదితరులను బెదిరించిన వ్యవహారంలో రజినీ మరిది విడదల గోపి కూడా ప్రముఖ పాత్ర పోషించినట్లు విచారణ నివేదికలో వెల్లడించారు. ఈ వ్యవహారంలో క్రషర్ యజమానిని తొలుత రూ.5 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. దీంతో ఆయన అప్పటి వైసీపీ ముఖ్యనేత వద్దకు వెళ్లి అంత ఇవ్వలేనని వేడుకున్నారు. అయినా ఎవరూ కనికరించలేదు. ఈ సంగతి తెలుసుకున్న రజినీ బృందం మరింత వేధించింది. రూ.5 కోట్ల కోసం మొదట రజినీ పీఏనే బెదిరించినట్లు తెలిసింది. ఆతర్వాత ఆమె మరిది గోపి రంగంలోకి దిగారు. అయినా బాధితులు వినకపోవడంతో విజిలెన్స్ ఏఎస్పీ జాషువాతో నకిలీ దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేశారు. జాషువా రంగంలోకి దిగిన తర్వాతే బాధితులు ఎంతో కొంత ఇచ్చి రాజీ చేసుకోవాలన్న ఆలోచనలోకి వచ్చారు. ఈ వ్యవహారంలో అప్పట్లో విజిలెన్స్‌లో పనిచేసిన డీఎస్పీ, సీఐ కూడా కీలకమైన పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. రజినీ మరిదిపై కూడా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో కోరినట్లు తెలిసింది.

రేపో మాపో రజినీపై ఏసీబీ కేసు

వైసీపీ హయాంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన విడదల రజినీపై రేపో మాపో ఏసీబీ కేసు నమోదు చేయనుంది. శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని నంబూరి శ్రీనివాసరావు తదితరులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు రజినీ రూ.2 కోట్లు, ఏఎస్పీ జాషువా రూ.10 లక్షలు, రజినీ పీఏ రూ.10 లక్షలు తీసుకున్నారన్న ఆధారాలను కూడా సేకరించారు. మంత్రి పదవిలో ఉండి రజినీ ముడుపులు స్వీకరించడం అవినీతి నిరోధక చట్టం కిందకు వస్తుంది కాబట్టి విజిలెన్స్ అధికారులు ఏసీబీ కేసుకు సిఫారసు చేశారు. ప్రభుత్వం ఆమెపై ఏసీబీ కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసు బాధ్యతను సీనియర్ అధికారికి అప్పగించాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది.

అప్రూవర్లుగా అధికారులు!

క్రషర్ యజమానులను బెదిరించి డబ్బులు దండుకున్న కేసులో పలువురు అధికారులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఒకరిద్దరు అప్రూవర్లుగా మారారన్న ప్రచారం జరుగుతోంది. "రజినీ చెబితేనే అలా చేశాం" అని వీరు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రికి మరింత ఉచ్చు బిగుస్తుందని ఓ అధికారి చెప్పారు.


రష్యాపై 9/11 తరహా దాడులు

» 8 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్



కజాన్, డిసెంబరు 21: రష్యాపై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్లతో విరుచుకుపడింది. కజాన్ నగరంలోని నివాస భవనాలే లక్ష్యంగా దాడులు జరిపింది. ఎత్తైన నివాస సముదాయాలపై 8 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసినట్లు గుర్తించామని అంతర్జాతీయ మీడియా సంస్థలు శనివారం తెలిపాయి. ఈ దాడులను 2001లో న్యూయార్క్ నగరంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లను విమానాలు ఢీకొట్టిన 9/11 దాడులతో పోల్చాయి. శనివారం ఉదయం కజాన్ నగరంలోని నివాస సముదాయాల్లోకి 2 డ్రోన్లు దూసుకెళ్లి పేలిపోవడంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది. అలాగే ఉక్రెయిన్ ప్రయోగించిన మరో 6 డ్రోన్లను రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు అత్యంత సమర్థంగా అడ్డుకున్నట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

జస్టిస్ లోకుర్‌కు ఐరాస పదవి



ఐక్యరాజ్యసమితి, డిసెంబరు 21: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్‌కు ఐక్యరాజ్యసమితి పదవి వరించింది. ఆయన ఐరాస అంతర్గత న్యాయ మండలి (ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్-ఐజేసీ) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఐరాస న్యాయవ్యవస్థ స్వతంత్రత, వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనంతో పనిచేసేలా చూడడం ఈ కౌన్సిల్ లక్ష్యం. ఐరాస పరిధిలోని ట్రైబ్యునళ్ల జడ్జీలను ఎంపిక చేయడం కూడా దీని బాధ్యత. జస్టిస్ లోకుర్ ఈ పదవిలో నాలుగేళ్ల పాటు అంటే 2028 నవంబరు 12వ తేదీ వరకు కొనసాగనున్నారు.

జర్మనీలో సైకియాట్రిస్ట్ దుర్మార్గం

» కారుతో క్రిస్మస్ మార్కెట్‌పైకి దూసుకెళ్లిన డాక్టర్

» ఐదుగురి మృతి..200 మందికి గాయాలు

మగ్డేబర్గ్, డిసెంబరు 21: జర్మనీలో ఓ సైకియాట్రిస్ట్ సైకోగా మారాడు. క్రిస్మస్ సందర్భంగా మగ్డేబర్గ్ మార్కెట్లో షాపింగ్ చేస్తున్న పౌరులపైకి విచక్షణారహితంగా.. అతి వేగంతో కారుతో దూసుకెళ్లాడు. సుమారు 400 మీటర్ల దూరం వరకు అతని అరాచకం కొనసాగింది. ఈ ఘటనలో ఒక చిన్నారి సహా.. ఐదుగురు పౌరులు మృతిచెందారు. 200 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఘటనాస్థలిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని సౌదీ అరేబియాకు చెందిన తాలెబ్.ఎ.బెర్లిన్ అనే 50 ఏళ్ల వయసున్న సైకియాట్రిస్ట్/సైకోథెరపిస్ట్‌గా గుర్తించారు.

ప్రపంచానికే నైపుణ్య రాజధాని భారత్!

కువైత్‌లో ప్రవాసభారతీయులతో మోదీ.. నేడు ఆ దేశ రాజు, ప్రధానితో సమావేశం

కువైత్ సిటీ, డిసెంబరు 21: భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రపంచానికే నైపుణ్య రాజధాని అయ్యే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ అన్నారు. రానున్న కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచంలోనే అత్యంత యువ దేశంగా భారత్ ఉంటుందని పేర్కొన్నారు. కువైత్ రాజు షేక్ మిషాల్ అల్ అహ్మద్ అల్ జుబేర్ అల్ సబహ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైత్‌కు చేరుకున్న ప్రధాని.. ఇక్కడి షేక్ సాద్ అల్ అబ్దుల్లా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. "మీరందరూ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని ఇలా చూస్తుంటే ఇక్కడ మినీ భారతదేశమే ఉన్నట్టుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఏటా భారతదేశం నుంచి కువైత్‌కు వస్తున్న వందలాది మంది భారతీయులు కువైత్ సమాజానికి భారతీయ ఆత్మను జోడిస్తారు. కువైత్ కాన్వాస్‌ను.. భారతీయ నైపుణ్యాలు, ప్రతిభతో నింపేస్తారు" అని మోదీ కొనియాడారు. నలభైమూడేళ్ల క్రితం.. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత.. ఒక భారత ప్రధాని కువైత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆ విషయాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. "ఇక్కడి నుంచి ఇండియాకు రావడానికి మీకు పట్టేది నాలుగు గంటలే. కానీ.. ఒక భారత ప్రధాని కువైత్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది" అని పేర్కొన్నారు.



హండాతో మోదీ కరచాలనం

మాటకు కట్టుబడి..

'ఎక్స్' వేదికగా తాను ఇచ్చిన మాట ప్రకారం ఇండియన్ ఫారిన్ సర్వీస్ మాజీ అధికారి, 101 సంవత్సరాల వయోవృద్ధుడు అయిన మంగళ్ సెయిన్ హండాను మోదీ ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. తన తాత మంగళ్ హండా ప్రధాని వీరాభిమాని అని.. కువైత్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన్ను కలిసి మాట్లాడాలని హండా మనవరాలు శ్రేయ జునేజా 'ఎక్స్' వేదికగా ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తప్పకుండా కలుస్తానని మోదీ ఎక్స్‌లోనే ఆమెకు సమాధానమిచ్చారు. నిజానికి మంగళ్ హండా 100వ పుట్టినరోజు సందర్భంగానే ప్రధాని మోదీ ఆయనకు వ్యక్తిగత లేఖ ద్వారా గతంలో శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు ప్రధాని వ్యక్తిగతంగా తనను కలవడంతో ఎంతగానో సంతోషించారు. కాగా.. ప్రధాని మోదీ ఆదివారంనాడు కువైత్ రాజును, ప్రధానమంత్రిని కలవనున్నారు.

మోదీకి సాదర స్వాగతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం కువైట్ చేరుకున్నారు. కువైట్ రాజు ఆహ్వానం మేరకు అక్కడకు చేరుకున్న మోదీకి ఆ దేశ ఉప ప్రధాని షేక్ ఫహద్ యూసుఫ్ సౌద్ అల్ సబహ్ విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు. అక్కడకు చేరుకున్న అనంతరం ప్రధాని 'సలామ్ మోదీ' కార్యక్రమంలో భాగంగా మొదట ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఓ వైపు ప్రవాస భారతీయులంతా చప్పట్లు, వందేమాతరం నినాదాలతో హోరెత్తిస్తుండగా అక్కడున్న వారందరినీ మోదీ పలకరించారు. రామాయణం, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బెరూన్, ఈ ఇతిహాసాలను అరబిక్‌లో ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ సెనెఫ్‌లను మోదీ పలకరించారు. ఈ పర్యటనలో అరేబియన్ గల్ఫ్ కప్ ఫుట్ బాల్ ప్రారంభ పోటీలకు మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు డిసెంబరు 1 అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ధ్యానాన్ని తమ జీవితంలో ఓ భాగం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని రన్ ఆఫ్ కచ్‌లో జరుగుతున్న 'రన్ ఉత్సవ్'లో పాలుపంచుకోవాల్సిందిగా మోదీ అందరికీ ఆహ్వానం పలికారు.

ఎన్నికల వీడియోలు ఎవరికీ ఇవ్వొద్దు

» ప్రజల తనిఖీకి అవకాశం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 21: ఎన్నికల ప్రక్రియపై మరో వివాదం నెలకొంది. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారం ఎవరికీ ఇవ్వాల్సిన పనిలేదంటూ కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించడంపై విమర్శలు వస్తున్నాయి. హరియాణా ఎన్నికలపై కోర్టుల్లో పలు వ్యాజ్యాలు దాఖలవుతున్న నేపథ్యంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకొంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారమైన సీసీటీవీ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులను ప్రజల తనిఖీ నిమిత్తం ఇవ్వాల్సిన పనిలేదని కేంద్రం తెలిపింది. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 92(3)(ఏ)లో "ఎన్నికలకు సంబంధించిన ఇతర పత్రాలన్నీ ప్రజల తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచాలి" అని ఉంది. కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం ఈ నిబంధనలో సవరణ చేసింది. "ఎన్నికలకు సంబంధించి ఈ నిబంధనల్లో ప్రత్యేకంగా పేర్కొన్న పత్రాలను మాత్రమే ప్రజల తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచాలి" అని పేర్కొంది. 'అన్ని పత్రాలు' అన్న మాటలకు బదులుగా 'ఈ రూల్స్‌లో పేర్కొన్న పత్రాలు' అన్న సవరణ చేసింది. అంటే ఆ నిబంధనల్లో సీసీటీవీ ఫుటేజీ, వీడియోలు వంటి ప్రస్తావనలు లేకపోవడంతో వాటిని ఇవ్వాల్సిన పనిలేదు. ఎలక్ట్రానిక్ సమాచారం దుర్వినియోగమవుతున్నందువల్లనే ఈ సిఫార్సు చేసినట్టు ఎన్నికల సంఘం అధికారి ఒకరు చెప్పారు. అయితే, "నిబంధనలను సవరించినప్పటికీ పోటీ చేసిన అభ్యర్థులకు మొత్తం సమాచారం అందుబాటులో ఉంటుంది. ఎవరైనా కోర్టును ఆశ్రయించి ఎలక్ట్రానిక్ సమాచారం పొందవచ్చు" అని ఆయన వివరించారు. హరియాణా ఎన్నికలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ, వీడియోలు కావాలని న్యాయవాది మెహమూద్ ప్రాచా అక్కడి హైకోర్టును ఆశ్రయించగా అందుకు అనుకూలంగా ఆదేశాలు ఇచ్చింది. వాటిని అడ్డుకునేందుకే ఈరూల్స్‌ను సడలించారన్న విమర్శలు వస్తున్నాయి.



చంద్ర యాగపగోళ్ కుటుంబం (ఫైల్)

కారుపై పడ్డ కంటెయినర్

» బెంగళూరు లో ఘోర రోడ్డు ప్రమాదం

» ఇద్దరు పిల్లలు సహా ఆరుగురి మృతి

బెంగళూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారులో రోడ్డుపై వెళుతున్న కారుపై ఎదురుగా వస్తూ అదుపుతప్పిన కంటెయినర్ పడటంతో ఓ కుటుంబంలోని మొత్తం ఆరుగురు అక్కడికక్కడే కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. ముందు వెళుతున్న కారు ఒక్కసారిగా ఆగడంతో దాన్ని తప్పించబోయిన కంటెయినర్.. డివైడర్ ఎక్కి పక్కరోడ్డుపైకి వెళ్లింది. ఎదురుగా వస్తున్న మరో కంటెయినర్‌ను తప్పించే క్రమంలో అది అటుగా వస్తున్న కారుపై పడింది. దీంతో కారులో ఉన్న ఐఏఎస్‌టీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ సీఈఓ చంద్ర యాగపగోళ్ (48), ఆయన భార్య గౌరాబాయి (42), కుమారుడు ధ్యాన్ (16), కూతుళ్లు దీక్ష (12), ఆర్య(8), సోదరుడి భార్య (36) మృతి చెందారు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా మొరబగి గ్రామానికి చెందిన చంద్ర యాగపగోళ్ బెంగళూరు హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లో నివాసం ఉంటున్నారు.

ఏపీలో 22 శాతం అడవులు

» కేంద్ర అటవీ శాఖ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 22.63 శాతం, తెలంగాణలో 24.70 శాతం అడవులు ఉన్నాయని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. దేశంలో గత రెండేళ్లుగా అటవీ విస్తీర్ణం, సంబంధింత ఇతర అంశాలపై 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు (ఐఎస్ఎఫ్ఆర్) 2023' పేరుతో కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ శనివారం నివేదికను విడుదల చేశారు. దీని ప్రకారం, ఏపీలో అటవీ విస్తీర్ణం 30,084.96 చదరపు కిలోమీటర్లుగా ఉంది. అత్యధిక సాంద్రత ఉన్న అడవి 1,995.71 చ.కి.మీ, మధ్యస్థ సాంద్రత ఉన్న అడవి 13,725.75 చ.కి.మీ, ఓపెన్ ఫారెస్ట్ 14,363.50 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్నాయి. అంతేగాక పొదలు 8,351.62 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

అంబేద్కర్‌పై షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం

న్యూఢిల్లీ, డిసెంబర్ 21(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. ఈ మేరకు దశలవారీగా ఆందోళనలు, నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం విడుదల చేశారు. అంబేద్కర్‌ను అవమానించినందుకు అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు తెలపాలని అందులో పిలుపునిచ్చారు. ఈ నెల 22, 23 తేదీల్లో అమిత్ షా తీరును మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. 24న అన్ని జిల్లాల్లో అంబేద్కర్ సమ్మాన్ మార్చ్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లాలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. చివరి దశలో రాష్ట్రపతికి మెమోరాండం అందిస్తామని తెలిపారు.

టోల్ రుసుము శాశ్వతం కాదు

» నిరంతరం వసూలు చేస్తామంటే నిరంకుశత్వమే: సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 21: మౌలిక వసతుల ప్రాజెక్టుల అమల్లో అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని నొక్కి చెబుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. టోల్ రుసుము వసూలు శాశ్వత ప్రక్రియ ఏమీ కాదని స్పష్టం చేసింది. దాన్ని నిరంతరం వసూలు చేస్తామంటే అది నిరంకుశత్వం కిందకే వస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనానికి ఉద్దేశించినవే తప్ప ప్రయివేటు సంస్థలు లాభాలు ఆర్జించడానికి కాదని తెలిపింది. ప్రజానీకంపై భారం మోపుతూ అన్యాయంగా ఇతరులకు లాభాలు వచ్చేలా సహకరిస్తామంటే అనుమతించబోమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం వెలువరించిన తీర్పులో తెలిపింది. ఢిల్లీ-నోయిడా డైరెక్ట్ (డీఎన్‌డీ) ఫ్లై వేపై టోల్ రుసుము వసూలు విషయమై కుదిరిన రాయితీ ఒప్పందాన్ని 2016లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నోయిడా టోల్ బ్రిడ్జి కంపెనీ(ఎన్‌టీబీసీ) సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అసలు రాయతీ ఒప్పందమే లోపభూయిష్టంగా ఉందని తెలిపింది. ఉత్తమ నిబంధన ఏమిటంటే... ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే విధానాలు, నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనం కలిగించాలి. వాటి ద్వారా ఎవరూ అనుచిత లబ్ధి పొందకూడదు. ప్రజానీకానికి ఇబ్బంది పెట్టి ప్రజల ఆస్తి ద్వారా ఎవరూ అక్రమ లాభాలు పొందకూడదు. అవసరమైన ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించిందన్న కారణంతో ప్రజలు వందలాది కోట్ల రూపాయలు ఎన్‌టీబీసీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు చెల్లించేలా చేశారు. రుసుము రూపంలో ఆ ఫ్లై వేకు అయిన ఖర్చును ఎన్‌టీబీసీఎల్ తిరిగి వసూలు చేసుకుంది. లాభాలు కూడా ఆర్జించింది. అందువల్ల ఇంకా ఫీజు/టోల్ వసూలు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంలో తప్పేమీ లేదు అని పేర్కొంది. రాయితీ ఒప్పందంలోని 14వ ఆర్టికల్‌లో... టోల్‌ను శాశ్వత ప్రాతిపదికన వసూలు చేసుకోవచ్చన్న అర్థం వస్తుండడంతో దాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో కూడా హైకోర్టు నిర్ణయంతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ప్రజాప్రయోజనం అత్యధికంగా ఉండే ప్రాజెక్టులు చేపట్టే సమయంలో అధికారులు ఏకపక్ష వైఖరికి దూరంగా ఉండాలి. న్యాయమైన, పారదర్శకతతో కూడిన స్పష్టమైన విధానాన్ని అమలు చేయలి. ఈ కేసులో ప్రభుత్వం అలాంటి ప్రయత్నం చేసినట్టు కనిపించలేదు. టెండర్ల జారీ, పోటీదార్ల నుంచి కాంపిటీటివ్ బిడ్స్ ఆహ్వానించడంలో ఏ చొరవ చూపించలేదు. ప్రాజెక్టు పనులు పూర్తయినప్పటికీ అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు జరిపేందుకు తగిన కేసే' అని పేర్కొంది. యూపీ, నోయిడా, ఇతర అధికారులను తప్పుపట్టింది.

క్రెడిట్ కార్డు బకాయిలకు భారీ వడ్డీ చెల్లించాల్సిందే

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: క్రెడిట్ కార్డుల వినియోగదారులకు ఇది దుర్వార్తే! బకాయిలపై భారీగా వడ్డీ చెల్లించక తప్పదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. క్రెడిట్ కార్డుల బకాయిలు ఉంటే గతంలో బ్యాంకులు 35% నుంచి 50% వరకు వడ్డీ వసూలు చేసేవి. దీనిని సవాలు చేస్తూ ఆవాజ్ ఫౌండేషన్ దాఖలు చేసిన కేసులో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు ఇస్తూ ఇంత శాతం వడ్డీ మరీ ఎక్కువని, అన్యాయమని అభిప్రాయపడింది. వడ్డీ 30 శాతానికి మించకూడదని పరిమితి విధించింది. దీనిపై బ్యాంకులు సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశాయి. శుక్రవారం ధర్మాసనం తీర్పు ఇస్తూ ఫోరం ఆదేశాలను కొట్టివేసింది. 30 శాతం పరిమితిని ఎత్తివేసింది. బ్యాంకులు తమ నిర్ణయం మేరకు 30 శాతానికి మించి వడ్డీ రేటు విధించేందుకు అవకాశం కలిగించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.